57364
57365

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 27, 2009

2010 ముంగిట్లో

హ్యాపీ బర్త్‌డే

(2009 డిసెంబర్ 27 నుంచి 2010 జనవరి 2 వరకు)

ఎ. మున్నా
3సం॥,డిసెంబర్-28
కావ్య-శ్రీధర్
కురవి-వరంగల్

టి. అనిరుధ్
2సం॥,డిసెంబర్-2007
గీత-బుజ్జిబాబు
పూసపాటిరేగ-విజయనగరం

హేమా తనిష్క
డిసెంబర్-28
భార్గవి-సుబ్బారావు
వర్లుపల్ల-తూ॥గో॥

రిషిత్ ప్రణవ్
3సం॥,జనవరి-1
శారద-రాజశేఖర్
దోమకొండ-నిజామాబాద్



ఎం.డి.వై. సల్మన్ అదిల్
2సం॥,డిసెంబర్-28
షాంరిన్-అన్వర్
దోమల్‌గూడ-హైదరాబాద్

జి. విఘ్నేష్
5సం॥, డిసెంబర్-2004
సునీత-సాగర్‌రెడ్డి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

ఎ.అనీష్
4సం॥,జనవరి-1
సదాలక్ష్మి-మధురాం
బాగ్‌అంబర్‌పేట్-హైదరాబాద్

డి. భరద్వాజ్
1సం॥,డిసెంబర్-27
శ్రావణి-శ్రీధర్
ఆసిఫ్‌నగర్-హైదరాబాద్

ఆర్. మధురిమ
1సం॥,డిసెంబర్-28
ప్రీతి-ప్రమోద్
షాసాబ్‌గుట్ట-మ॥నగర్

జి. సాయి ఆశ్రిత
5సం॥,డిసెంబర్-27
పద్మిని-శ్రీనివాస్
రాజీవ్‌నగర్-హైదరాబాద్

పి. శిరీష
5సం॥,డిసెంబర్-27
శైలు-మోహన్
గౌరారం-మ॥నగర్

ఒ. హర్షవర్ధన్
డిసెంబర్-28
ప్రవీణ-ఆదిత్య
ధవళేశ్వరం-తూ॥గో॥

ఎం. సింధుప్రియ
2సం॥, డిసెంబర్-27
అనసూయ-దేవేందర్
హర్షగూడ-రంగారెడ్డి

పి. ఆర్తి
7సం॥, జనవరి-1
సృజన-వెంకటేశ్వర్లు
సీతారామనగర్-గుంటూరు

హేమలక్ష్మి
డిసెంబర్-29
కామేశ్వరి-మూర్తి
గజపతినగర్-విశాఖ

డి. చక్రపాణి
2సం॥,డిసెంబర్-29
లలిత-లెనిన్
చౌదరిపల్లి-మ॥నగర్

భవాని శ్రీజ
2సం॥,డిసెంబర్-30
కవిత-ఉపేందర్
చిల్లకుంట-నల్లగొండ

కె. అపూర్వ
డిసెంబర్
సుజాత-రమేష్

మనలో మాట

ప్రసాదం 'గోవిందా'!



భక్తుడికీ, భగవంతుడికీ అనుసంధానం... ప్రసాదం. అగర్‌బత్తీ కంటే పురాతనమైనది ప్రసాదం మరి. దైవ దర్శనం చేస్తే పాపం శమించే మాటెలా ఉన్నా కాసింత ఆకలి ఉపశమించే అవకాశముంది. దానిక్కారణం దేవుడి మహత్యం కాదు; గుడి పూజారి పెట్టే ప్రసాదం. చిన్నచిన్న దేవుళ్లను ఉచితంగా దర్శించడం, సముచితంగా దద్ధోజనమో, పులిహోరో, పచ్చికొబ్బరో దక్కించుకోవటం ఈజీయే! ఎటొచ్చీ, డబ్బున్న పెద్ద దేవుళ్లను సందర్శించడమే అంత ఆషామాషీ కాదు. కాసులూ కానుకలూ పక్కాగా పట్టుకొని వెళ్లినా తిరుపతి వెంకటేశ్వరుడి దర్శనం అంత సులభంగా అవ్వదు. పోనీ, కష్టపడి దర్శించినా ప్రసాదం మాత్రం దక్కదు! బహుశా ప్రపంచంలో ప్రసాదం పెట్టని దేవుడిగా తిరుపతి వెంకన్నకు గిన్నిస్ రికార్డు కూడా దక్కవచ్చు.

పంతులు లేని బడీ, ప్రసాదం లేని గుడీ ఉండవంటారు. చాలా సినిమాల్లో ప్రసాదం ఒక ఇతివృత్తం కూడా. ఇల్లు విడిచిపెట్టి పోయిన ప్రేమికులు, నిరుద్యోగులూ దేవాలయాలనే ఆశ్రయిస్తారు. అక్కడైతే టైముకింత ప్రసాదం దొరుకుతుందని ధీమా. పైసల్లేకపోయినా ప్రసాదం తిని బతికేయొచ్చన్న భరోసా.

నిజానికి ఉచిత ప్రసాదం, ఖరీదు ప్రసాదం అనే మాటలూ ఆనవాయితీలూ లేవు. దేవుళ్లకు డబ్బూ, ఆదరణా ఎక్కువయ్యేకొద్దీ 'ప్రసాద వ్యాపారం' పుట్టుకొచ్చింది. ఇప్పుడు అదే సర్వాంతర్యామి అయింది. ఉచిత ప్రసాదాన్ని అటకెక్కించింది! ఉచిత ప్రసాదంతో అనేక అవకతవకలు జరుగుతున్నాయట! ఏటా రూ.40 కోట్ల ఖర్చట! అందుకే ఈ పథకానికి పాతరేశామని పాలకమండలి ప్రవచిస్తోంది! మరి సాధారణ భక్తులవల్ల ఏటా వెంకన్న ఖజానాకు జమవుతున్న కోట్లెన్ని? సామాన్యుల మొక్కుల ద్వారా స్వామికి చేరుతున్న సొమ్మెంత? ఇతరత్రా రూపాల్లో కొండమీద సాగుతున్న కైంకర్యమెంత? దేవుడి ఆదాయంలో జరుగుతున్న స్వాహా సంగతేంటి? ఉచిత ప్రసాదానికి శఠగోపం పెట్టిన పాలకమండలి ఈ లెక్కలు కూడా తీసి ఉండాల్సింది.

అందరినీ సమానంగా చూస్తాడంటున్న దేవుడిని దర్శించడంలోనూ అనేక అంతరాలున్నాయి. పెద్దలకు ప్రత్యేక దర్శనాలు.. సామాన్య భక్తులకు పడిగాపులు... వారికి దీర్ఘ వీక్షణాలు.. వీరికి లఘు దర్శనాలు.. తరతరాలుగా సాగుతున్న ఈ అంతరాలనే సరి చేయలేని స్వామి- ప్రసాదం వ్యాపారంగా మారిపోతే మాత్రం ఏం చేయగలడు?! ఆయనో నోరూ వాయీ లేని ఓ పాత్రధారి!

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
కథ	...	8
క్రైమ్ కథ	...	12
రుచి	...	13
విజ్ఞాన వీచిక	...	17
అట్టమీది కథ	...	18
నవ్వుల్ పువ్వుల్	...	21
బాలనేస్తాలు	...	22
అరటిపండు...ఏనుగు		
ఏం మాట్లాడుకున్నాయ్?	...	24
కొత్త పుస్తకాలు	...	25
చూద్దామా	...	26
వికాసం	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

భ్రమ వాస్తవాల మధ్య దారిచూపిన కాడ్వెల్



ఆరోగ్యం... 10

ముత్యాల్లాంటి పలువరస కోసం

సినిమా కబుర్లు ... 16

వైభవ విషాదం - సావిత్రి



ఆకట్టుకున్న పుస్తకాల పండుగ

పుస్తకాల పండుగ' ఉత్సవం ముఖచిత్రంతో వచ్చిన... అట్టమీద కథ శీర్షికలో పుస్తక పఠనం విశిష్టతను, ఈ అలవాటు పెంపొందించే విశేషాలతో మమ్మాకట్టుకుంది. భూమి అంతరించదన్న భరోసానిచ్చేది కేవలం సైన్సేనన్నది విజ్ఞాన వీచిక శీర్షిక నిరూపించింది. విడాకుల కేకు, బాతుకాయ, చాక్లెట్ స్నానం, మృతుడితో మూడుముళ్ల వంటి విశేషాలతో 'తెల్సా' చాలా బాగుంది. 'నూతన తరం శిల్పాలు' ఔరా అనిపించేలా వున్నాయి. శ్రీనివాసశాస్త్రిగారి 'చూపు' కథ బాగుంది. 'చూద్దామా'లో కాశీ విశేషాలు అపురూపంగా వున్నాయి. 'బాల నేస్తాలు'లో చేసేద్దాం కాలమ్‌లో సీతాకోక చిలుకల అంశం మాకెంతో నచ్చింది. 'వికాసం' శీర్షికలోని విషయ పరంపర పెద్దలంతా చదివి ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఎంతో వుంది. వివేక్‌నాథ్, ఐశయ్యల కవితల్లో సామాజిక స్పృహ కనబడింది. 'ఆరోగ్యం' ద్వారా డా॥శ్రీకాంత్‌రెడ్డి గారందించిన వైద్య వివరాలన్నీ అవగాహనను పెంచేవిగా వున్నాయి. చూటీ కథలో ఏడుకుండలలో ఏడవకుండ నింపాడా లేదా అన్న దానికోసం వారం రోజుల నిరీక్షణ తప్పేట్టు లేదన్నమాట. 'మనలో మాట'లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా.. కోపెన్‌హెగెన్ సమావేశాల్లో పేద దేశాల పాత్ర గురించి అభివ్యక్తీకరించిన సూచనతో మేమంతా శ్రుతి కలుపుతున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

వాస్తవాలకు దర్పణం పట్టిన కవిత

రైతుల దయనీయ స్థితిని ఆకర్షించిన రైతు లేని రాజ్యం మరుభూమి' కవిత వాస్తవాలకు దర్పణం పట్టింది. రేయింబవళ్లు శ్రమించి పంట పండిస్తున్న రైతుల కష్టం దళారీ వ్యవస్థ జేబులు నింపుతోంది. గిట్టుబాటు ధరలు రాక, చేసిన అప్పులు తీర్చలేక ఎందరో రైతులు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. పంట భూములను తడపాల్సిన కాల్వలు దారి మార్చుకుని కర్మాగారాలలోని యంత్రాలను చల్లబరుస్తున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలి పేరుతో పాలకులు రైతుల భూములు గుంజుకుని వారి నేలపైనే వారిని పరాయి వారిని చేస్తున్నారు.

మాటూరి సూర్య ప్రకాష్,
ఏలేశ్వరం.

కట్టిపడేసిన కాశీ కబుర్లు

డిసెంబర్ 13వ తేదీన ఆదివారం సంచికలో కాశీ విశేషాలు ఆకర్షించాయి. భారతీయుల పుణ్యక్షేత్రాలలో వారణాసి విశిష్టత తెలిపారు. సందులలో చిందులు, స్వర్ణదేవాలయం, హిందూ విశ్వవిద్యాలయం, సారనాథ్ బౌద్ధక్షేత్రం, బోధివృక్షం వంటి విశేషాలు తెలిపారు. అయితే బిర్లా దేవాలయం గూర్చి తెలుపలేదు. మణికర్ణికా, విశాలాక్షి, హరిశ్చంద్ర వంటి ఘాట్‌ల విషయం పరిపూర్తిగా లేదు. కాశీలో తెలుగు తెలియనివారు చాలా అరుదు.

ఆచార్య నూతినారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

సామాజిక సమస్యలకు దర్పణం

అన్నదాతల యదార్థ జీవిత గాథను నగ్నంగా ఆవిష్కరించిన అద్భుతమైన కవిత "రైతులేని రాజ్యం మరుభూమి" నిజమే. పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణే అభివృద్ధి అనే వెర్రి భ్రమలతో వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తే దేశం చివరకు ఎడారిగానో, మరుభూమిగానో మిగులుతుంది. ఇదే రచయిత రచించిన 'రెక్కలు తెగిన గువ్వ', 'నిజమే కవిని కాను' అన్న కవితలను గతంలో చదివాను. అవి మంచి భావుకత్వంతో సామాజిక సమస్యలకు దర్పణం పట్టాయి. ఇదే విధంగా ప్రయత్నిస్తే అతనికి మంచి కవిగా భవిష్యత్తు వుంది.

కొట్టేటి శివకృష్ణ, పెద్దాపురం.

వాస్తవం

ఈవారం కవిత రైతులేని 'రాజ్యం మరుభూమి' రైతుల సంక్షుభిత జీవన చిత్రాన్ని, వాస్తవికంగా చిత్రించింది. రైతుల ఆత్మహత్యల వెనుకనున్న చేదు నిజాలను కళ్లకు కట్టినట్లుగా వివరించింది. దళారులొపక్క, వడ్డీ వ్యాపారస్తులో పక్క రైతు నెత్తురును పీల్చి పిప్పిచేస్తున్నారు. 'సెజ్'ల పేరుతో ప్రభుత్వమే రైతుల భూములను బలవతంగా గుంజుకుంటోంది. చివరకు ఆత్మహత్య తప్ప మరోమార్గం లేని పరిస్థితి కల్పిస్తోంది.

దీప్తి, రాజమండ్రి.

పిల్లల నేస్తం 'బాలనేస్తాలు'

నేను గత ఐదు సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా ప్రజాశక్తి అనుబంధంలోని బాలనేస్తాలు పేజీలను చదువుతున్నాను. అందులోని వింతలు, విశేషాలు, కథలు, గమ్మత్తైన సంగతులు, చిత్రాలు మమ్మల్నెంతో ఆకట్టుకుంటున్నాయి. వాటన్నింటినీ కత్తిరించి ఇటీవలే బైండింగ్ చేయించి మా స్కూల్ లైబ్రరీలో పెట్టాను. విద్యార్థులు వాటిని ఎంతగానో ఇష్టపడుతున్నారు. కానీ రంగుల్లో వుంటే ఇంకా బాగుండేదని అంటున్నారు. చివరిపేజీలోని కథలు కూడా ఆసక్తిదాయకంగా వుంటున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయి. బాలనేస్తాల నిర్వాహకులకు అభినందనలు.

కామిడి సతీష్‌రెడ్డి,
పరకాల, వరంగల్.

★



సిలువ గుర్తుతో ఆవుదూడ!

ప్రకృతి వింతలకు అంతే లేదు. అలా పుట్టుకొస్తూనే ఉంటాయి. మొన్నా మధ్య హృదయాకారాన్ని నుదుటి మీద పెట్టుకుని పుట్టిన దూడను చూశాం కదా. ఇవాళ మరో దూడ ఏకంగా శిలువ గుర్తుతోటే పుట్టేసింది. మరి ఆ వివరాల్లోకెళదాం. రోడె ఐలాండులోని డైరీ ఫామ్‌లో సరిగ్గా డిసెంబరు 1న ఓ వింత జరిగింది. నుదుటి మీద తెల్లని సిలువ గుర్తున్న దూడ జన్మించింది. మొదట దాని యజమాని బ్రాడ్ డేవిస్ ఆ గుర్తును చూడలేదట. తరువాత చూసి బోలెడంత ఆశ్చర్యపోయాడు. అంతేనా! వెంటనే దానికి మోకరిల్లాడు. పైగా అతని డైరీ ఫామ్‌లో ఇలా తలమీద తెల్లని మచ్చలతో దూడ పుట్టడం ఇదే మొదటిసారంట.



బిడ్డకు చనుబాలిస్తే... తల్లికి ఆరోగ్యం

పిల్లలకు చనుబాలు పట్టిస్తే తమ అందం తరిగిపోతుందని కొందరు తల్లులు అనుకుంటారు. కానీ చనుబాలివ్వడం వల్ల ఎన్నో రకాల జబ్బుల నుండి తల్లికి రక్షణ ఏర్పడుతుందని పరిశోధకులు చెప్తున్నారు. పాలివ్వడం వల్ల డయాబెటిస్ నుంచి రక్షణ పొందొచ్చు. తల్లి ఒక నెలరోజులపాటు చనుబాలు ఇవ్వడం వల్ల డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం నుండి సగం రక్షణ పొందవచ్చు. సీసా పాలు పట్టించిన తల్లుల రక్తంలో కంటే చనుబాలిచ్చిన తల్లుల రక్తంలో ఆరోగ్యమైన కొవ్వు, గ్లూకోస్ ఉన్నాయని పరిశోధన తెలుపుతోంది. ఇది డయాబెటిస్ రావడాన్ని 39 నుంచి 56 శాతం వరకు(పాలిచ్చిన కాలాన్ని బట్టి) తగ్గించిందని డయాబెటిస్ జర్నల్స్‌లోనూ ప్రచురించారు. గర్భవతిగా ఉన్న సమయంలో డయాబెటిస్ ఉండి, రక్తంలో అధిక గ్లూకోస్ ఉన్నవాళ్లు అలా చేయడం వల్ల తరువాత చాలా ఆరోగ్యంగా ఉన్నారు. 44శాతం నుంచి 86శాతం వరకు ప్రమాదాన్ని తప్పించుకున్నారు. చనుబాలివ్వడంవల్ల డయాబెటిస్ ఎలా తగ్గుతుందో తమకింకా తెలియడం లేదని కాలిఫోర్నియాలోని కైసర్ పర్మినెంట్ కేర్ సంస్థలో పనిచేస్తున్న డాక్టరు ఎరికా గండర్‌సన్ అంటున్నారు. బరువు తగ్గడం, శారీరక శ్రమ, ఇతర ఆరోగ్య నియమాల వల్ల ఈ ప్రభావం కనపడదని చెప్పారు. లండన్‌లో చనుబాలు ఇవ్వడం చాలా తక్కువట.

తెలుసా!

పొగ తాగే తాబేలు

చైనాలోని జిలిన్ ప్రావిన్స్‌లో ఓ తాబేలు వుంది. దాని ఎదురుగా సిగరెట్ తాగారో! ఇంక అంతే సంగతులు. తనకు కూడా సిగరెట్ ఇచ్చేవరకు నీళ్లలోంచి తల అలా బయటపెట్టి చూస్తుంటుంది. ఈ తాబేలు యజమానురాలికి కూడా సిగరెట్ తాగే అలవాటుంది. మరి ఎలా అలవాటైందో గాని ... ఇద్దరూ ఇలా సిగరెట్లు షేర్ చేసుకునేవరకు వచ్చేశారు. మొన్నామధ్య ఈవిషయాన్ని ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారా యజమానురాలు. మీడియా వారంతా చూస్తుండగానే దాని నోట్లో సిగరెట్ పెడితే నాలుగు నిమిషాల్లో ఊదిపారేసింది. అయితే వారంతా ఒకటేమని ఆశ్చర్యపోయారు. "చోద్యం కాకపోతే తాబేలు పొగ తాగడమేంటి? అయినా అక్కడా ఇక్కడా కోతులు పొగ తాగడం చూశాంగానీ... ఇలా తాబేలు సిగరెట్ తాగడం మేం చూడలేదు సుమా" అని ముక్కున వేలేసుకున్నారు. ఆ ఫొటోనే మీ ముందుంది. మరి చూసి తరించండి.



కండోమ్ తాత

పండుగలు వస్తున్నాయంటే చాలు రెస్టారెంటు వాళ్లు కస్టమర్లను ఆకర్షించడానికి వివిధ రకాల ప్రయత్నాలు చేస్తారు. బ్యాంకాక్‌లోనూ అదే జరిగింది. 'క్యాబేజెస్ అండ్ కండోమ్స్' అనే థాయ్ రెస్టారెంటులో మంచి భోజనాన్ని అందించడంతోటే సరిపుచ్చుడంలేదు. సురక్షిత శృంగారాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏర్పాట్లన్నీ క్రిస్మస్ వేడుకల కోసం. అందులో భాగంగానే శాంతాక్లజ్ బొమ్మలను కండోమ్‌లతో చేసి పెడుతున్నారు. ఇది బ్యాంకాక్‌లో ఒక పెద్ద ఆకర్షణగా ఉంది. ఇంతకీ ఈ సృజనాత్మక ఉపాయం ఎవరిదంటారా! మరెవరిదో కాదు!! రెస్టారెంటులో పనిచేసే కుర్రాళ్లదే. రెండు సంవత్సరాల నుంచి సెలవు రోజుల్లో ఈ పనిలోనే వుంటున్నారు. ఐడియా బావుందికదూ.

స్ఫూర్తి

పొట్లూరి వెంకటేశ్వరరావు,
రచయిత, అనువాదకులు.

భ్రమ వాస్తవాల మధ్య దారి చూపిన కాడ్వెల్



గ్రంథంలోని ప్రతి వాక్యం జ్ఞాననాడులను వడిసిపట్టమని హెచ్చరిస్తుంది. వాక్యం భావపు లోతుల్లో మునిగినప్పుడు నాలో "యురేకా" అన్నంత ఆనందపడేవాణ్ణి. ఈ గ్రంథం సుందరరసాన్ని, గంభీర రసాన్ని కొద్దిగా చెప్పడం నా బాధ్యత. ఇది ఎనిమిది విభాగాల గ్రంథం. కవిత్వం పుట్టుక, పురాణం యుగాంతం, ఆధునిక కవితా లక్షణాలు, నేను-ప్రపంచం, కళల నిర్మాణం .... శీర్షికలను తేరిపార చూస్తే చారిత్రిక భౌతికవాదం మన ముందు వెల్లివిరుస్తుంది. ఆదిమ మానవ సమాజ కవిత్వ వికాసం నుండి చివరకు సోషలిస్టు సమాజపు కవిత ఎలా ఉంటుందో దర్శించి, చిత్రించిన మార్క్సిస్టు రసానందశాస్త్రం, భ్రమ-వాస్తవం మన ముందు కదలాడుతుంది.

నా స్ఫూర్తి నా పేదరికపు జీవితం. పేదరికానికి విముక్తి సాధనం మార్క్సిజం అని చెప్పడం సత్యం.

నాకు స్ఫూర్తినిచ్చిన గ్రంథం ఏది? ఎందుకని? అనడిగితే మార్క్సిజాన్ని బోధించిన తాత్విక గ్రంథాలు కాక మరేమని చెప్పగలను. స్ఫూర్తిని కొలిచే కొలతలు లేవు కదా? నేను చదివిన గ్రంథాల సంఖ్య స్వల్పం.

అవి ఫ్రెరీ "పేదల చదువు", కిష్టోఫర్ కాడ్వెల్ "భ్రమ-వాస్తవం", "భ్రష్టు సమాజపతనంపై అధ్యయనాలు", "భౌతిక విజ్ఞాన శాస్త్రంలో సంక్షోభం". ఇవన్నీ కూడా కాడ్వెల్ రచనలే. మార్క్స్ రాసిన '1844 ఆర్థిక తాత్విక రాతప్రతులు', ప్రొఫెసర్ డియర్డన్ రాసిన "ప్రాథమిక విద్యాతత్వ శాస్త్రం", జె.డి.బెర్నాల్ రాసిన "చరిత్రలో సైన్సు" నాలుగు సంపుటాలు. "తిరుగుబాటులో హితువు", కారన్ ఫోర్త్ రచించిన "గతితార్కిక భౌతికవాదం", గ్రాంస్కీ రచన "జైలు వ్రాతలు", "డార్విన్ జీవన పరిణామం", "కాలాతీతుడు ఐన్‌స్టీన్".

పై గ్రంథాల అధ్యయనంతో పాటు ఆంగ్లం నుండి అనువదించాను. చాలావరకు అచ్చులో వచ్చాయి. ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే అధ్యయనంలో పొందే స్ఫూర్తి కంటే అనువాదంలో మార్క్స్ మాటల్లో "పాషన్" ఉంటుంది. "ఉద్వేగం" ఉంటుంది. ఈ అనువాదాలు 'వివిధ సమయాల్లో వివిధ ఉద్యమాల ఉద్వేగంలో అనువదించాను, నాకు స్ఫూర్తినిచ్చింది ఏదో ఒక గ్రంథమని చెప్పడం అసమంజసం అవుతుంది.

అయినా ప్రజాశక్తివారి అభ్యర్థన మేరకు కాడ్వెల్ "భ్రమ-వాస్తవం"ను ఎంచుకున్నాను. ఈ గ్రంథం 2000లో తెలుగులో అచ్చులోకి వచ్చింది.

కాడ్వెల్ "భ్రమ-వాస్తవం" అధ్యయనానికి, అనువాదానికి రాష్ట్ర ప్రజానాట్యమండలి సూచనల మేరకు కా॥ దేవేంద్ర నన్ను పురికొల్పాడు. కాడ్వెల్ ఆంగ్ల మాతృకలన్నీ ఇచ్చాడు. కాడ్వెల్ కంటే గొప్ప రచయతలు అనేకులు ఉండవచ్చు. కానీ ఆయన రచనలు మహత్తరమైనవి. ఆయన మరణం మరీ మహత్తరం. కాడ్వెల్ పూర్తి పేరు క్రిష్టోఫర్ సెయింటు జాన్ స్ప్రిగ్. 1907 అక్టోబర్ 2న జన్మించాడు. 16 ఏళ్ల వయసులో ఫీజులు కట్టలేని పరిస్థితిలో పాఠశాల చదువుకు స్వస్తి చెప్పాడు. తరువాత బతకడానికి పత్రికా విలేకరిగా పనిచేశాడు. 1934లో మార్క్సిస్టు మూల గ్రంథాల పరిచయం ఏర్పడింది. కార్నవాల్ నుండి తిరిగి వచ్చి "భ్రమ-వాస్తవం" తొలి చిత్తుప్రతి తయారుచేశాడు. లండన్‌లోని పోప్లార్ శాఖలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా చేరాడు. శ్రామిక భావజాలం గలవాడు. కొద్దికాలం తరువాత తిరిగివచ్చి "భ్రమ-వాస్తవం" మరోసారి రాశాడు. రేయింబవళ్లు 'టైప్ రైటర్' ముందుండేవాడు.

ఇంతలో స్పెయిన్‌తో అంతర్యుద్ధం మొదలైంది. ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లో సైనికుడుగా చేరాడు. 1937 ఫిబ్రవరి 12నాడు సైనికచర్యలో అమరుడయ్యాడు.

కాడ్వెల్ అసాధారణ ప్రజ్ఞాశాలి. జీవించింది తక్కువకాలం. విషాద జీవితానికి నిజమైన అర్థంలో కాడ్వెల్ జీవితం అత్యంత విషాదం. అతను ఒక కమ్యూనిస్టుగా జీవించాడు. కమ్యూనిస్టుగా మరణించాడు. అతని జీవితం, రచనలు అధ్యయనానికి, అనువాదానికి స్ఫూర్తినిచ్చాయి. కాడ్వెల్ జీవితాన్ని చెప్పడంలో నా ఉద్దేశం ఈ వ్యాసం చదివినవారు తప్పనిసరిగా కాడ్వెల్ రచనలు చదువుతారని నా ఆశ, అభిలాష.

"భ్రమ-వాస్తవం" గ్రంథం విశిష్టత- ఆ గ్రంథం ఉపయుక్తగ్రంథం సూచికలో ఉంది. ఆ గ్రంథాలను వర్గీకరిస్తే, భ్రమ-వాస్తవం రచనకు ఆధారగ్రంథాల సంఖ్య

భాషాగ్రంథాలు 14
గణితం 14
గతితార్కిక శాస్త్రం 33
సాధారణ విజ్ఞాన శాస్త్రాలు 37
పురాతన నాగరికత 39

చరిత్ర రాజకీయం 64
సాహిత్యవిమర్శ 75
సైకాలజీ 78
పురావస్తు శాస్త్రం 122

దాదాపు 400-500 గ్రంథాలలోని వివిధ విషయాల సారం భ్రమ-వాస్తవంలో చూస్తాం.

కాడ్వెల్ గొప్పతనం రాసిన గ్రంథాల పరిణామంలోనేకాక విషయంలోను అపారమైన వైవిధ్యం ఉంది. కాడ్వెల్ మేధాశక్తికి చిహ్నం- "భ్రమ-వాస్తవం", "భ్రష్టు సమాజపతనంపై అధ్యయనాలు", "భౌతిక విజ్ఞాన శాస్త్రంలో సంక్షోభం" కేవలం ఒక్క సంవత్సరంలో, ఆగస్టు 1935, 1936 డిసెంబరు మధ్యకాలంలో రాశాడు.

మా ఊరు కృష్టాజిల్లా గుడివాడ దగ్గర కౌతవరంటకుర్రు. పుట్టిన సంవత్సరం 1932. ఇది కాడ్వెల్‌యుగం, తెలుగునాట శ్రీశ్రీయుగం. మా ఊరిలో అధిక భాగం జనాభా పేదలు. అగ్రకులాల్లో 10-15 ధనిక కుటుంబాలు తప్ప మిగిలినవన్నీ దళిత కుటుంబాలు. అందులో అధిక భాగం కమ్యూనిస్టు భావాలతో ఉండేవారు. నేను వ్యవసాయ కూలీ వర్గానికి చెందినవాణ్ణి.

బాలసంఘాలు, విద్యార్థి సంఘాలల్లో పనిచేశాను. ఇంటర్మీడియట్ గుడివాడ కళాశాలలో చదివాను. పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష, చనిపోకముందు, చనిపోయాక కాలేజీలో సమ్మె నాయకత్వం కారణంగా కాలేజీ నుండి డిబార్ చేశారు. బి.ఎ. గుంటూరులోనూ, యం.ఎ కాశీవిశ్వవిద్యాలయంలో చేశాను. కళాశాలలో నా సహాధ్యాయులు చలసాని ప్రసాద్, సూరపనేని హరిపురుషోత్తం, కె.జి.సత్యమూర్తి. 1959లో ప్రభుత్వ నౌకరిలో ప్రవేశించి 1990లో ఖమ్మంజిల్లాలో రిటైర్ అయ్యాను. 1991లో సిపియం పార్టీ సభ్యుడినయ్యాను. అప్పటినుండి మార్క్సిస్టు మూల గ్రంథాల అధ్యయనానికి ఆరంభం.

"నాలోని బలహీనత గురించి ఆలోచిస్తున్నాను. ఆ బలహీనత శాస్త్రీయ, కళా, భావోద్వేగ ఆలోచన అవసరాల మధ్య సమీకృత జ్ఞానం లేకపోవడం" ఈ బలహీనత తొలగించుకోడానికి తుదిశ్వాస వరకు ప్రయత్నించాడు కాడ్వెల్.

మాడ్రిడ్ గుట్టలను ముష్కర సైన్యం చుట్టుముట్టినప్పుడు కామ్రేడ్ "మీరు వెనక్కు వెళ్లండి" అని కమాండ్ ఇచ్చి మెషీన్‌గన్ ట్రిగర్ పై గుళ్లు అయిపోయే వరకు శత్రువులను ఎదురొడ్డి సహచర కామ్రేడ్స్‌ని రక్షించాడు. శాస్త్రీయ, కళా, భావోద్వేగ అవసరాల మధ్య సమీకృత జ్ఞానం అంటే ఇదేనేమో. ఈ శాస్త్రీయ, కళా, భావోద్వేగాల సమ్మిళితమైన ఉపయుక్తగ్రంథాల పట్టికలో విషయాల మధ్య సాధించడానికి చేసిన అమోఘమైన ప్రయత్నమే "భ్రమ-వాస్తవం".

గ్రంథంలోని ప్రతి వాక్యం జ్ఞాననాడులను వడిసిపట్టమని హెచ్చరిస్తుంది. వాక్యం భావపు లోతుల్లో మునిగినప్పుడు నాలో "యురేకా" అన్నంత ఆనందపడేవాణ్ణి. ఈ గ్రంథం సుందరరసాన్ని, గంభీర రసాన్ని కొద్దిగా చెప్పడం నా బాధ్యత. ఇది ఎనిమిది విభాగాల గ్రంథం. కవిత్వం పుట్టుక, పురాణం యుగాంతం, ఆధునిక కవితా లక్షణాలు, నేను-ప్రపంచం, కళల నిర్మాణం .... శీర్షికలను తేరిపార చూస్తే చారిత్రిక భౌతికవాదం మన ముందు వెల్లివిరుస్తుంది. ఆదిమ మానవ సమాజ కవిత్వ వికాసం నుండి చివరకు సోషలిస్టు సమాజపు కవిత ఎలా ఉంటుందో దర్శించి, చిత్రించిన మార్క్సిస్టు రసానందశాస్త్రం, భ్రమ-వాస్తవం మన ముందు కదలాడుతుంది.

ఈ గ్రంథం ప్రతి భావవ్యక్తీకరణలో మార్క్సిజం ఉంది. అందుకే ఈ గ్రంథం అర్థంకావడానికి మార్క్సిజంతో కొద్ది పరిచయం ఉండాలి. ఈ గ్రంథం కేవలం కవిత్వాన్ని గురించే కాక భాషా మూలాలను కూడా చర్చించింది.

"తొలి దినాల మానవుని సౌందర్య చర్యల ఆలోచనల్లో కవిత్వం పుట్టింది. ఆనాటి కవిత్వం ఉద్విగ్న భరిత సాధారణ సంభాషణ". ఇది గ్రంథానికి ప్రారంభ భావన.

"కళ యొక్క సారం మనిషి ఉన్నంతవరకు ఉంటుంది. నిరర్థక ఘర్షణలతో మానవుడు వ్యర్థుడైనప్పుడు కళ నీటి బుగ్గ ఆగిపోతుంది. కళ ఒక సృజన. అది విరామమెరుగని పరిభ్రమణ ప్రభవించి వృద్ధి చెందుతుంది. కళ మానవ వాస్తవాలలో ఒకటి." ఇది గ్రంథం చివరి భావన.

ఇలా చెప్పుకుంటేపోతే ఎన్నైనా చెప్పవచ్చు. ఒకచోట "పురాణాలు ప్రజా సాహిత్యమనే మన పురాణాల అంతమే వర్గ సమాజాల ఆరంభం" అంటాడు కాడ్వెల్. "అనువాదానికి అలవి కానిదే కవిత్వం" అంటాడు మరోచోట. వర్తమానంలోని దుర్మార్గంపై కసి తీర్చుకోవడానికి కాపురం పెట్టే చోటు భవిష్యత్తు అంటాడు. "మనిషి పరిసరాల ఆవేశాల ప్రకటనే కవిత్వం" అంటాడు మరోచోట.

" ఫలించిన గణితం సంగీతం
ఘర్షణలో మానవ జీవితం నుండి
కవిత్వం పుట్టింది" అని అనడంలో జ్ఞానపు లోతెంత

"ప్రపంచం అంటే పైన ప్రయాణించే సూర్యుడు కాదు
ప్రపంచం అంటే ప్రకృతిని సమాజంలోకి తెచ్చిన సుసంపన్నమైన ప్రపంచం"

భాష సత్యాన్ని మాత్రమే చెప్పదు. ఆ సత్యంతో ఏం చేయాలో కూడా చెప్తుంది అంటాడు.

భ్రమ-వాస్తవం నాకెందుకు స్ఫూర్తినిచ్చిందో మీముందుంచడానికి ప్రయత్నించాను. ఈ పుస్తకం చదివాక మీలోని శాస్త్ర సాహిత్యం, అవగాహనా సామర్థ్యం గలగలమని పారతాయని కచ్చితంగా చెప్పగలను. షరతు ముందు గతితార్కిక చారిత్రిక భౌతికవాదంపై అవగాహన ఏర్పడడం అవసరం.

బూర్జువా నాగరికత విశ్లేషణ "భ్రమ-వాస్తవం" కాడ్వెల్ పరిశీలన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతానికి అనుసరణంలో ఎంతో ఉంది. మార్క్సు ప్రాపంచిక దృక్పథమే భ్రమ-వాస్తవం. కాడ్వెల్ యొక్క దోషరహిత గతితార్కిక దర్శనం నుండి సాధ్యమైన వస్తువాత్మగతల అంత:సంబంధమైన "భ్రమ-వాస్తవం"లో కనపడుతుంది. భ్రమలో ఎంతోకొంత వాస్తవం ఉంటుంది. వాస్తవంలో ఎంతో కొంత భ్రమ శకలం ఉంటుంది. ఈ అవగాహన ఒకసారి కలిగాక నన్ను అనుక్షణం వెన్నాడుతోంది. ఊపిరి సలపనీయకుండా ఉత్తేజమిస్తోంది.



బూర్జువా నాగరికత విశ్లేషణ "భ్రమ-వాస్తవం" కాడ్వెల్ పరిశీలన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతానికి అనుసరణంలో ఎంతో ఉంది. మార్క్సు ప్రాపంచిక దృక్పథమే భ్రమ-వాస్తవం. కాడ్వెల్ యొక్క దోషరహిత గతితార్కిక దర్శనం నుండి సాధ్యమైన వస్తువాత్మగతల అంత:సంబంధమైన "భ్రమ-వాస్తవం"లో కనపడుతుంది. భ్రమలో ఎంతోకొంత వాస్తవం ఉంటుంది. వాస్తవంలో ఎంతో కొంత భ్రమ శకలం ఉంటుంది. ఈ అవగాహన ఒకసారి కలిగాక నన్ను అనుక్షణం వెన్నాడుతోంది. ఊపిరి సలపనీయకుండా ఉత్తేజమిస్తోంది.

★

ప్రవహించని జీవనది

- అడిగోపుల వెంకటరత్నమ్

పాదం వెళ్ళి రాయికి తగలటంలేదు
రాయి వచ్చి పాదానికి తగులుతూ వుంది.
కాలు క్రమశిక్షణలో
రాయి విధ్వంసంలో-
క్రింది కోర్టులో ఇటూ
పై కోర్టులో అటూ
అటూ ఇటూ
ఇటూ అటూ
ఎటూ తేలదు కేసు-
సూర్యుడు ప్రయాణిస్తుంటాడు
నదులు పరుగెత్తుతుంటాయి.
అగ్ని మండుతుంటుంది.
గాలి వీస్తుంటుంది
నాదైన నా బెత్తెడు నేల
నాది కాదంటుంది ధర్మం
ఆకలి తీరదు
ఆశ చావదు
న్యాయం సౌశీల్యంలో
అన్యాయం విజృంభణలో



పై కోర్టులో అటూ
ఆపై కోర్టులో ఇటూ
నాది కాదన్న నా నేల

నేను నీ దంటూ నా వొడిలో
నన్ను నవ్వమంటుంది
ఆకాశం శ్రుతి కలుపుతుంది.
నది ఉరుకులెత్తుతుంది
అగ్ని మహోధృతమౌతుంది.
గాలి హోరెత్తుతుంది-
నాటిన పంట పండదు
ఎగువన భూస్వామి
నేల నొసట గీతగీస్తాడు
పంటకాల్వను శాసిస్తాడు
నీటి చుక్క జారదు
జారిన చుక్క పారదు
ఆకలి తీరదు
ఆశ చావదు.
ధర్మం దమ్మ పథంలో
అధర్మం దుర్నీతిలో-

ధరలేమో పెరుగవట్టే...

- యు.రాజేశం

తెల్లవారుతుండగానే
నీళ్లపాలు వోసిపాయే
షాంపు, సబ్బు లేకపోతే
బాత్‌రూం తెరువదాయే...!
వంట సామాను లేకపోతే
టిఫినైన రమ్మనదాయే
'టీ'యైన తాగనీకి
చక్కరి, చాయపత్తి ధర ఎక్కువాయే..!
చుట్టమేమో రానేవచ్చే
పప్పులన్ని భారమాయే
కూరగాయలు కొసరికొని
వంట చేసి తినబెడితే
ఇంతేనా మర్యాదని
మూతి తిప్పి వెళ్లిపోయిరి...?
బైకు పైన ఆఫీసుకు వెళ్ళుదమంటే
పెట్రోలు బగ్గుమనే
సాయంత్రం ఇంటికొస్తే
పిల్లలు బడి ఫీజు రసీదు ఇచ్చిరి...?
ఆలియేమో అలుగవట్టే
అయ్యేమో తిట్టవట్టే
బ్రతుకేమో భారమాయే
దినదినం ధరలు పెరుగవట్టే...!
బస్తాల బియ్యం పాయే
కిలోల బియ్యం వచ్చే
నెలరోజుల కిరాణం లేదు
ప్రతి రోజు కొంటుంటుమి...!
అన్నింటిని చూసి మురువు
కొంటే మాత్రం పొట్లు గలవు
బ్రతుకేమో భారమాయే
దినదినం ధరలేమో పెరుగవట్టే...!

పిడికిట్లో రంగు

- మల్లారెడ్డి మురళీ మోహన్



మన్నెరుపు, మిన్నెరుపు,
మింటిన సూరీడెరుపు.
పంటెరుపు, ఎరువెరుపు,
నా చెమట రంగెరుపు.
స్ఫూర్తెరుపు, ఆర్తెరుపు,
నా ఆకలి రంగెరుపు.
అడుగెరుపు, దారెరుపు,
దారంతా పూసిన పూలెరుపు.
పలుకెరుపు, పాటెరుపు,
పాట గొంతులో ప్రవహించే చైతన్యమెరుపు.
గాలెరుపు, ధూళెరుపు,
గుండెల్నిండా ఆ గాలి పీల్చిన నా శ్వాసెరుపు.
ఈ అక్షరాల ఘోషెరుపు,
అవి వెలిగించే కాగడాల కాంతెరుపు.

నువ్వు మారు!

- తమ్మెర రాధిక



మేఘాల్ని మధిస్తే వచ్చే
కన్నీళ్ళు
మనకు ఎన్నాళ్లు?
అన్నం పెట్టే వాడన్నాం
దేశానికి వెన్నెముక అన్నాం
ఎముకలిరిచీ,
కూటి గిన్నెలిసిరేసీ,
అన్నపూర్ణని చెరబడుతున్నాం.
ఎవరెవరో అందలాలెక్కుతున్నారు.
పనికిమాలిన వాళ్లు ఖద్దరు కడుతున్నారు.
పశు ప్రవృత్తి కల్లోడు కార్లల్లో తిరుగుతున్నాడు.
మోసకారోడు మంది పైసలకు
ఫైనాన్సు ఎగ్గొడుతున్నాడు.
చదువుల పేరుతోని చట్టబద్ధ వ్యాపారం చేస్తున్నారు.
అందగత్తెల పోటీలతోని అంగడి బొమ్మల్ని చేస్తున్నారు.
ఆంధ్రదేశంలో,
మొత్తానికి,
ఆడదానికి రక్షణ లేదు.
అన్నం పెట్టే రైతన్నకు భూమి లేదు.
సహకారం పేరుతో
కండ్లల్లో కారం కొట్టే ఉపాయం చేస్తున్నది
సర్కారు.
జనాలకు ఏ నౌకరీ లేకున్నా...
పోలీస్ నౌకర్లను ఖరారు చేస్తున్నారు
రైతులు తిరగబడకుండ!!!
ఒక్క ఓటు ఆయుధం మీ చేతుల వుంచుకోని
దిక్కులు చూస్తున్నారు.
దుక్కులు ఎండిపోయి
అప్పులు పెరిగిపోయి
పుస్తెలు తాకట్టు బడి
బుక్కెడు బువ్వకోసం
ఎక్కే బాంకు దిగే బాంకు
అవమానాల్ని - చీదరింపుల్ని
తలపాగలా చుట్టుకుని
ఎవడి తలపుండ్లు కడుగుదామని!?
నీ ఏడుపుకు ఆకాశం కురవట్లేదు,
నీ మాటలకు మబ్బులు గర్జించట్లేదు,
నీ చూపులకు కార్చిచ్చు పుట్టట్లేదు,
నిన్నణగ దొక్కే వ్యవస్థ బూదిద కుప్పలో
మళ్ళీ మళ్ళీ పుట్టే ఫనిక్స్ వైతున్నావే తప్ప!!
నీ తలరాతను మార్చే ఓటును
ఆయుధం చేసుకోవడం లేదు.
రైతన్నా !! ఇకనైనా
నువ్వు మారు
ఈ
ఒక్కమారు!

కథ

ప్రియమైన అమ్మాయికి...

అభిషేక్ కూడా ఇంట్లో తాతయ్య కనిపించకపోవడంతో బెంగపెట్టుకుని అన్నం తినడంలోగానీ, స్కూలుకు వెళ్లడంలోగానీ, స్కూలుకు వెళ్లినా చదివే విషయంలోగానీ ఏ మాత్రం ఆసక్తి కనబరిచేవాడు కాడట. ఏదో విలువైన వస్తువును పోగొట్టుకున్న వాడిలా నిరాశా నిస్పృహలతో ఉండేవాడట. ఈ మధ్య తాతగారి మీద బెంగ మరీ ఎక్కువై జ్వరంతో బాధపడుతూ, మూసిన కన్ను తెరవకుండా 'తాతయ్యా... తాతయ్యా...' అంటూ కలవరిస్తున్నాడట.

- కళావతి

అమ్మా రవళీ!

నీవు రాసిన ఉత్తరం చేరింది. నీ ఉత్తరాన్ని చదివి నేను నిశ్చేష్టురాలినయ్యానంటే నమ్ము. నా కూతురు రవళేనా ఈ ఉత్తరం రాసింది అని నేను నమ్మలేకపోయాను. కానీ అక్షరసత్యాలు కళ్లముందు కన్పిస్తుంటే నమ్మకపోవడమెలా? అందుకే నీకు ఈ ఉత్తరం రాయకుండా ఉండలేకపోయాను.

అమ్మా రవళీ! నీవు రాసిన ఉత్తరంలో మీ అత్తగారిని త్వరలో వృద్ధాశ్రమంలో చేర్పించబోతున్నానని, అందుకు నీ భర్త కూడా అంగీకరించాడని రాశావు. మీ అత్తగారిని వృద్ధాశ్రమంలో చేర్పించాలనే ఆలోచనకు కారణం కూడా అందులో రాశావు. నేటి ఆధునిక యుగంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయాల్సి వస్తోందని, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉద్యోగాలు తప్పనిసరని, అందువల్ల మీరు ఆఫీసుకు వెళ్లే సమయానికి మీ అత్తగారికి అన్నీ అమర్చి పెట్టి వెళ్ళాలంటే నీకు టైం సరిపోవడం లేదని రాశావు. భార్య మాటలను ఆదరించి గౌరవించే భర్త దొరకడం ఆడదాని అదృష్టమే. కానీ ఆ అదృష్టాన్ని సద్వినియోగ పరచుకోవాలే గానీ దుర్వినియోగ పరచుకోకూడదు. నీ భర్త నీమీద ప్రేమతో నీవు చెప్పే మాటలకు తలగ్గొచ్చు. కానీ అతని అంతరాంతరాల్లో ఏదో ఒక సమయంలో తను ఉండి కూడా తన తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పించానని భావించి బాధపడొచ్చు. అటువంటి పరిస్థితిని నీవు నీ భర్తకు కలిగించొద్దు.

పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. ఉమ్మడి కుటుంబాలలో ఉండే ఆత్మీయతలూ, అనురాగాలూ, అనుబంధాలూ... ఆ తీరే వేరు. కానీ రానురాను ఏ కుటుంబానికి ఆ కుటుంబం వేరైపోతూ తమవరకు తాము కుటుంబాన్ని పరిమితంగా చేసుకుని బతకడం అలవాటు చేసుకుంటున్నారు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కుటుంబంలోని వ్యక్తులను సైతం దూరం చేసుకుంటూ, ఆత్మీయతానుబంధాలను తెంపుకుంటూ కేవలం భార్యాభర్తలు, పిల్లల వరకే కుటుంబంగా భావిస్తున్నారు. మీ అత్తగారి పరిస్థితిని కూడా ఒక్కసారి నీవు ఆత్మీయతతో అర్థంచేసుకో. ఆమెకున్నది ఒక్కడే కొడుకు. ఆమె కోడలుగా ఆ ఇంటికి వచ్చినప్పుడు భర్తతో ఎంతో ఆనందమయమైన జీవితాన్ని అనుభవించింది. సంతానం కోసం ఎందరెందరో దేవుళ్లకి మొక్కుకుంది. ఎన్నో వ్రతాలు చేసింది. చివరకు ఆ దేవుళ్ల దయవల్ల ఒక్కగానొక్క కొడుకు పుట్టాడు. ఆమె కలలన్నీ ఆమె కొడుకు మీదే. తన ప్రేమనంతా పంచి, పెంచి పెద్దవాణ్ణి చేసింది. మీ అత్తయ్య, మామయ్య కొడుకుని చూడకుండా ఒక్కక్షణం కూడా ఉండేవారు కారట. తమ శేష జీవితమంతా కొడుకు నీడలో చల్లగా, ప్రశాంతంగా గడిచిపోతుందని కలలుగన్నారు. "అనుకున్నామని జరగవు అన్నీ అనుకోలేదని ఆగవు కొన్ని" అని ఓ కవిగారన్నట్లు అనుకోకుండా నడివయస్సులోనే మీ మామయ్యగారు గుండెపోటుతో మరణించారు. అందువల్ల భర్తను కోల్పోయిన భార్యగా ఆవేదనతో మీ అత్తగారు బతకవలసి వచ్చింది. ప్రస్తుతం మీ అత్తకు సర్వస్వం ఆమెకున్న కొడుకే గదా.

కొడుకు ఆఫీసుకు వెళితే తాను ఒంటరిగా ఉండలేక, సంసారం చక్కదిద్దుకునే చదువున్న అమ్మాయి దొరికితే చాలనుకుందట. ఇంటి పట్టున ఉండే కోడలిని కొడుకుకు ఇచ్చి పెళ్లి చేయాలనుకుందట. కానీ మీ ఆయన నిన్ను ప్రేమించానని, నిన్నే వివాహం చేసుకుంటానని తల్లితో చెప్పడంతో తన ఆశలను, ఆలోచనలను మనసులోనే ఉంచుకుని, కొడుకు ఇష్టాన్ని తన ఇష్టంగా మలచుకొని ఉద్యోగం చేసే నిన్ను కానీ కట్నం కూడా ఆశించకుండా తన ఇంటి కోడలుగా చేసుకుంది. తన ఆరోగ్య పరిస్థితులు బాగున్నంత వరకు నీవు ఆఫీసుకు వెళ్లొచ్చేప్పటికి తానే పనంతా చేసి నిన్ను కన్నకూతురికన్నా మిన్నగా చూసింది. నీవు ఆఫీసుకు వెళ్లేప్పుడు బాత్‌రూమ్‌లో స్నానానికి నీళ్లు పెట్టే దగ్గరి నుండి అన్ని పనులూ ఆమె చేసేది. నీవు ఆఫీసు నుండి ఇంటికి వచ్చి రిలాక్స్‌గా కుర్చీలో కూర్చోగానే కాఫీ కప్పు నీ చేతికిస్తుండేదని నీవు కూడా చెప్తుండేదానివి గుర్తుందా!

"అలాంటి అత్త దొరకడం నా అదృష్టం" అని ఎన్నో సార్లు నీవే మాతో స్వయంగా చెప్పావు. ఉత్తరాల ద్వారా తెలియజేశావు కూడా. అటువంటి అత్తగారు ఇప్పుడు వృద్ధాప్యం కారణంగా మీ పనులు చేయలేకపోవడమే కాకుండా తన పనులు కూడా తాను చేసుకోలేకపోతుండొచ్చు. అంతమాత్రాన ఆమె నీకు బరువైపోయిందా రవళీ! "నిన్ను వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్నాం" అని నీవు మీ అత్తగారితో అన్నప్పుడు ఆమెపైకి సరేనని అంగీకారాన్ని తెలిపినా లోలోపల ఎంత ఆవేదన చెంది ఉంటుందో వర్ణించలేను. కట్టుకున్న భర్తను దేవుడు దూరం చేశాడు. కన్న కొడుకును కోడలు దూరం చేస్తోందని ఆ తల్లి ఎంత కుమిలి పోయివుంటుందో నీవు ఊహించుకో.

అమ్మా రవళీ! నీ పరిస్థితి అటువుంచితే నానమ్మతో అనుబంధం పెంచుకున్న 6 సంవత్సరాల నీ కొడుకు చైతన్య పరిస్థితి ఆలోచించు. "నానమ్మను చూడకుండా ఒక్కక్షణం కూడా వుండలేడు. నా దగ్గరకు కూడా రాడమ్మా చైతన్యకు వాళ్ల నానమ్మ అంటే అంత ఇష్టం" అని నీవు అనేకసార్లు చెప్పావు. మొన్నామధ్య కూడా నీవు ఉత్తరంలో "చైతన్య స్కూలు నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నానమ్మతోనే వాడిలోకం" అని రాశావు గదా! మరి ఆ పసివాడు నానమ్మను చూడకుండా ఎలా ఉండగలడనుకుంటున్నావు. నీ చిన్నప్పుడు నీవు అటు మీ నానమ్మ దగ్గర, సెలవులు వస్తే ఇటు మీ అమ్మమ్మ దగ్గర ఎంతో సరదాగా గడుపుతూ కథలన్నీ చెప్పించుకుంటూ నీ బాల్యాన్ని సంతోషంగా గడిపావే? మరి ఇప్పుడు నీ కొడుక్కి ఆ సంతోషాన్ని ఎందుకు దూరం చేస్తావు తల్లీ! నీవు పొందిన ఆత్మీయతానురాగాలు నీ బిడ్డ పొందాలని నీకు లేదా!

రవళీ! నేటి కాలంలోని మనుషుల మనసులు, వారి ప్రవృత్తులు ఎందుకింత దారుణంగా మారుతున్నాయో నాకు అర్థం కావడం లేదు. గర్భవతులుగా ఉన్నప్పుడే స్కానింగ్‌లలో ఆడశిశువో, మగశిశువో ముందుగానే తెలుసుకుని ఆడశిశువైతే అబార్షను చేయించుకుంటూ మాతృప్రేమను చంపుకోవడం, వయసు పెరిగిన తర్వాత జవసత్వాలు తగ్గిన అత్తమామలను, అమ్మానాన్నలను వృద్ధాశ్రమంలో చేర్పించడం ఎంత అమానుషమైన చర్యలో కదా! నిజానికి వృద్ధాశ్రమాలంటే దిక్కూమొక్కూ లేని అనాథలను, ఆశ్రయంలేని వారిని, ఆత్మీయత పంచడానికి ఎవరూ లేని వృద్ధులైన వ్యక్తులను చేర్పించుకునే సంస్థలు. సంపాదించే కొడుకులు ఉన్నా, ఆత్మీయత పంచవలసిన కోడళ్లు వున్నా కూడా వృద్ధాప్యం రాగానే వృద్ధాశ్రమంలో చేర్పించడానికి ప్రయత్నిస్తుండడంతో ఆ సంస్థలు కూడా వ్యాపార పరమైపోతున్నాయేమో అనిపిస్తుంది. స్వచ్ఛంద సేవా సంస్థలు తమ స్వచ్ఛతను కోల్పోవడానికి ఒక రకంగా మీ లాంటి వారే కారణమవుతున్నారనిపిస్తుంది. ఆణాపైసా తీసుకోకుండా అనాథలైన వారికి ఆశ్రమం కల్పించాల్సిన ఆ సేవా సంస్థలు ఎవరు ఎంత పెట్టుబడి పెడితే అంత ఆదరణ చూపించే వ్యాపార సంస్థలైపోతాయేమో ముందు ముందు అనిపిస్తుంది.

అమ్మా రవళీ! ఈ మధ్య జరిగిన సంఘటన ఒకటి నీకు రాయాలనుకుంటున్నాను. మీ నాన్నగారి బాల్య స్నేహితుడు వెంకట్రావుగారు నీకు గుర్తుండే ఉంటారు. చిన్నప్పుడు నీకు చాక్లెట్లు తెచ్చేవాడు. మామయ్యా... మామయ్యా అంటూ ఎప్పుడూ నీవు ఆయన చేయి పట్టుకుని తిరిగేదానివి. అతను ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగా పనిచేసి రిటైర్ అయ్యాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు స్టేట్స్‌లోని సంబంధాలు కుదరడంతో ఒక అమ్మాయిని అమెరికాలోని అబ్బాయికీ, ఒక అమ్మాయిని ఆస్ట్రేలియాలో ఉండే అతనికీ ఇచ్చి పెళ్లిళ్లు జరిపించాడు. కొడుకు బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్నారు. కోడలు రెవెన్యూ డిపార్ట్‌మెంటులో పనిచేస్తోంది. ఆ మధ్య వెంకట్రావుగారి భార్య అనారోగ్యం కారణంగా చనిపోయింది. అప్పటి నుండి వెంకట్రావు గారు కొడుకు దగ్గరే ఉంటున్నారు. కొంతకాలం కిందట అతనికి ఆరోగ్యపరిస్థితి బాగాలేకపోయింది. వృద్ధాప్యంలో ఆరోగ్య పరిస్థితి క్షీణించడం సహజమే కదా! అతనికి సమయానికి అన్నీ అమర్చి పెట్టాలంటే కుదరడం లేదని ఇప్పుడు మీరు మీ అత్తగారి విషయంలో ఆలోచించినట్లే ఆలోచించి వృద్ధాశ్రమంలో చేర్పించారట. ఆ మధ్య మీ నాన్నగారు అతణ్ని చూడ్డానికి వృద్ధాశ్రమానికి వెళ్లారు. నిర్జీవమైన నవ్వుతో పలకరిస్తూ, నిస్తేజమైన కళ్లతో కనిపించాడట. అందరూ ఉండికూడా దిక్కూమొక్కూ లేని వాడిలా, ఒక అనాథలా తనను అక్కడ పడేశారన్న భావన అతనిలో స్పష్టంగా కనిపించిందట మీ నాన్న గారికి.

ఇక వాళ్ల మనవడు అభిషేక్ కూడా ఇంట్లో తాతయ్య కనిపించకపోవడంతో బెంగపెట్టుకుని అన్నం తినడంలోగానీ, స్కూలుకు వెళ్లడంలోగానీ, స్కూలుకు వెళ్లినా చదివే విషయంలోగానీ ఏ మాత్రం ఆసక్తి కనబరిచేవాడు కాదట. ఏదో విలువైన వస్తువును పోగొట్టుకున్న వాడిలా నిరాశా నిస్పృహలతో ఉండేవాడట. ఈ మధ్య తాతగారి మీద బెంగ మరీ ఎక్కువై జ్వరంతో బాధపడుతూ, మూసిన కన్ను తెరవకుండా 'తాతయ్యా... తాతయ్యా...' అంటూ కలవరిస్తున్నాడట. వాళ్లు డాక్టరును ఇంటికి పిలిపించి చూపించారట. అప్పుడు డాక్టరు వాళ్లతో 'ఇది మందులతో తగ్గే జబ్బు కాదు, మమతానురాగాలతో పెంచుకున్న మానసిక వ్యథ. వాళ్ల తాతగారిని ఎక్కడున్నా వెంటనే పిలిపించండి. బాబు కోలుకుంటాడు. లేకపోతే ప్రాణాలకే అపాయం కలుగుతుంది" అని చెప్పాడట. కన్న బిడ్డను రక్షించుకోవడానికి వేరే దారి లేక కొడుకూ, కోడలూ వెళ్లి వృద్ధాశ్రమంలో ఉన్న వెంట్రావుగారిని ఇంటికి తీసుకొచ్చారట. 'బాబూ... అభిషేక్... నేను తాతాయ్యను వచ్చానయ్యా... చూడు' అని ఆత్మీయతతో పలకరించిన తాతాయ్య కంఠస్వరాన్ని గుర్తించి అభిషేక్ కళ్లు తెరిచి 'తాతయ్యా... నన్ను విడిచి ఎక్కడికీ వెళ్లకు' అంటూ ఏడుస్తూ మెడ చుట్టూ చేతులేసి వెంట్రావుగారిని అల్లుకుపోయాడట.

వెంకట్రావుగారు కూడా అభిషేక్‌తో అంతే ఆత్మీయతతో కళ్లనిండా నీళ్లతో "వెళ్లను బాబూ... నేను ఎక్కడికీ వెళ్లను. మీరు తప్ప నాకు మాత్రం ఎవరున్నారయ్యా..." అంటూ చిన్నపిల్లాడిలా ఏడ్చాడట. వారి ఆత్మీయతానుబంధాలను చూసి తాము చేసిన పని ఎంత తప్పో తెలుసుకుని కొడుకూ, కోడలూ పశ్చాత్తాపంతో తలదించుకుని "మమ్మల్ని క్షమించండి నాన్నా, మామయ్యా" అంటూ ఇద్దరూ బాధపడ్డారట.

ఈమధ్య మీ నాన్నగారు వెంకట్రావును చూడ్డానికి వెళ్లినప్పుడు ఈ విషయాలన్నీ ఆయన చెప్పారు. ఇప్పుడు వృద్ధాశ్రమానికి వెళ్లక ముందు ఉన్న ఆయనలో ఉత్సాహం, ఆనందం తిరిగి కనిపించాయట.

కాబట్టి అమ్మా రవళీ! మీ అత్తగారిని వృద్ధాశ్రమంలో చేర్పించాలనే ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టేసి నీవు, నీ భర్త ఆమెను ప్రేమతో, ఆత్మీయతతో ఆదరించండి. ఇంటికి పెద్దదిక్కు ఉండాలని కోరుకునే వాళ్లం మా కాలంలో. ఇక ముందు నుంచీ నీ మనసులో కూడా అలాంటి భావాలనే ప్రతిఫలింపజేసుకుని మీ అత్తను అత్తలా కాకుండా అమ్మలా ఆదరించాలనీ, అది నీ నైతిక ధర్మమనీ నేను భావిస్తున్నాను. నా కోరిక ప్రకారం నడుచుకుంటావని ఆశిస్తూ నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ ఉంటాను.

ఆశీస్సులతో

మీ అమ్మ

★

ఆరోగ్యం

దేశ జనాభాలో కనీసం 90-95శాతం మందిలో ఏదో ఒక వయస్సులో దంత వ్యాధులతో బాధపడుతున్నారు. ముఖ్యంగా పిప్పిపళ్లు, చిగుళ్ల/ వ్యాధుల వల్ల ఎక్కువ మంది దంతాలను తక్కువ వయసులోనే కోల్పోతున్నారు. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పు వలన, సరైన దంత సంరక్షణ పాటించకపోవడం వల్ల ఎక్కువ మందికి దంత వ్యాధులు వస్తున్నాయి. అలాగే ఎత్తు, వంకర పళ్లు, పళ్ల మధ్యలో ఖాళీలు, పళ్లు పూర్తిగా రంగు మారటం, పళ్లు విరగటం వల్ల కొంతమందిలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది.

దంత చికిత్సలో వచ్చిన ఆధునిక ప్రక్రియ ద్వారా పళ్లు తీయకుండానే రంగు మారిన పళ్లకు విరిగిన పళ్లకు కాస్మొటిక్ చికిత్స, ఎత్తు, వంకర పళ్లకు, మేలైన చికిత్సలు జరుగుతున్నాయి.

ముత్యాల్లాంటి పలువరస కోసం...

డా॥ఎ.సుధాకర్ రెడ్డి
శ్రీనివాస కాస్మొటిక్ దంత వైద్యశాల
శ్రీకంఠం సర్కిల్, అనంతపురం.
ఫోన్ : 08554-237387.

దంత సంరక్షణ విధానాలు పాటించడం, సరైన ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవడం చిన్న వయసు నుండే అలవాటు చేయాలి. దీని ద్వారా దంత వ్యాధులకు దూరంగా వుండవచ్చు. ప్రతి ఒక్కరికి దంత సంరక్షణా పద్ధతులు, దంత చికిత్సా విధానాలు తెలియపరచడానికే ఈ వివరాలు...

బాల బాలికల దంత సంరక్షణ

- చిన్న పిల్లల్లో పాల పళ్లు 6 నెలలకే రావడం మొదలవుతాయి.
- రెండు సంవత్సరాల వయసులో అన్ని పాలపళ్లు పూర్తిగా వస్తాయి.
- ఆరేళ్ల వయసులో శాశ్వత పళ్లు రావడం మొదలవుతాయి.
- 12-13 సంవత్సరాలకు అన్ని శాశ్వత పళ్లు, 17-25 సంవత్సరాల వయసుకు జ్ఞానదంతాలు రావడం పూర్తవుతాయి.
- కొంతమంది పిల్లల్లో పాలపళ్లు ఊడకుండానే శాశ్వత పళ్లు వస్తాయి. అలాగే పాలపళ్లు ఊడిన తర్వాత కూడా శాశ్వత పళ్లు చాలా కాలానికి రావు. పళ్లు వచ్చే సమయంలో తల్లిదండ్రులు గమనించి పళ్లు వచ్చే క్రమంలో తేడాలు ఉంటే దంత వైద్యుని సంప్రదించడం మంచిది.

దంతక్షయం (పిప్పిపళ్లు)

1. పిప్పిపళ్లు రావడానికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లలో మార్పు, సరిగా నోరు శుభ్రపరచుకోకపోవడం.

2. ఆహారం తీసుకున్న తర్వాత నోరు సరిగా శుభ్రపరచుకోకపోవడం వల్ల తీసుకున్న ఆహార పదార్థంలో ఉండే కార్బోహైడ్రేట్స్ (షుగర్) పంటిని మధ్యలో నిలువ వుంటాయి. దానివల్ల బ్యాక్టీరియా చేరి వాటి చర్యల వల్ల యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. పన్ను మీద నల్ల మచ్చలా రంధ్రం తయారై పన్ను పుచ్చిపోవడం ప్రారంభమౌతుంది.

3. ఒకసారి పిప్పిపన్ను మొదలైన వెంటనే దంతవైద్యుని సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలే తప్ప ఎటువంటి మందులు వాడినా ప్రయోజనం లేదు.

పంటి మీద మచ్చలు - రంగుమారిన దంతాలు

- పంటి మీద గార ఏర్పడటానికి కారణం నోటి అపరిశుభ్రత మరియు కొన్ని రకాల అలవాట్లు అంటే సిగరెట్ తాగటం, పాన్ మసాలా సేవించటం.
- వంకర పళ్లు ఉన్న వారిలో సరిగ్గా బ్రష్ చేయకపోవడం వల్ల గార ఏర్పడుతుంది.
- పంటి మీద ఏర్పడే గారను కాలిక్యులస్ లేదా ప్లేక్ అంటారు. దానిలో బ్యాక్టీరియా చేరి వుంటుంది. దానివల్ల నోటి దుర్వాసన వస్తుంది.
- గార వలన చిగుళ్ల వ్యాధులు, పిప్పిపళ్లు వస్తాయి.
- కొంతమందిలో నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువైనట్లయితే పళ్లరంగు మారుతుంది.
- పంటిమీద ఏర్పడిన గారను స్కేలింగ్ పద్ధతి ద్వారా తొలగించవచ్చు.
- ఇతర కారణాల వల్ల రంగు మారిన పళ్లను కాస్మొటిక్ చికిత్స ద్వారా సరిచేయవచ్చు.

విరిగిన పళ్లు

1. ప్రమాద వశాత్తు కింద పడడం వల్లకానీ, రోడ్డు ప్రమాదాల వల్ల కానీ, కొట్లాటల వల్ల, ఆటల్లో పళ్లు విరుగుతాయి.

2. సాధారణంగా 9-11సంవత్సరాల మధ్య వున్న పిల్లల్లో పళ్లు ఎక్కువగా విరుగుతాయి. ఆ సమయంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యం వల్ల ఎక్కువమంది పిల్లలు దంతవైద్యుని సంప్రదించలేకపోతున్నారు.

3. ప్రమాదం వల్ల ఒత్తిడికి పంటి మధ్యలో వున్న నరాలు, రక్తనాళాలు దెబ్బతింటాయి. నిదానంగా పన్ను రంగు మారుతుంది. కొంతకాలానికి పంటిలో వున్న ఇన్‌ఫెక్షన్ పంటి పైనున్న ఎముకలో చేరి దాని నుండి చీము కారుతుంది. ఇన్‌ఫెక్షన్ ఎక్కువ అవటం వల్ల పంటి బాధ ఎక్కువై ముఖంలో వాపు కూడా వస్తుంది.

4. పన్ను విరిగిన వెంటనే దంత వైద్యుని సంప్రదించాలి. పంటితో పాటు చుట్టూ వున్న పెదాలు గీసుకుపోవడం, ఎముక దెబ్బతినటం కూడా కొన్నిసార్లు జరుగుతుంది. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం పళ్లు కదులుతూ ఉన్నట్లయితే వాటిని స్టెబిలైజ్ చేయాల్సి వుంటుంది.

5. పళ్లు రంగు మారకుండా వుండటానికి విరిగిన పళ్లకి చికిత్స చేయవలసి వుంటుంది.

కట్టుడు పళ్లు

✠ పళ్లు లేకపోవడం వల్ల ఆహారం సరిగా నమలలేక ఆహారం సక్రమంగా అరగదు. ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుంది. మాట్లాడడంలో ఉచ్చారణ లోపిస్తుంది. ముఖం మీద ముడతలు ఏర్పడతాయి.

✠ ఒక్క పన్ను లేకపోయినా, ఎక్కువ పళ్లు

మీకు తెల్సా...

- పంటి మీద గార తీయడం వల్ల పంటి పైపొర (ఎనామిల్) దెబ్బ తినదు.
- పళ్లు తీయడం వల్ల కంటికి హాని కలుగదు.
- విరిగిన పళ్లను కాస్మొటిక్ చికిత్సతో అందంగా సరిచేయవచ్చు.
- మధుమేహ వ్యాధి ఉన్నవారు దంత ఆరోగ్యవిషయంలో శ్రద్ధ వహించాలి.
- దంత వ్యాధుల వల్ల ఇతర అవయవాలకు వ్యాధి సోకకుండా దంత వ్యాధులను నిర్లక్ష్యం చేయకండి.
- గుండె జబ్బులు రావడానికి దంత వ్యాధులు కూడా ఒక కారణం.
- దంత ఆరోగ్యం దేహ ఆరోగ్యానికి సూచన.
- నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువైతే దంతాల రంగు మారుతుంది.



లేకపోయినా తప్పనిసరిగా కృత్రిమపళ్లు అమర్చుకుంటే మంచిది.

- కృత్రిమపళ్లలో తీసిపెట్టే పళ్లు, శాశ్వతంగా వుండే బ్రిడ్జిలు, ఇంప్లాంట్‌లు వున్నాయి.
- పేషెంట్‌ని పరిశీలించిన తరువాత అవకాశాన్ని బట్టి శాశ్వత పళ్లు అమర్చటమా లేదా తీసిపెట్టే పళ్లు అమర్చటమా అనేది దంత వైద్యులు నిర్ణయించవలసి వుంటుంది.

పళ్ల మధ్య ఖాళీలు

1. పంటికీ పంటికీ మధ్య ఖాళీలు రావడానికి చాలా కారణాలు వున్నాయి.
2. దవడ పరిమాణానికీ, పంటి పరిమాణానికీ వ్యత్యాసం ఉండడం (పెద్ద దవడ, చిన్న పళ్ల అమరిక)
3. పళ్ల మీద తరచూ నాలుకతో వత్తిడి తేవడం.
4. వెనుక పళ్లు లేకపోవడంతో ముందు పళ్ల మధ్య ఖాళీలు ఏర్పడడం
5. పళ్లతో గట్టి వస్తువులను పట్టుకోవడం, కొరకటం వంటి కొన్ని రకాల అలవాట్లు
6. ఖాళీలను ఆర్థోడాంటిక్ ట్రీట్‌మెంట్ ద్వారా సరిచేయవచ్చు.
7. ఈ చికిత్స వల్ల పంటి మధ్య ఖాళీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

చిగుళ్ల వ్యాధులు

- చిగుళ్ల వ్యాధులు రావడానికి ప్రధాన కారణం నోటి అపరిశుభ్రత
- నోటి అపరిశుభ్రత వల్ల పంటి మీద పాచి చేరుతుంది. అది నిదానంగా గారగా మారుతుంది. వాటిలో సూక్ష్మక్రిములు ఉంటాయి. దీనివల్ల చిగుళ్ల వ్యాధులు మొదలవుతాయి.
- చిగుళ్ల వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే కొంతకాలానికి పళ్లు కదలటం మొదలవుతాయి. చిగుళ్ల వ్యాధుల వల్ల కదిలిన పళ్లను గట్టి పరచటం పూర్తిగా సాధ్యమయ్యే పనికాదు.
- పంటిమీద చేరిన గారను 'స్కేలింగ్' అనే విధానం ద్వారా తొలగించవచ్చు. పంటికి చిగుళ్లకు మధ్య ఏర్పడిన గారను సబ్‌గింగివల్ స్కేలింగ్, కరొటేజ్ అనే పద్ధతుల ద్వారా తొలగించవచ్చు.
- చిగుళ్ల వ్యాధి తీవ్రత ఎక్కువైతే ఫ్లాప్ సర్జరీ చేయవలసి వుంటుంది. బోన్ గ్రాఫ్టింగ్, స్ప్లిటింగ్ చేయటం వల్ల కదిలే పళ్లకు ప్రయోజనం వుంటుంది.
- చిగుళ్ల నుండి రక్తం కారటం, చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన చిగుళ్ల వ్యాధులకు సంకేతం.

ఎత్తు, వంకర పళ్లు

1. ఎత్తు, వంకర పళ్లు వంశపారంపర్యంగాగాని, అలవాట్ల వల్ల గాని, పాలపళ్లు సరియైన సమయంలో ఊడకపోవడం వల్లగానీ, శాశ్వత పళ్ల అమరికలో తేడాల వల్లగాని రావడానికి అవకాశం వుంది.
2. నోట్లో వేలు పెట్టుకునే అలవాటు వల్ల దవడ, ఎముక మీద వత్తిడి పెరిగి ఆ ఎముకలో ఉండే ముందు పళ్లు ఎత్తు వస్తాయి.
3. నోటితో గాలి పీల్చడం, పెన్సిల్ వంటి గట్టి వస్తువులను కొరుకుతూ వుండడం వల్ల పళ్లు ఎత్తు, వంకర రావడానికి అవకాశం వుంది.
4. ఎత్తు, వంకర పళ్లను రిమూవబుల్ అప్లయన్స్ లేదా ఫిక్స్‌డ్ అప్లయన్స్‌ల ద్వారా సరిచేయవచ్చు. ఎముక ఎక్కువగా పెరిగి ఎత్తుపళ్లు ఉన్నవారిలో కాస్మొటిక్ సర్జరీ ద్వారా సరిచేయవచ్చు. నిపుణులైన దంత వైద్యులు పేషెంటును పరిశీలించిన తరువాతే చికిత్స విధానం నిర్ణయించగలుగుతారు.

దంత రక్షణ

- ఎదిగే పిల్లలు తాగే నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎంతుందో గమనించాలి. అది ఎక్కువైనా, తక్కువైనా దంతాలకు హానికరం.
- పిల్లల ఆహార విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. పళ్లకు అతుక్కుపోయే ఆహార పదార్థాలు ఇవ్వరాదు. ఏదైనా తిన్న వెంటనే నోటిని పుక్కిలిస్తే పళ్లు ఆరోగ్యంగా వుంటాయి.
- ఆటల్లో పిల్లలకు దెబ్బతగిలి పళ్లు ఊడిపోతే వెంటనే పంటిని సెలైన్‌లో లేదా నాలుక కింద లేదా పాలలో వుంచి దంత వైద్యుణ్ణి 30 నుండి 60 నిమిషాలలో సంప్రదిస్తే పంటిని యధాస్థానంలో ఉంచడానికి ప్రయత్నించవచ్చు.
- చిన్న వయసు నుండే పళ్లు ఎత్తుగా గానీ, వంకరగా గానీ వస్తుంటే అశ్రద్ధ చేయకండి. దంత వైద్యుణ్ణి వెంటనే సంప్రదించాలి.
- పళ్లపై కనిపించే నల్లని, గోధుమరంగు మచ్చలను అశ్రద్ధ చేయకండి. అవి పిప్పిపళ్లుగా మారతాయి.
- బ్రష్ చేయడానికి 3నుండి 5 నిమిషాల సమయం సరిపోతుంది. ఎక్కువసేపు బ్రష్ చేస్తే పళ్లు త్వరగా అరిగిపోతాయి.
- పళ్లు శుభ్రపరచుకోడానికి కొంతమంది పుల్లలు, బొగ్గు వాడుతుంటారు. వీటి వల్ల పళ్లు త్వరగా అరిగిపోతాయి.
- పాన్ మసాలాలు వాడడం వల్ల నోటి లోపల చర్మం దెబ్బతిని నోరు పూర్తిగా తెరవడానికి అవకాశం వుండదు. నోటి క్యాన్సర్ రావడానికి అవకాశం వుంది.
- ఆరు నెలలకొకసారి దంత పరీక్షలు చేయించుకోండి.
- గర్భిణీ స్త్రీలు సరైన పోషక పదార్థాలు కలిగిన ఆహారం తీసుకోవాలి. దీని వల్ల పుట్టబోయే బిడ్డకు చక్కటి పలువరస ఏర్పడుతుంది.
- గర్భిణీ సమయంలో దంత పరిశుభ్రత గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. ఏమాత్రం పళ్లమీద గార చేరినట్లయితే హార్మోన్ల ప్రభావంతో చిగుళ్ల వ్యాధులు త్వరగా వస్తాయి.
- ప్రతి గర్భిణీ స్త్రీ దంత వైద్యుని వద్ద పరీక్ష చేయించుకోవాలి. దాని వల్ల ప్రెగ్నెన్సీ సమయంలో పంటి బాధ, చిగుళ్ల సమస్యలు నివారించి ఆరోగ్యవంతమైన ఆహారం తినవచ్చు.

★

క్రైమ్ కథ

ప్రాణం మీద తీపి

- యర్నాగుల సుధాకరరావు



జైలు బ్యారెక్‌లో గోడకు చేరగిలబడి ఆలోచిస్తున్న చరణ్‌ను జైలర్ లాఠీతో తట్టాడు."నీతో మాట్లాడ్డానికి సిటీ పోలీసులు వచ్చారు. ఆ వచ్చింది యమస్ట్రిక్టు ఆఫీసర్. జాగ్రత్తగా మాట్లాడు. నీవో ఆరితేరిన క్రిమినల్‌నని గర్వం ఎక్కువగా చూపిస్తున్నావు. ఇక్కడ ఖైదీల మీద నీ కండ బలం చూపుతున్నావు. నువ్వెళ్లేలోపు ఇక్కడ పూర్తిగా నీ పొగరు అణిచేస్తాం. అది తర్వాత సంగతి. నిన్ను ప్రశ్నించడానికి కోర్టు నుంచి ఆదేశాలతో వచ్చాడు" చెప్పి వెనుదిరిగాడు జైలర్.

చరణ్ బద్ధకంగాలేచి జైలర్ వెంట ఒకగదిలోకి వెళ్లాడు. అక్కడ పోలీసులు, వారి మధ్య ఒక కుర్చీలో అధికారి కూర్చున్నాడు. వారి ముందు నిలబడ్డాడు చరణ్. జైలర్, అక్కడ ఉన్న పోలీసులు వెళ్లిపోయారు. ఆ గదిలో మిగిలింది ఇద్దరే. చరణ్, పోలీస్‌అధికారి.

"చరణ్ నీవు చేసిన రెండుహత్యలు కోర్టులో విచారణలో ఉన్నాయి. ప్రధాన సాక్షులు ఇద్దరూ హతులయ్యారు. అవి కూడా ప్లాన్డ్‌గా జరిగాయి. నీ మనుషులే చంపుతున్నారని తెలిసింది. నీ ప్రధాన అనుచరులు రజాక్, డేవిడ్ ఎక్కడున్నారు? వాళ్లు నాలుగుమాసాల క్రితం నీ కేసులో మొదటిసాక్షి చనిపోయాక కన్పించకుండా పోయారు. ఇప్పుడు రెండో హత్య జరిగింది. అప్పుడు దొరికిన వేలిముద్రలే ఇప్పుడూ దొరికాయి. ఆ ఇద్దరే చంపారని మేము నమ్ముతున్నాం" అధికారి చెప్పి చరణ్ ముఖంలోకి తీక్షణంగా చూశాడు.

"మీరు అనుమానించేవాళ్లు పెద్దనేరగాళ్లు. హత్యాస్థలంలో వేలిముద్రలు, ఇతరత్రా ఆనవాళ్లు వదిలిపోయేటంత తెలివితక్కువగా నేరాలు చేయరు. జైలులో ఉన్న నాకు వారు అనుచరులుగా పనిచేయరు. వారు ఎక్కడున్నారో నాకు తెలియదు. నేనడిగినా సరే వారు సాక్షులను చంపరు. నేనేమైపోతే వారికేం?"

"నువ్వు వారు కోరిన డబ్బిస్తే చేస్తారా?"

చరణ్ బదులీయలేదు. ఎందుకో చూపులు పక్కకు తిప్పుకున్నాడు.

"నాకు కావల్సింది నీనుంచి నిజాలే. నిన్ను ప్రశ్నించడానికి కోర్టు రెండురోజులు పోలీస్‌కస్టడీకి పంపాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. నేను నిన్ను తీసుకుపోకుండా ఇక్కడే ఎందుకు ప్రశ్నిస్తున్నానో తెలుసా? నీవు చెప్పాల్సింది చెప్పేస్తే నేను వెళ్లిపోతాను. ఇక్కడ ఉన్నట్టు మా కస్టడీలో ఉండదు."

"మీరు నన్ను తీసుకుపోయి ప్రశ్నించినా ఇదే చెబుతాను. నామీద మోపబడిన హత్యకేసులో సాక్షులను చంపేటంతగా నేను ఇక్కడ ఎలాంటి కుట్రలూ కూహకాలూ వేయడంలేదు. రజాక్, డేవిడ్‌ల గురించి నాకు తెలియనే తెలియదు"

"సరే, నీవు చెప్పకపోయినా మేము వారిద్దరిని పట్టుకుంటాం. వారు చట్టానికి దొరకకుండా ఉన్నంతకాలం నీకే ప్రమాదం. ఈసారి వారి టార్గెట్ నీమీదే ఉంది. మేము పోలీస్ కస్టడీకి తీసుకుపోయేటపుడు నీపనిపట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం అందింది. అందుకే నిన్ను ఇక్కడ ప్రశ్నిస్తున్నాను" చెప్పి లేచాడు.

జైలు సూపరింటెండెంటు ఆ గదిలోకి వచ్చాడు "సార్ ఈఖైదీ చరణ్‌ను బ్యారెక్‌లో పెట్టవద్దు. ఒంటరిగా సెల్‌లో వేయండి. అదనపు బలగాలు సమకూర్చండి. ఇతడి ప్రాణానికి ప్రమాదం ఉంది. ఇతడు కిరాయికి రెండు హత్యలు చేశాడు. చేయించినవాడు ఒక రియల్ ఎస్టేట్ అధినేత. కేసులో ప్రధాన సాక్షులను ఇద్దరిని చాలా తెలివిగా చంపేశారు" సూపరింటెండెంటు ఆశ్చర్యంగా విన్నాడు.

"రాత్రివేళలందు ఇద్దరు సెంట్రీలను ఇతడి సెల్‌వద్ద కాపలా పెడతాను. ఆసెల్ పైఅంతస్థులో ఉంటుంది. అంతవరకు ఎవరినీ రానీయకుండా చూస్తాను"

"సార్ ఇద్దరు సెంట్రీలతో ఇతడికి మీరు సరైనరక్షణ ఇవ్వలేరు. కనీసం నలుగురుండాలి. రజాక్, డేవిడ్‌లు నేరాలు చేయడంలో దిట్టలు. రియల్ ఎస్టేట్ అధినేత వద్ద పెద్దమొత్తం పుచ్చుకున్నారు. ఈ చరణ్‌ను లేపేయడానికి పథకం వేసుకున్నారు. ఈజైల్లో లంచాలు మరిగిన సిబ్బందిపట్ల మీరు అలర్టుగా ఉండాలి. లేకుంటే సెల్‌లోనే ఈ చరణ్ కుక్కచావు చస్తాడు" చెప్పి లేచాడు.

"ఈఖైదీని తీసుకువెళ్లరా?"

"ఇతడు పెదవి విప్పనని చెబుతున్నాడు. ఇతడు చెప్పడం ఇప్పుడు అంత ముఖ్యం కాదు అని ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను" చెప్పి వెనుదిరిగాడు.

చరణ్‌కు అప్పటికే చెమటలు పోశాయి. "సార్ నేను మీకు చెబుతాను. నేను అప్రూవర్‌గా మారతాను. నాతో చేయికలపిన రజాక్ డేవిడ్‌లుండే స్థావరం నాకు తెలుసు" మొత్తం వివరించేశాడు.

ఆ అధికారి అడ్రసు నోట్ చేసుకున్నాడు. ఆ వెంటనే స్థావరంపై దాడిచేసి పట్టుకున్నాడు. నేరగాళ్లు ఇద్దరు నేరాలు ఒప్పుకున్నారు.

నాలుగురోజుల తరువాత ఆ ఇద్దరు ఇదే సెంట్రల్‌జైలుకు వచ్చారు. వారిని చరణ్ ఉన్న బ్యారెక్‌లోకి నెట్టారు. చరణ్‌ను చూడగానే ఇద్దరూ "ఏమిటి బాస్ ఇలాచేశావు. పోలీసులు వేసిన వలలో తేలిగ్గా పడిపోయి నీవు దొరికింది కాకుండా మమ్మల్ని పట్టించావు" అని చిరుకోపం ప్రదర్శించారు.

"మరి నన్ను చంపాలని పథకం వేశారెందుకు?" గుస్సాగా అడిగాడు చరణ్.

"అదే మేము చెబుతున్నాం. నీవు చెప్పినట్టు ఇద్దరు సాక్షులను లేపేశాం. అందుకు నీవు మాకు ఇవ్వవల్సినది ఇచ్చావు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ ఓనర్‌ను చంపమన్నావు. ఆ పథకంలో ఉన్నాం. సడన్‌గా పోలీసు రైడింగ్‌తో దొరికిపోయాం. తీరా వారు ఎలా వలపన్ని నిన్ను బురిడీ కొట్టించింది చెప్పారు. నిన్నే చంపాలని కిరాయికి కుదిరామని పోలీసులు చెప్పడంతో నమ్మేసి నీవు మొత్తం కక్కేసావు. అంతెందుకు ఇక్కడ నీకు ప్రాణభయం అనిచెప్పాడు పోలీస్ అధికారి. నీకు రక్షణకానీ, వేరే సెల్‌లో పెట్టడం గాని జైలు సిబ్బంది చేయలేదే. ఆలోచించావా?"

చరణ్‌కు తల తిరిగిపోయినట్టయ్యింది. తాను ఇంతతేలిగ్గా పడిపోతానని అనుకోలేదు. ఇప్పటికి రెండు హత్యకేసులు, అందులో ప్రధాన సాక్షులను చంపించిన కేసులు కూడా తాను ఈదాలి. పోలీసులు వేసిన వలకు తాను ఘోరంగా చిత్తయినందుకు తల గోడకుకొట్టుకున్నాడు.

"మనం కట్టకట్టుకుని తలలుబాదుకున్నా ఒరిగేది లేదు. ఎవరికైనా ప్రాణభయం ఇలా గతులు తప్పిస్తుంది. ప్రాణభయంతో మేము స్థావరంలోంచి కాల్పులు జరపకుండా లొంగిపోయాం. ఎందుకంటే మోహరించిన పోలీసులు ఎక్కువమంది ఉన్నారు. ఎవరితోనైనా ప్రాణం తీపి ఏపనినైనా చేయిస్తుంది" డేవిడ్ చెప్పి తల పట్టుకున్నాడు. ★

కొబ్బరి హల్వా

కావసిన పదార్థాలు

కొబ్బరికాయ - ఒకటి, బియ్యం - పావుకేజీ,
పంచదార లేదా తరిగిన బెల్లం - పావు కేజీ,
నెయ్యి - 100 గ్రా, ఏలకులు - 5గ్రా, జీడిపప్పు, - 30 గ్రా,
సీమబాదం పప్పు - 10.

తయారుచేసే విధానం

బియ్యం కడిగి రెండు గంటలు నానబెట్టాలి. ఏలకులు మెత్తగా పొడి చెయ్యాలి. సీమ బాదంపప్పు పది నిమిషాలు నీళ్ళలో నానపెట్టి తోలు వొలిచి సన్నగా పొడుగ్గా ముక్కలు తరగాలి. జీడిపప్పు కూడా తరిగి నేతిలో వేయించుకోవాలి. నానిన బియ్యం రుబ్బుకోవాలి. బియ్యప్పిండి కొంచెం నలిగిన తరువాత, కొబ్బరి కోరు వేసి మెత్తగా రుబ్బాలి. కొబ్బరి, బియ్యం కలిపి ఎంత మెత్తగా రుబ్బితే హల్వా అంత బావుంటుంది.

హల్వాకు మంచి నెయ్యి వాడాలి, లేని పక్షంలో డాల్డా వాడాలి. పంచదారగాని, బెల్లంగాని తీగపాకం పట్టాలి. అందులో రుబ్బిన పిండి పోసి కొద్దిసేపు వుడికించి నెయ్యి పొయ్యాలి. దానిలో నీరు ఇగిరిపోయి వేళ్ళకు అంటుకోకుండా వుండేవరకు వుడికించాలి. పళ్ళేనికి నెయ్యి రాసి, దించిన హల్వా అందులో పోయాలి. దానిమీద జీడిపప్పుముక్కలు సీమబాదం ముక్కలు, ఏలకులపొడి వేయాలి. చల్లారిన తరువాత ముక్కలు కోసుకోవాలి.

సౌత్ ఇండియన్ చికెన్ రోస్టు

కావలసిన పదార్థాలు

చికెన్ - అరకిలో, అల్లం - 2 అంగుళాల ముక్క,
వెల్లుల్లి - 1పాయ, పెద్ద ఉల్లిపాయలు - 2,
పచ్చిమిర్చి - 4, దనియాల పొడి - 1టేబుల్ స్పూన్,
పచ్చికారం - 2 టేబుల్ స్పూన్లు,
మీగడ పెరుగు - 2 టేబుల్ స్పూన్లు, పసుపు - చిటికెడు,
లవంగాలు - 8, ఉప్పు - తగినంత,
దాల్చిన చెక్క - 2 అంగుళాల ముక్క.

వేయించేందుకు

నూనె - వేయించేందుకు సరిపడా, లంవగాలు - 2,
దాల్చిన చెక్క - 2 అంగుళాల ముక్క, అనాస పువ్వు - 1,
ఏలకులు - 2, పుదీన ఆకులు - కొంచెం, ఉప్పు - సరిపడినంత.

తయారు చేసే విధానం

చికెన్‌ను శుభ్రం చేసుకుని కొంచెం పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. లవంగాలు, దాల్చిన చెక్క, అల్లం, వెల్లుల్లి రేకలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి అన్నీ కలిపి ముద్దగా నూరుకోవాలి. చికెన్ ముక్కలలో ఈ ముద్దను, పసుపు, ఉప్పు, కారం, మీగడపెరుగు కలిపి కొద్దిగా నీరు పోసి కొద్దిసేపు ఉడకనివ్వాలి. కళాయిలో నూనె వేసి కాగిన తర్వాత 2 లవంగాలు, దాల్చిన చెక్క, అనాసపువ్వు, యాలకులు, పుదీన ఆకులు వేసి వేగనివ్వాలి. అందులో ఉకడబెట్టిన చికెన్ ముక్కలను గ్రేవీ లేకుండా వేసి ఎర్రగా వేయించాలి. తర్వాత మిగిలిన గ్రేవీ కూడా వేసి అడుగంటకుండా వేయించాలి. దించబోయేముందు కొద్దిగా కొత్తిమీర చల్లుకుంటే చాలు.

కొబ్బరి పాల కేక్

కావలసిన పదార్థాలు

తురిమిన పచ్చికొబ్బరి - ఒకటిన్నర కప్పు,
మైదాపిండి - రెండు కప్పులు, బేకింగ్ పౌడర్ - 3 స్పూన్లు,
ఉప్పు - చిటికెడు పాలు - ముప్పావు కప్పు, కోడిగుడ్లు - 3,
వెనిలా ఎసెన్సు - అరస్పూను.

తయారు చేసే విధానం

మైదా, బేకింగ్ పౌడర్, ఉప్పు జల్లించుకోవాలి. వెన్న, పంచదార, గుడ్డు పచ్చసొన, పాలు, మైదా వేసి బాగా గిలక్కొట్టాలి. చివరిలో కొబ్బరితురుము, వెనిల్లా ఎసెన్సు వేసి కొద్దిసేపు గిలక్కొట్టాలి. దీనిని ఒక బౌల్‌లో పోసుకోవాలి. ప్రెషర్ కుక్కర్‌లో పట్టేంత చిన్న గిన్నెలో ఇసుక పోసి సిద్ధం చేయాలి. దానిమీద, కేక్ మిశ్రమం పోసిన బౌల్‌ని పెట్టి మూత పెట్టి స్టౌమీద సిమ్‌లో 40నిమిషాలు ఉడకబెట్టాలి.

చాక్లెట్ కేక్

కావలసిన పదార్థాలు

మైదాపిండి - 2 కప్పులు, పంచదార పొడి - 2 కప్పులు,
ఉప్పు - చిటికెడు, నీరు - ముప్పావు కప్పు,
పెరుగు - ముప్పావు కప్పు, వెన్న - అరకప్పు, కోడిగుడ్లు - 2,
వెనిల్లా ఎసెన్సు - 1టేబుల్ స్పూన్,
కోకో - పావు కప్పు

తయారు చేసే విధానం

మైదా, బేకింగ్ పౌడర్, ఉప్పు, తినేసోడా, కోకో పౌడర్ అన్నీ కలిపి జల్లించుకోవాలి. పంచదార, వెన్న, గుడ్లు, మైదా, పెరుగు, నీళ్లు పోసి బాగా కలిపి చివరిలో వెనిల్లా ఎసెన్సు కూడా కలిపి గిలక్కొట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని కేక్ బాక్సులో పోసి స్టౌమీద సిమ్ లో పెట్టి 45 నిమిషాలు ఉడికించుకోవాలి.

కొబ్బరి హల్వా

సౌత్ ఇండియన్ చికెన్ రోస్టు

కొబ్బరి పాల కేక్

చాక్లెట్ కేక్

ఎస్సీల విద్యా ప్రగతిలో... సంక్షేమ హాస్టళ్ళు - సదుపాయాలు



శ్రీ కె. రోశయ్య
అంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

వెనుకబాటుతనానికి అసలైన కారణం నిరక్షరాస్యత. అందుబాటులో ఉన్న వనరులను అభివృద్ధికి తోడ్పడేవిధంగా మలచుకోవాలన్నా, అవకాశాలను అందిపుచ్చుకుని ఉజ్వలభవితకు బాటలు వేసుకోవాలన్నా, రోజు రోజుకూ అందుబాటులోకివస్తోన్న వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకుని మెరుగైన జీవనాన్ని పొందాలన్నా... అందుకు కావలసింది విద్య. విద్యలేని కారణంగానే ప్రతి అవసరానికి ఇతరుల మీద ఆధారపడే పరిస్థితులు ఏర్పడతాయి. స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యం లేకపోవడమే ఇందుకు కారణం.

దళితులు ఇన్నాళ్ళుగా అన్నిరంగాలలో వెనుకబడి ఉండడానికి ప్రధానకారణం నిరక్షరాస్యతే అన్నది నిర్వివాదాంశం. అయితే వారిని విద్యకు దూరం చేస్తోంది పేదరికం అన్నది కూడా కాదనలేని సత్యం. పేద కుటుంబాలు తమ పిల్లలను ఆదాయవనరులుగా భావిస్తాయి. పిల్లలు కూడా పనిచేసి అంతో ఇంతో సంపాదించి తెస్తేనే తప్ప ఆ కుటుంబాల కనీస అవసరాలు తీరవు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను బడికిపంపడం అంటే ఆ కుటుంబాల ఆదాయమార్గాలు మూతపడ్డట్టే. పైపెచ్చు వారి చదువుపై ఖర్చు చేయవలసి వస్తే అది వారి వల్ల కాని పని. ఎస్.సి.లలో విద్యాభివృద్ధి జరగకపోవడానికి ఈ ఆర్థిక వెనుకబాటే కారణం. ఎస్.సి. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు వంటివి ఎప్పట్నుంచో ఉన్నా హాస్టళ్ళలో ఉన్న అరకొరవసతులు గాని, ఎటూచాలని స్కాలర్‌షిప్‌లుగాని వారిని చదువువైపు ఆకర్షించలేకపోయాయి. అయితే గత ఐదేళ్ళలో పరిస్థితులు మారాయి. దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెరుగైన హాస్టల్ సౌకర్యాలు వంటి విషయాలలో తీసుకున్న చర్యలు దళితుల దృక్పథంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చాయి. ఇంటిని మరపించే హాస్టల్ వసతులు, పెరిగిన మెస్ ఛార్జీలు, ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్... ఈ సౌకర్యాలన్నీ అందుకునే విద్యార్థి కుటుంబాల వార్షికాదాయ పరిమితిని లక్ష రూపాయలకు పెంచడం... వంటి ఎన్నో చర్యలు ఎస్.సి.లను చదువుకునేందుకు ప్రోత్సహించాయి. ఫలితంగా నేడు రాష్ట్రంలో ఉన్నతవిద్యను అందుకుంటోన్న దళితుల సంఖ్య బాగా పెరిగింది. పాఠశాల డ్రాపవుట్‌లలోనూ దళితుల సంఖ్య తగ్గింది. గత ఏడాది సాంఘిక సంక్షేమ హాస్టళ్ళల్లో 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత 92.7%గా ఉండటమే దళితుల్లో వికసిస్తోన్న విద్యాభివృద్ధికి నిదర్శనం.

ఇంటిని తలపిస్తోన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు:

జనాభాలెక్కల ప్రకారం రాష్ట్రంలోని దళితుల సంఖ్య 123.39 లక్షలు. అంటే మొత్తం రాష్ట్రజనాభాలో 16.19%. వీరి అభివృద్ధిలో భాగంగా 2,53,413 మంది ఎస్.సి. విద్యార్థులకు హాస్టళ్ళలో ఉచితవసతి కల్పించి చదివిస్తోంది సాంఘిక సంక్షేమ శాఖ.

దళితుల్లో విద్యాభివృద్ధి, సామాజిక – ఆర్థిక అభివృద్ధి, దళితులకు సామాజిక భద్రతనిచ్చే కార్యక్రమాల అమలు, దళితుల రక్షణ, సంక్షేమం వంటి బాధ్యతలను నిర్వర్తించే సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యావిభాగానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 2,358 హాస్టళ్ళు ఉన్నాయి. ఇందులో బాలికలకు 667 హాస్టళ్ళున్నాయి. ఈ హాస్టళ్ళలో ఎస్.సి.లకు 70%, ఎస్.సి.ల నుండి క్రిస్టియన్లుగా మారిన వారికి 12% చొప్పున అంటే మొత్తంగా 82% మంది ఎస్.సి. విద్యార్థులకు ప్రవేశాన్ని కల్పిస్తున్నారు.

ప్రతి హాస్టల్‌లోనూ విద్యార్థులు ఎటువంటి సమస్యలనూ ఎదుర్కొనకుండా సౌకర్యవంతంగా, సాఫీగా తమ చదువును కొనసాగించే మెరుగైన వసతులను కల్పిస్తోంది సాంఘిక సంక్షేమ శాఖ.

ఐదేళ్ళలో 65% పెరిగిన మెస్‌చార్జీలు: కాలేకడుపుతో చదువును వంట బట్టించుకోవడం సాధ్యమా? సాధ్యం కాదన్న విషయాన్ని గ్రహించిన వై.యస్. తన పాలనాకాలంలో ఎస్.సి. విద్యార్థుల డైట్‌చార్జీలను రెండుసార్లు పెంచారు. 2006లో అంతకు ముందున్న మెస్‌ఛార్జీలను 25% పెంచారు.

మళ్ళీ 2008లో మరో 40% పెంచడంతో 2004లో రూ.270/–లుగా ఉన్న 3–8 తరగతి చదివే విద్యార్థి నెలవారీ మెస్‌చార్జి 2008 కల్లా రూ.475/–లు అయ్యింది. అలాగే 9,10 తరగతులు చదివే విద్యార్థి మెస్‌చార్జి రూ.330/–ల నుండి రూ.535/–లకు పెరిగింది. విద్యార్థులు పౌష్టికాహారలోపాన్ని ఎదుర్కొనకుండా వారి ఆహారంలో వారానికి నాలుగుసార్లు కోడిగ్రుడ్లు, పండ్లు ఉండేట్లు చూస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ: క్రమం తప్పకుండా ప్రతి హాస్టల్‌లోనూ విద్యార్థులకు హెల్త్ చెకప్‌లను నిర్వహిస్తున్నారు. బలహీనంగా ఉన్నవారికి విటమిన్ మాత్రలను అందించడం జరుగుతోంది. అత్యవసర వైద్యం కోసం రూ.1000/–ల వరకు ఒక్కో విద్యార్థిపై ఖర్చుచేసే అధికారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఉంది. అంతకుమించితే కలెక్టర్ అనుమతితో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రూ.5000/–ల నుండి రూ.10వేల వరకు కేటాయించవచ్చు. ఈ సౌకర్యాలతో బాటు హాస్టల్‌లో ఉండి చదువుకునే ఎస్.సి. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల నుండి రూ.50వేల వరకు వైద్య బీమా సౌకర్యం కూడా ఉంది. అలాగే విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఆటలను నిర్వహించేందుకు హాస్టళ్ళలో క్రీడాసౌకర్యాలను కూడా అభివృద్ధి చేస్తోన్నారు. ఏడాదికి ఒక్కో హాస్టల్ వెయ్యిరూపాయల క్రీడాసామాగ్రిని సమకూర్చుకోవచ్చు.

ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ప్రత్యేక శిక్షణ: ప్రతి హాస్టల్ విద్యార్థికి అవసరమైన పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను విద్యాశాఖ సరఫరా చేస్తోంది. ప్రతి సంవత్సరం అకాడమిక్ ఇంప్రూవ్‌మెంట్ కోసం 9,10 తరగతుల వారికి వర్క్‌బుక్స్, స్టడీ మెటీరియల్‌ను అందిస్తోంది ప్రభుత్వం. విజ్ఞానాన్ని అందించేందుకు 'మాబడి', 'పాఠశాల' వంటి మాసపత్రికలను విద్యార్థులకు సరఫరా చేస్తోంది. ప్రతి హాస్టల్‌లోనూ గ్రంథాలయాలను నిర్వహిస్తోంది. సంవత్సరానికి వెయ్యి రూపాయల వరకు ఒక్కో హాస్టల్ గ్రంథాలయాల నిర్వహణకు వెచ్చించే వీలుంది. వీటికి అదనంగా 7,9,10 తరగతులు చదివే విద్యార్థులకు గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణను ఇచ్చేందుకు ట్యూషన్ ఫీజులను కూడా ప్రభుత్వం చెల్లిస్తోంది. మూడు నుండి ఎనిమిదవ తరగతి చదివే విద్యార్థులకు కూడా ప్రత్యేకతరగతులను నిర్వహించేందుకు 2008–09 విద్యాసంవత్సరంలో 4,973 మంది విద్యావాలంటీర్లను రాజీవ్ విద్యాకమీషన్ ద్వారా నియమించింది.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్: ఎస్.సి. విద్యార్థులను ఉన్నతవిద్యకు ప్రోత్సహించేదిశగా ఈ ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పెంచడమేకాకుండా పారదర్శకత కోసం ఈ స్కాలర్‌షిప్‌లను ఆన్‌లైన్‌లో అందిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పైసా ఖర్చులేకుండా దళిత విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులను అభ్యసించే అవకాశం కలిగింది.

అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తిగా రాష్ట్రంలో దళిత విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను అమలుపరుస్తోంది రాష్ట్రప్రభుత్వం. ఫలితంగా దళిత కుటుంబాలలో విద్యాకుసుమాలు విరబూస్తున్నాయి. ఇది దళిత ప్రగతికి శుభసంకేతం. ప్రభుత్వం అందిస్తోన్న ఈ చేయూత ఆధారంగా ఎస్.సి.లు అభివృద్ధిని సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని, వెనుకబాటుతనాన్ని అధిగమించి ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని ఆశిద్దాం.

జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

వైభవ విషాదం - సావిత్రి!

-తెర

అమెను తల్చుకోగానే తెలుగు దనం తొణికిసలాడే ఒక కళాత్మక మహిళా మూర్తి మనసులో కదలాడుతుంది. అభినయం మూర్తీభవించిన విదుషీమణి సాక్షాత్కరిస్తుంది. నటీనటులు ధరించిన పాత్రలూ వారి వాస్తవ జీవితాలూ పెనవేసుకు పోవడం అరుదుగానైనా జరుగుతుంటుంది. అందులోనే అనేక వైరుధ్యాలూ వుంటాయి. అలాటి అరుదైన జీవితం సావిత్రిది! ఆమె తర్వాత ఎంత ప్రతిభావంతులైన కథానాయికలు వచ్చినా ఒక పట్టాన ఆమెతో పోల్చలేని స్థితి కొనసాగుతూనే వుంది. వాణిశ్రీ, శారద, సుహాసిని, సౌందర్య ఇలాంటి వారిని ఎంతగానో ఆరాధించేవారు కూడా సావిత్రిలోని సంపూర్ణత్వం వుందని మాత్రం పూర్తిగా ఆమోదించలేరు. ఆమె వేసిన ముద్ర అంత ప్రగాఢమైంది.

కొంతమంది లాగా సావిత్రి బంగారు సోపానాలపై నడిచి రాలేదు. వెండి తెర ఆమెకు ఎర్రతివాచీలు పర్చి ఆహ్వానించలేదు. నటనపై ఎనలేని మక్కువతో- ఎన్ని సార్లు కాదన్నా ఎదురీద గల తెగువతో ఆమె పోరాడి నిలదొక్కుకుంది. తెరపై ఒక మూల ఒక్కసారి కనిపించే పాత్రలైనా ధరించేందుకు సిద్ధపడి తర్వాత అక్కడ ఎవరున్నా తననే చూపించకతప్పని శిఖరాగ్రస్థాయికి చేరింది. మొదటి తరంలో ఇద్దరు హీరోలు- ఏఎన్నార్, ఎన్టీఆర్. ఆ స్థాయి హీరోయిన్ మాత్రం సావిత్రి మాత్రమే. భానుమతి, జమున వంటి వారి దారి వేరు.

ఎల్.వి.ప్రసాద్ ఇద్దరు అగ్రనటులతో తీసిన 'సంసారం' లో చెలికత్తె పాత్రతో ప్రవేశించిన సావిత్రి తారాపథంలోకి దూసుకెళ్లడం తథ్యమని అందరికీ అర్థమై పోయింది. 'దేవదాసు'లో అనుకోకుండా వరించిన పార్వతి పాత్ర సావిత్రి స్థానాన్ని శాశ్వతం చేసింది. ఆ చిత్రం పూర్తిగా హీరో ప్రధానమైంది. విఫల ప్రేమ, తాగుబోతు జీవితం వగైరాలతో నడిచే ఆ చిత్రంలో నాయిక కూడా మర్చిపోలేని విధంగా జనం హృదయాల్లో నిల్చిపోయిందంటే సావిత్రి నటనే ప్రధాన కారణం. అప్పుడప్పుడే నిలదొక్కుకుంటున్న యువప్రాయంలోనే అంత బరువైన పాత్రను అవలీలగా ధరించి సావిత్రి సత్తాను చాటుకుంది.

అక్కినేని, సావిత్రి పోటీ పడి అటు ప్రేమనూ ఇటు విషాదాన్ని కూడా అద్భుతంగా పలికించి అఖండ విజయాలు సాధించిన చిత్రాలకు లెక్కేలేదు. 'అర్ధాంగి'లో పరిపక్వత లేని భర్తగా నటించిన అక్కినేనిని తీర్చిదిద్దిన పాత్ర ఆ మహానటుని ప్రశంసలందుకొంది. తొలిసారి గోదారి సౌందర్యాలను యథాతథంగా అందించిన చిత్రం 'మూగమనసులు'. ఈ చిత్రంలో విషాద మూర్తిగా సందిగ్ధ జీవిగా సావిత్రి పాత్ర చాలా సంక్లిష్టమైంది. 'సుమంగళి'లో కోరి చేసుకున్న రోజునే భర్త దాంపత్య జీవితానికి పనికి రాకుండా పోతే 'సిగపూలు వాడకనే చెలి బతుకు వాడెనయా' అన్న ఘంటసాల పాటకు సరితూగేది సావిత్రి నటనే. ఒక విధంగా ఆ కథల్లోని నాటకీయతను కూడా పరిహరించి పండించడం ఆమె సహజ నటన ఫలితమే. 'చివరకు మిగిలేది'లో జీవితం తాకిడికి స్థిమితం కోల్పోయిన పాత్రలో సావిత్రి నటన జాతీయంగా ఆ పాత్ర వేసిన హిందీ, బెంగాలీ నటీమణులను మించిపోయింది. 'మనుషులు మమతలు, మంచి మనసులు, తోడి కోడళ్లు, మాంగల్యబలం' ఇలా అక్కినేని, సావిత్రి కలయికలో విరబూసిన తెరమల్లెలెన్నో! ఈ రొమాంటిక్ జంట అన్నాచెల్లెళ్లుగా నటించిన 'డాక్టర్ చక్రవర్తి' కూడా పెద్ద హిట్టే! తొమ్మిది రోజులూ తొమ్మిది వేషాలతో సాగే నవరాత్రి ఈ జాబితాలో మరో ప్రత్యేక ప్రయోగం.

నటన పరంగా సావిత్రి అక్కినేనితో తులతూగితే మరో కోణంలో చూసినప్పుడు ఎన్టీఆర్‌తో ఆమె జంటగా వేస్తే చాలా నిండుగా వుంటుంది. 'గుండమ్మ కథ' ఇందుకు ఓ ఉదాహరణ. 'దేవత' మరొకటి. ఇద్దరూ కొంచెం పెద్దవారైనాక నటించిన 'విచిత్ర కుటుంబం'లోనైతే కుటుంబ సంబంధాలను, అనుబంధాలను కళ్లకు కట్టినట్టు పండిస్తారు. తమ్ముణ్ణి బిడ్డకన్నా మిన్నగా ప్రేమించిన తల్లిగా సావిత్రి ఆ ఘర్షణాత్మక పాత్రకు ప్రాణం పోసింది. వారిద్దరూ 'ఆత్మబంధువు'లో చదువుసంధ్యలు లేని అమాయకుడైన భర్తగా నటించిన ఎన్టీఆర్‌ను నడిపించే భార్యగా, ఆయనే 'కలసి వుంటే కలదు సుఖం'లో శారీరక లోపం గల పాత్రలో నటిస్తే నడిపించిన భార్యగానూ అంత బాగా చేసింది. 'పాండవ వనవాసం, నర్తనశాల' వంటి పౌరాణిక చిత్రాల్లోనూ రామారావు పక్కన ద్రౌపదిగా కనువిందు చేసింది. సావిత్రి, ఎస్వీఆర్‌లు కలసి నటిస్తే ఆ విషాద గంభీరాన్ని భరించడం ఎంత కష్టమో! 'ఆత్మబంధువు, బాంధవ్యాలు' వంటి చిత్రాల్లో కుటుంబ పెద్దగా ఎస్వీఆర్, కీలకమైన ఇల్లాలి పాత్రలో సావిత్రి పోటీపడి నటించిన దృశ్యాలు మనస్సును చలింపచేస్తాయి.

సావిత్రి అంటే సాత్వికతే ప్రధానంగా గుర్తుకు వస్తుంది గాని ఆమె చేసిన హాస్యం తక్కువ కాదు. గురజాడ 'కన్యాశుల్కం'లో మధురవాణి పాత్రకు అతికినట్టుగా సరిపోయింది. 'మాయాబజార్'లో ఘటోత్కజుడు (ఎస్వీఆర్) శశిరేఖగా మారిన తర్వాత ఘట్టాలలో సావిత్రి నటన ఆమెకే చెల్లింది. 'దొంగరాముడు'లోనూ ఇదే తరహా గడుగ్గాయి పాత్ర. ఇంతకు ముందు చెప్పుకున్న 'అర్ధాంగి' కూడా ఆ కోవలోదే. 'అప్పుచేసి పప్పుకూడు, పెళ్లి చేసి చూడు' వంటి హాస్య చిత్రాల్లోనూ నటించి నవరసాలు పండించింది.

సావిత్రి కళ్లలో పలికించే భావం అద్భుతం. ఆమె విషాదాభినయం నిజంగానే చాలా బరువెక్కించే అనుభూతిని మిగులుస్తుంది. శరీరం స్థూలమైన తర్వాత కళ్లలో పలికే భావాల కారణంగానే ఆమె దాంపత్య ప్రణయాన్ని అభినయిస్తూనే వచ్చింది. అయితే బాడీ లాంగ్వేజ్ తక్కువేనని ఆమె తర్వాత అంత పేరు తెచ్చుకున్న వాణిశ్రీ ఒక సందర్భంలో చెప్పారు.

'మాతృదేవత'లో ఎన్టీఆర్‌తో నటించడమే కాక దర్శకత్వం కూడా వహించింది. అన్నట్టు తెలుగులో తొలి మహిళా దర్శకురాలు సావిత్రి. మొత్తం మహిళలతో ఆమె తీసిన చిత్రం 'చిన్నారి పాపలు' ఆమెను ఆర్థికంగా చితక్కొట్టింది. తర్వాత కూడా జగ్గయ్యతో 'వింత సంసారం', చలంతో 'చిరంజీవి, మాతృదేవత' తదితర చిత్రాల నిర్దేశకత్వం నిర్వహించి సామర్థ్యం చాటుకున్నది. సావిత్రి విదుషీమణి కూడా. అభ్యుదయ కవులు నిర్వహించిన నవత పత్రిక సంపాదకవర్గంలో శ్రీశ్రీ వంటి వారితో పాటు ఆమె కూడా భాగం పంచుకున్న సంగతి చాలా మందికి తెలియదు. అలాగే చదరంగం అసోసియేషన్‌లోనూ. చేతికి ఎముక లేకుండా దానాలిచ్చిన సావిత్రి చివరకు తనే దివాళా తీసే స్థితికి చేరింది. జెమినీ గణేషన్‌తో వివాహం ఒడుదుడుకులకు గురి కావడం, శరీరం స్థూలమై తారాపథం నుంచి జారిపోవడం, దర్శకత్వం దాతృత్వాలతో ఆర్థిక పరిస్థితి తలకిందులవడం, ఆ ప్రభావంతో వ్యసనాలు తీవ్రమవడం ఇవన్నీ కలసి మహానటిని కరగించి వేశాయి. పురాణాలలో సావిత్రి యముడితో పోరాడి మృతుడైన భర్తను బతికించుకుంది. సినీ మాయాబజార్‌లో సావిత్రి కోరి చేసుకున్న భర్తతో దూరాన్ని భరించలేక తన కథనే విషాదాంతం చేసుకుంది. అదో విషాద వైభవం!

2009
విజ్ఞాన విహంగం



నానోటెక్నాలజీలో కూడా కొత్త ఆవిష్కరణలు జరిగాయి. ప్రత్యేకించి మామూలు కాగితం నుండి బ్యాటరీలను, సూపర్ కెపాసిటర్‌లను రూపొందించారు. ఈ టెక్నాలజీ ద్వారా కాగితానికి కార్బన్ నానో ట్యూబులను అనుసంధానం చేస్తే ఆ కాగితం మొత్తం ఓ బ్యాటరీలా పనిచేస్తుంది. రాబోయే రోజుల్లో తేలికైన మడిచే, చుట్టే వీలున్న కంప్యూటర్లు, ఇ-రీడర్లు, టీవీ స్క్రీన్‌లు రానున్నాయనడానికి ఇది సూచన. ఇదే క్రమంలో వైరస్‌తో బ్యాటరీలు చేసే ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

- కాకర్లమూడి విజయ్

లెక్కల ప్రకారం మరో సంవత్సరం కాలంలో కలిసిపోబోతుంది. ఈ మూడొందల చిల్లర రోజులలో విజ్ఞానం ఎంతో అభివృద్ధి సాధించింది. ఇప్పటివరకూ తెలిసిన విషయాలకు మరింత బలం జతపరిచింది. తెలియనివెన్నో వెలికి తీసింది. ఎన్నో కొత్త ఆశలను కల్పించింది. మరెన్నో భయాలను సృష్టించింది.

ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ అంతరిక్ష సంవత్సరంగా ప్రకటించారు. యాదృచ్ఛికంగా ఈ రంగంలోనే ఈ ఏటి ఆసక్తికరమైన వార్త వెలువడింది. అది - చంద్రుడిపై నీరుందన్న నిదర్శనం. ప్రత్యేకంగా మన దేశం పంపిన చంద్రయాన్ ద్వారానే ముందు నీటి ఉనికి లభించిందన్న విషయం మరీ విశేషం. అలాగే దాదాపు 'పాత'బడిపోయిన హబుల్ అంతరిక్ష టెలిస్కోపుకు అవసరమైన మరమ్మతులు నిర్వహించి మరింత మెరుగైన విశ్వ చిత్రాలను చూసే అవకాశమూ కలిగింది.

మార్స్ (అంగారక గ్రహం) మీద కూడా నీరు ఉండే అవకాశాలు ఎక్కువని తెలిసింది. ఇక మానవ ప్రయోగంలో బ్లాక్‌హోల్స్ ఏర్పడి భూగ్రహాన్ని పీల్చేసుకుంటాయని 'పుకారు' వచ్చింది ఈ సంవత్సరంలోనే. ఎల్‌హెచ్‌సి ప్రయోగంలో అటువంటి విపత్తు ఏమీ జరగకపోయినా, ప్రోటాన్ పుంజాలను అనూహ్య వేగంతో ప్రయాణింపచేసి ఢీ కొట్టించడం గొప్ప విజయమే.

సౌరకుటుంబానికి ఆవల మరో 32 గ్రహాలను కనిపెట్టారు. వీటితో అటువంటి ఎక్సోప్లానెట్ల సంఖ్య 400 దాటింది. హబుల్ టెలిస్కోపు కొత్త ఫొటోల వల్ల మరో వంద వరకూ ఎక్సోప్లానెట్ల ఆనవాళ్లు లభించాయి.

అంతరిక్ష అధ్యయనం బాగానే ఉంది. కానీ, మనమే తయారు చేసి అంతరిక్షంలోకి వదిలిన వాహనాలు, ఇతర పరిశోధక పరికరాలు ఎప్పుడో ఒకప్పుడు మనకు ప్రమాదం తేవచ్చని ఒక చిన్న సూచన ఇచ్చింది. ఒక ఘటన - ఒక అమెరికన్ శాటిలైటు, ఒక రష్యన్ శాటిలైటు సైబీరియా ప్రాంతంలో ఢీకొని, దాదాపు 600 ముక్కలుగా చిన్నాభిన్నమయ్యాయి!

ఇక నానోటెక్నాలజీలో కూడా కొత్త ఆవిష్కరణలు జరిగాయి. ప్రత్యేకించి మామూలు కాగితం నుండి బ్యాటరీలను, సూపర్ కెపాసిటర్‌లను రూపొందించారు. ఈ టెక్నాలజీ ద్వారా కాగితానికి కార్బన్ నానో ట్యూబులను అనుసంధానం చేస్తే ఆ కాగితం మొత్తం ఓ బ్యాటరీలా పనిచేస్తుంది. రాబోయే రోజుల్లో తేలికైన మడిచే, చుట్టే వీలున్న కంప్యూటర్లు, ఇ-రీడర్లు, టీవీ స్క్రీన్‌లు రానున్నాయనడానికి ఇది సూచన. ఇదే క్రమంలో వైరస్‌తో బ్యాటరీలు చేసే ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

మరో రెండేళ్లలో ప్రపంచం అంతమైపోబోతుందన్న 'భవిష్యవాణి' లు పసలేనివని శాస్త్రీయంగా తేలిపోయాయి. కానీ ఆ సమయానికి కచ్చితంగా అంతరించిపోయే ఒక మహా ఆవిష్కరణ మాత్రం ఒకటుంది. అది మనకు చిరపరిచితమై, మన జీవితాల్లో ముఖ్యభాగమైపోయిన బల్బు. ఈ పాటికే చాలా దేశాలు క్రమక్రమంగా బల్బును ప్రపంచానికి వెలుగిచ్చినా, ప్రస్తుత విజ్ఞాన ప్రపంచంలో అవి అధిక విద్యుత్ వాడేస్తున్నాయనే అభియోగం ఉంది. వాటికంటే మెరుగైన బల్బులు రావడంతో వాటి వాడకం సంపూర్తిగా మానేయాలని పర్యావరణవేత్తల అభిలాష.

ఇక ప్రమాదంలో పడిన భూవాతావరణం గురించి చర్చించి, తగు చర్యలు ప్రతిపాదించడానికి ప్రపంచ దేశాల అగ్ర నేతలందరూ డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్‌లో సమావేశమయ్యారు. ఈ చర్చకు ముందు సాధారణ అనాసక్తి కనిపించినా, చర్యల ప్రారంభంలో ఆశాజనకంగానే అనిపించింది. కానీ ఉద్గారాల కోత/తగ్గింపుపై కన్నా అందుకు అవసరమయ్యే 'ధనం' మీదనే ఈ చర్చల విజయం ఆధారపడి ఉందన్నది అర్థమై రభస ప్రారంభమైంది.

గత ఏడాది, అంతకు ముందు ఏళ్లలో రకరకాల వ్యాధులు ముందుకొచ్చాయి. ఈ ఏడాది హెచ్‌వన్‌ఎన్‌వన్ వంతు వచ్చింది. 'స్వైన్ ఫ్లూ'గా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ శ్వాసకోశ వ్యాధి ప్రపంచదేశాలను గడగడలాడించింది.

ఇంకా చాలా అంశాల్లో అభివృద్ధి జరిగింది. కానీ అవన్నీ నేరుగా, వెంటనే మనపై ప్రభావం చూపేది కావు. రాబోయే సంవత్సరంలో అవి మరింత విస్తృత అధ్యయనం జరిగి, మన జీవితాలను సరళం చేసే దిశగా కదులుతున్నాయి.

ముక్తాయింపుగా ఓ ముచ్చట. సాంకేతికత సాయంతో ప్రపంచం అంతరించి పోబోతుందన్న కథలో ఓ సినిమా వచ్చింది. అందులో సాంకేతికత తప్ప శాస్త్రీయత లేదు. ఈ మధ్యే మరో సినిమా వచ్చింది. తెరపై సినిమాను వీక్షించే ప్రక్రియకు అత్యున్నతమైన సాంకేతిక తోడ్పాటును జోడించి తీసిన 'అవతార్' టెక్నాలజీలో ఒక మైలురాయి. అందులో ఆలోచింపజేసే విషయమూ ఉంది. భూవాసులు తమ గ్రహాన్ని ఎంత నాశనం చేయ్యాలో అంతా చేసి, పక్కనున్న గ్రహంపైన ఉన్న ఒక విలువైన ఖనిజం కోసం అక్కడికి చేరతారు. స్వర్గంలా ఉన్న ఆ గ్రహాన్ని చూసిన తరువాత అక్కడి వారితో పోరాటానికి బదులు వారితో కలిసిపోవడం మలుపు. 3-డి సాంకేతిక పరిజ్ఞానానికి పరాకాష్ట(ఇప్పటివరకూ)గా ఈ చిత్రం మనకిచ్చే సందేశం. పర్యావరణాన్ని, ప్రపంచాన్ని కాపాడుకోండి. రానున్న సంవత్సరానికి అందరమూ ఈ సందేశాన్ని అర్థంచేసుకుని అమలు చేస్తే బావుంటుంది. ★

అట్టమీది కథ

2010 ముంగిట్లో...



హలో నమస్తే... కొత్త సంవత్సరంలోకి అడుగెట్టడానికి సిద్ధమౌతోంటే మధ్యలో మీరెవరు? అనుకుంటున్నారా! నేనండీ. మీలా ఓ సామాన్యురాలిని.

అయినా నిన్నగాక మొన్న కొత్త సంవత్సరంలోకి వచ్చాం. ఇంతలోనే ఆ ఏడాది పాతదైపోయింది. కొంగొత్త సంవత్సరం పరుగెత్తుకుంటూ వస్తోంది. మొన్నకు హలో చెప్పేలోగానే నిన్నకు గుడ్‌బై చెప్పాల్సిన తరుణం వచ్చేస్తుంది. రేపటివైపు చూద్దామనుకునేంతలోనే అది నిన్నటి ఖాతాలోకి జమైపోతుంది. కాలంలో వున్న మహత్తే అది. రోజులు లెక్కబెట్టేలోపు సంవత్సరాలు గిర్రున తిరిగిపోతుంటాయి.

గడిచిన ఏడాది కాలంలో ఎన్ని అనుభూతులు! ఎన్నెన్ని గుర్తులు!! ఎన్నెన్ని పాఠాలు!!! కొంచెం కారంగా...కొంచెం తీయంగా...అచ్చంగా ఉగాది పచ్చడిలా బోలెడన్ని జ్ఞాపకాలు. ఇవికాక నూతనంగా తీసుకున్న నిర్ణయాలు. అన్నీ మనసు నిండా తిష్టవేసుకుని కూర్చున్నాయి. మీతో పంచుకోకుండా ఎలా....

- కె.అంజన

2009తో పచ్చి కొట్టేశా. ఇలా ఎందుకంటున్నానో మీకు మాత్రం తెలీదటండీ. ఈ ఏడాది ధరలు ఎంత మండిపోయాయి. అమ్మా... కూరగాయలు మొదలుకొని పప్పు-ఉప్పు వరకు ఏది కొందామన్నా అందిందా! అన్నీ ఎంచక్కా చుక్కలతో జత కట్టాయి. మనల్ని వెక్కిరించాయి. జీతానికి, పెరిగిన ధరలకు లంకె కుదిరితేగా. పెరిగే ధరలు బారెడు, వచ్చే జీతం బెత్తెడు. జీతపురాళ్లతో నెల రోజులు గడపడం కత్తిమీద సాములా తయారైందనుకోండి. అక్కడికీ సినిమా ఖర్చు కూడా తగ్గించేశాం. నెలకో సినిమా చూసే సీన్ పోయి ఏడాదికో సినిమా లెవల్‌కు దిగిపోయాం. రెండు చక్రాల బండికి తైలం పోయలేక నాలుగు చక్రాల వాహనంలోకి షిఫ్టయ్యాం. అదేనండీ... పిల్లలం, పెద్దలం అందరం బైక్‌కు బై చెప్పేసి బస్సు ప్రయాణం మొదలెట్టాం. ప్రస్తుతం ఇంటి మొత్తానికి ఒకటే సెల్లు. జేబుకు చిల్లు పెట్టే సెల్లులను వదిలించుకోవడం వల్ల మేలే జరిగిందిలెండి! సొంత గూడు లేని గరీబులం మరి. ఏడాది తిరిగేసరికి అద్దె పదిశాతం పెరుగుతుందిగా. మొన్నే ఓనరమ్మ పిల్చి ఈ శుభవార్త చెవినవేసింది. పిల్లలు పెరిగి పెద్దవారై పై తరగతులకెళుతోంటే ఓ వైపు సంతోషం. మరో వైపు ఏదో తెలీని విచారం. మరి క్లాసులు పెరిగేకొద్దీ ఫీజుల మోతా, ఖర్చూ పెరుగుతుందిగా. పెద్దోడిని మంచి కాలేజీలో చేర్చేదాకా నాకు నిద్రెక్కడిది! మధ్యతరగతి మానవుల మాటే ఇలా వుంటే ఇంక నిరుపేదల సంగతెలా వుందో!! అందుకే 2009తో పచ్చి కొట్టేశా. అయినా మనం పచ్చి కొట్టామని అదేం మూతి ముడుచుకుని కూర్చోదుగా. అలా నవ్వుతూ వెళ్లిపోతుంది.

ఐటీ చిరునవ్వులు ఏవీ...

ఓడలు బళ్లవుతాయి. బళ్లు ఓడలౌతాయంటే ఇదేనేమో! మొన్నటిదాకా ఐటీ, సాఫ్ట్ రంగాల్లో పనిచేసే వారంటే ఎంత గొప్ప. వాళ్లని చూస్తే చాలు ... మా పిల్లలను కూడా ఆ చదువులే చదివించాలి. ఆ ఉద్యోగాలే చేయించాలి. అనుకునేవారం. అసలు వాళ్లు సూపర్‌మార్కెట్ల కొస్తే ఒక కొనేవారూ! చెప్పడానికి మాటలు చాలవుకదా. ఏదో ఒక చిన్నసైజు కిరాణాకొట్టు తెరవడానికా అన్నట్టు ఇనుపచక్రాల బండి నిండా సరుకులు కొనుక్కెళ్లేవారు. వాళ్లు వేసుకనే బట్టలు, చెప్పులు, వాడే కారు, వుండే ఇల్లు...ఒకటేంటి అన్నీ ... "అబ్బ మనం కూడా అలా వుండగలిగితేనా" అనిపించేది. నెల తిరిగేసరికి లక్షల్లో జీతాలు మరి. బంధువర్గంలో కూడా వాళ్లకెంత విలువ! ఏదైనా పార్టీ చేసుకున్నా, ఫంక్షన్ పెట్టుకున్నా, పేరంటం అనుకున్నా... పిలుపుల జాబితాలో వారిదే మొదటిస్థానం. శని ఆదివారాల్లో జామ్మంటూ కార్లలో షికార్లు చేయాల్సిందే. నాటు ముక్క... విదేశీ చుక్క గొంతులో దిగాల్సిందే. ఇక వాళ్ల పిల్లల సంగతి చెప్పేదేముంది! కార్లలో ఇంటర్నేషనల్ స్టాండార్డ్ స్కూళ్లకు పోయిరావడం. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చేసే బర్త్‌డే ఫంక్షన్లు చూసి కళ్లు తిరిగిపోయేవి. అలాంటోళ్ళను కూడా సంక్షోభ భూతం 'వదల బొమ్మాళీ వదల' అంటూ పట్టేసింది. ఐటీ బుడగ పగిలి ఉద్యోగాలు ఊడి చిరునవ్వుల సంసారాలు కలతల కాపురాలుగా రూపాంతరం చెందినవెన్నో. ఆ ఖర్చులూ, నవ్వులూ, పార్టీలూ అన్నీ తగ్గుముఖం పట్టాయి. ఉద్యోగం ఊడకుండా వుంటే చాల్రా బాబూ అనుకుంటున్నారు. అన్నట్టు ఇదివరలో ఐటీ కుర్రాడనగానే కళ్లు మూసుకుని పిల్లనిచ్చిన జనాలు ఇప్పుడు 'అమ్మో! ఐటీ పిల్లాడా!!' అంటున్నారు మరి.

మంత్రం

ధరలు పెరిగిపోయి, ఆదాయం తగ్గిపోయి సంసార నావ నడవాలంటే ఈ మంత్రం పఠించక తప్పదు మరి. అందుకే ఇక నుంచి కుటుంబ ఖర్చుల చిట్టా రాద్దామనుకుంటున్నా. ఇలాంటి గడ్డు రోజుల్లో మనలాంటివాళ్లు మొదట చేయాల్సిన పని అదేకదండీ. ఎందుకంటే చేయబోయే ఖర్చులన్నీ కాగితం మీద రాసి వాటిలో వేటిని తగ్గించుకోవచ్చో...ఎంత వరకు తగ్గించుకోవచ్చో చూసి సున్నా చుడదామనుకుంటున్నా. అప్పుడే మనకు వృధా ఖర్చులేవనేది స్పష్టంగా తెలుస్తాయి. ఎప్పుడైనా బయట భోజనం చేయాలనిపించినా మన పద్దు చూశాక ఆగిపోతాం. అలాగే షాపింగ్‌కెళ్లినప్పుడు కొంచెం మనసును కంట్రోల్లో పెట్టుకోవాలి. కంటికి నచ్చిందని అవసరం వున్నా లేకున్నా ఎప్పుడో పనికొస్తుందని కొనడం మానుకోవాలి. అలాగే అప్పు పెట్టడం కూడా తగ్గించాలి మరి. ప్రాణం మీదకొస్తే తప్ప అప్పు రేపు అనుకోవాలి. ఇలా ఈ సంవత్సరం ఒక ప్రణాళిక ప్రకారం నడవడం మంచిదనిపిస్తోంది. అయినా దుబారా ఖర్చు తగ్గించుకున్న వారెవరూ చెడిపోరుకదండీ.

'నూతన' నిర్ణయం

కొత్త సంవత్సరం అనగానే నూతన నిర్ణయాలు తీసుకుంటూనే వుంటాం. ఈసారి తప్పనిసరిగా వాటిని పాటించాల్సిందే అనుకుంటాం. ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. 2009, జనవరి 1న ఏదైనా కొత్త నిర్ణయం తీసుకునేవుంటారు. సిగరెట్లు మానేయాలి, ఉదయం ఆరుగంటలకే నిద్రలేవాలి, ఈ సారి మంచి మార్కులు సంపాదించాలి, అప్పులు ససేమిరా తీసుకోకూడదు-ఇవ్వకూడదు... వంటివెన్నో నిర్ణయాలు తీసుకుని వుంటాం. అలాంటివారి జాబితాలో నేనూ వున్నాననుకోండి. అయితే ఇలాంటి నిర్ణయాలు ఎన్నయినా తీసుకోవచ్చు. ఎగనామం పెట్టవచ్చు. ఇలా ఎన్నిసార్లయినా జరగొచ్చు. అయితే మనం తీసుకున్న నూతన నిర్ణయాలు మన బాధ్యతను పెంచేలా వుండాలి. ఉదాసీనతను తరిమికొట్టి ఉత్సాహాన్ని నింపేలా వుండాలి. నేనొంటరిని అని నీరసపడకుండా నేను సైతం అని ముందుకు ఉరికేలా వుండాలి. ఈ ఏడాది మనందరినీ భయపెట్టిన స్వైన్‌ఫ్లూ రాక్షసి గురించి మర్చిపోయామా! పరిసరాలు శుభ్రంగా వుంటే పందులు రావు. అవి రాకపోతే ఇలాంటి రోగాలు రావు. మరి పరిసరాలు శుభ్రంగా వుండాలంటే ఇంట్లో వచ్చిన వ్యర్థాలను వీధుల్లో పోయకూడదనుకున్నాం. చిత్తు కాగితాలు, పాల కవర్లు, కూరగాయల తొక్కలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు...రోడ్లమీద ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా మున్సిపాలిటీ చెత్తకుండీలో మాత్రమే వేయాలనుకున్నాం. అలాగే పర్యావరణాన్ని పాడు చేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని డిసైడయ్యాం. బజారుకెళ్లేప్పుడు చేతులు ఊపుకుంటూ కాక ఏ చేతిసంచో పట్టుకెళితే సరి. అలాగే ప్రాణాధారమైన నీటిని పొదుపు చేయాలి. బ్రష్ చేసినంత సేపూ ట్యాపు తిప్పి వుంచడం, వృధా చేయడం వంటివాటికి చెక్ పెట్టాలి. మన పుణ్యమా అని భూగోళం మండే అగ్ని గోళంగా తయారైంది. ఇకనైనా కాలుష్యాన్ని తగ్గిద్దాం. వ్యక్తిగత వాహనాలకు బదులుగా పబ్లిక్ వాహనాల్లో ప్రయాణిద్దాం. ప్రస్తుతం వృద్ధుల పరిస్థితి చింకి బట్ట, పాత పుస్తకం మాదిరిగా తయారైంది. వారిని పట్టించుకునే వారు తగ్గిపోతున్నారు. ఎంత ఉరుకులు పరుగుల జీవితాలైనా....వయసు పైబడినవారితో ప్రశాంతంగా మాట్లాడే తీరిక చేసుకుందాం. వారి చేతికర్ర మనమవుదాం.

అదిసరే! ఈఏడాది ఏదైనా ఆశయం వుండాలి కదా. ఆశయం లేని జీవితం వాసనలేని పువ్వులాంటిదని పెద్దలంటారు. తిన్నామా, పడుకున్నామా అన్నట్టు కాక జీవితానికొక ఆశయాన్ని ఏర్పాటుచేసుకోవాలి. అదే దిక్సూచిలా పనిచేస్తుంది. మనల్ని ముందుకు నడిపిస్తుంది. ఈ సంవత్సరం మనం నిర్దేశించుకున్న ఆశయం నెరవేరేవరకు కృషి చేద్దాం. నెరవేరిందో లేదో ఈ ఏడాది చివరలో చెప్పుకుందాం.

సంతోషం...సంపాదన

పొద్దున లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒకటే పరుగు. చిన్నతనంలో చదువులు, తర్వాత కెరీర్, ఆ తర్వాత సంపాదన. టోటల్‌గా జీవితం మొత్తం పరుగే పరుగు. ఇలా పరుగులు పెట్టడంలోనే స్వర్గం వుందనుకుంటున్నాం. సిసలైన జీవనమాధుర్యాన్ని మిస్సవుతున్నాం. దీనికి తోడు ఒత్తిడి ఒకటి. చదువులో, ఉద్యోగంలో, జీవితంలో ఒత్తిడి పెద్ద పీఠం వేసుకుని కూర్చుంది. దీంతో తలనొప్పి, చికాకు, కోపం, అసంతృప్తి, వేదన. అందుకే జీవితానికి సంపాదన కాక సంతోషం కొలమానంగా వుండాలంటాను. అందుకోసం మన మనసుకు నచ్చే, సంతోషాన్నిచ్చే చిన్న చిన్న పనులు చేయాలి. చిన్నతనం నుంచి మనకెంతో ఇష్టమైన పుస్తకపఠనాన్ని వదలకూడదు. కనీసం వారానికో మంచి పుస్తకం చదవాలన్నది అనుభవజ్ఞుల మాట. మనకు మాత్రం ఏం తక్కువ. పుస్తకాలు లేవా! చదువు రాదా!! అందుకే



డైరీ నా నేస్తం

డైరీ ఎంత చిన్న పదం. అందులో ఎన్ని భావాలు, ఎన్నెన్ని బాసలు! అందంగా దిద్దిన అక్షరాల్లో మన మనసంతా పొందిగ్గా అమరిపోతుంది. రోజంతా అయ్యాక ప్రశాంతంగా కూర్చుని డైరీ రాసుకుంటే ఏదో తెలియని ఫీలింగ్ కలుగుతుంది. అందుకే ఈ ఏడాది ఒక్క రోజు కూడా మిస్సవకుండా డైరీ రాద్దామనుకుంటున్నా. మొన్నోరోజు 2009 డైరీ వెనక్కి తిప్పి చూశా. అక్కడక్కడ ఖాళీలు కనిపించాయ్. అయితే డైరీ రాసిన రోజులను ఒకసారి గుర్తు చేసుకుంటే...నాలోని ఎన్నో భావాలకు అక్షరరూపం వచ్చినట్టనిపించింది. ఆనందం, ఆక్రోశం, ఆశ, బాధ, ఏడుపు, కోపం, ఉక్రోషం, తపన... అన్నీ ఎటువంటి సంకోచాలు లేకుండా స్వేచ్ఛగా రాశాను. అయినా అది నా సొంత డైరీ కాబట్టి ఇలాగే ఎందుకు రాశావు అని బెత్తం పుచ్చుకుని అడిగేవారెవరూ వుండరు! మా పిల్లలకు కూడా చెప్పా, డైరీ రాయమని. అయినా ఓసారి రాయడం మొదలెడితే మనలోని రచయిత, విమర్శకుడు, విశ్లేషకుడు, తాత్వికుడు అందరూ అగుపిస్తారు. మనల్ని మనకే పరిచయం చేస్తారు. తప్పొప్పులను వెతికి చూపిస్తారు. అందుకే దినచర్యను క్రమం తప్పకుండా రోజూ రాసేద్దామని గట్టిగా డిసైడయ్యా! ఒక్కరోజు కూడా విడవకుండా డైరీ రాసిన ప్రముఖులు ఎందరో! వీరిలో రచయితలు, రాజకీయవేత్తలు, దేశాధ్యక్షులు వున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. అంత బిజీగా వుండేవాళ్లు కూడా రోజూ డైరీ రాశారా అనిపిస్తుంది. తమాషా ఏంటంటే...వీళ్లలో కొందరి డైరీలే చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలాయి. అందుకే డైరీ తప్పక రాయాలనుకుంటున్నా.



ఇక నుంచి ఈపనిలో వుంటా. అలాగే మనం ఏదో ఒక సందర్భంలో గిఫ్టులు ఇస్తూనే వుంటాం. గోడకు తగిలించుకునేదో, బీరువాలో పెట్టుకునేదో కాక మంచి పుస్తకాన్నే బహూకరించామనుకోండి! అవతలివారిలోనూ పఠనాభిలాషను పెంచినవారమౌతాం. ఇదేకాక చిన్న నాటి హాబీని కొనసాగించాలనుకుంటున్నా. కుటుంబసభ్యులతో వారానికోసారైనా సరదాగా గడిపితే నయంకదా. అందుకే ఏడాదికోసారైనా ఆఫీసు ధ్యాసేలేని, రాని విధంగా విహారయాత్రలకు వెళ్తే ఎలా వుంటుందన్నది ఆలోచన.

కలసివుంటే కలదు సుఖం

ఈ పేరుతో ఏకంగా సినిమానే వచ్చింది. అందాకా ఎందుకు మన పెద్దలు ఐదుగురు అన్నదమ్ముల కథను తరతరాలుగా పిల్లలకు చెప్తూనే వున్నారుకదా. గుర్తులేదూ. అదేనండీ! ఓ పెద్దాయన ఆఖరుఘడియల్లో తన ఐదుగురు కుమారులను పిలుస్తాడు. ఒక్కొక్కరికి ఒక్కో కట్టె ఇచ్చి విరవమంటాడు. వాళ్ళు ఉత్సాహంగా విరిచేస్తారు. ఐదుగురినీ ఐదేసి కట్టెలు తీసుకొని విరవమంటాడు. చేతులు కమిలిపోతాయికానీ ఆ పని చేయలేకపోతారు. అప్పుడు అర్థమౌతుంది వారికి ఐకమత్యంలో దాగివున్న బలమేంటో! ఇప్పుడు మన రాష్ట్రంలో సీన్ కూడా అంతే. రాష్ట్రాన్ని ముక్కలు

చెక్కలు చేయాలని ఎవరిపాటికి వారు దీక్ష బూని గొడవలు చేస్తున్నారు. ప్రాణాలు తీసుకుంటున్నారు. బస్సులు తగలబెడుతున్నారు. అయినా ఆమధ్య ఏర్పడిన కొత్త రాష్ట్రాల గతేమైంది! అభివృద్ధి సంగతి అటుంచి... ఉద్యోగులకు జీతాలివ్వడానికి కూడా అప్పు చేస్తున్నారు. దీన్నిబట్టి విడిపోవడం సులభమేనని అర్థంకాలా! కాకపోతే ఆ తర్వాత మన నెత్తిమీదెక్కడానికి, మనల్ని గంగిరెద్దుల్లా ఆడించడానికి, మన మూలుగుల్లో రక్తం పీల్చడానికి ప్రపంచబ్యాంకు, డబ్లుటీఓ, ఐఎమ్మెఫ్ వంటి బకాసురులు కాచుకుని కూర్చున్నారని మరవకండి బాబులూ. మనం ఎన్ని చీలికలు పీలికలు అయితే వాటికంత లాభం. వారిపని అంత సులువవుతుందని గుర్తుంచుకోండి నాయనలారా! కలిసిమెలిసే సమస్యలను పరిష్కరించుకుందాం.

ఆరోగ్యానికే ఓటు

రోజులెలావున్నాయ్! అన్నీ సరిగ్గా వుంటేనే.. ఏమాత్రం అటూ ఇటూ అయినా అంతేసంగతులు. ఆసుపత్రి ఖర్చు ఒక్కటి వచ్చిపడిందో! ఇల్లూ, వల్లూ రెండూ గుల్లే. అయినా రోగం తెచ్చుకోనేల. గుల్ల చేసుకోనేల. ముందే జాగ్రత్తపడితే నయంకదా. అందుకే వున్నంతలో పౌష్టికాహారం తీసుకోవడం, ఆరోగ్యం పట్ల చైతన్యం పెంచుకోవడం, పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవడం అత్యవసరం. పిల్లలకు చిన్నతనం నుంచి మంచి అలవాట్లు నేర్పితే ఆరోగ్యం వారి వెంటే వుంటుంది. అందుకే బయటికెళ్లి వచ్చాక కాళ్లు కడుక్కోవడం, ఏదైనా తినబోయేముందు చేతులు శుభ్రం చేసుకోవడం, తర్వాత నోరు పుక్కిలించి ఊయడం, రెండు పూటలా స్నానం చేయడం వంటివి నేర్పించాలి. ఈ అలవాట్లు వారి జీవితాంతం వెన్నంటి వుంటాయి. ఆరోగ్యాన్ని కాపాడతాయి. పెరిగిన ఖర్చుల్లో ఈ ఏడాది హాస్పిటల్ పద్దు లేకపోవడానికి ఇదీ ఒక కారణం... అందుకే నా ఓటు ఆరోగ్యానికే. మరి మీ ఓటో!

కొత్త సంవత్సరం వేడుకలు

2008 డిసెంబర్ 31న ఏదో ఒక చిన్న పార్టీ చేసుకున్నాం. ఇరుగుపొరుగు, స్నేహితుల కుటుంబీకులంతా కలిసి బానే ఎంజాయ్ చేశాం. కేకు – కోడి ముక్కలతో ఆ సంవత్సరానికి బై చెప్పాం. 2009ని స్వాగతించాం. ఈసారి అంత సీన్ వున్నట్టు కన్పించట్లా. ఎవరికి వాళ్ల ఆ ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడుతున్నారుమరి. పిల్లలు కూడా గ్రీటింగులకోసం పెద్దగా గొడవ చెయ్యట్లా. 'ఎందుకు డబ్బులు వేస్టు. ఫ్రీ ఎస్సెమ్మెస్సులు, మెయిళ్లు వున్నాయిగా' అంటున్నారు. శత కోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు మరి. మన సంగతెలా వున్నా... వచ్చేది కొత్త సంవత్సరం కాబట్టి మనస్సునిండా సంతోషం నింపుకుని ఆహ్వానించేద్దాం. ఈ ఏడాదైనా ధరలు తగ్గుతాయని... తగ్గాలని... అందుకోసం మనం ఎన్నుకున్న నాయకులు కృషి చేయాలని... అందరికీ మంచి జరగాలని కోరుకుందాం. ఒకవేళ మన ఈ చిన్ని ఆశ నెరవేరకపోతే ఆయుధం మన చేతిలోనే వుందిగా. ఆ ధైర్యంతోనే కొత్త సంవత్సరంలోకి దర్జాగా అడుగేద్దాం.

★

కాలం - క్యాలెండర్

ఇన్ని విషయాలు చెప్పుకున్నాక అసలు విషయం మర్చిపోతే ఎలా! అదేనండీ... క్యాలెండర్ గురించి. క్యాలెండర్ మనిషి బుద్ధితో పుట్టింది. బుద్ధితో పెరిగింది. బుద్ధి చేసే ప్రయోగాలన్నిటికీ ముడిసరకైంది. చివరికి ఆ బుద్ధిజీవినే నడిపిస్తోంది. తేదీ, తిథి, వారం, నక్షత్రం...ఏది కావాలన్నా మన చూపు అప్రయత్నంగా క్యాలెండర్‌వైపు మళ్లుతుంది. అసలు రోజుకొక్కసారైనా క్యాలెండర్ చూడనివారుండరంటే అతిశయోక్తికాదు. నా మట్టుకు నేను ఎవరైనా ఇస్తానంటే వద్దనకుండా తీసుకునేది క్యాలెండర్‌నే. ప్రకృతి దృశ్యాలు బావున్నాయని, సెలవుల వివరాలున్నాయని ...ఏదో ఒక వంకతో క్యాలెండర్ తీసేసుకుంటా. ఎవరిదైనా పెళ్లి కుదిరిందని తెలిసిన వెంటనే క్యాలెండర్‌లో పెళ్లిరోజు గుర్తు పెట్టేయడం, తేదీకనుగుణంగా ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడం అనాదిగా వస్తోందే. సంక్రాంతి అంటే జనవరి, ఉగాది అంటే మార్చి, దసరా అంటే అక్టోబరు, దీపావళి అంటే నవంబరు (కొద్దిగా అటూఇటుగానే అనుకోండి). ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం, దశమినాడు దసరా పండగ జరుపుకుంటామంటే ఎవరికీ అర్థంకాదు. అంతగా అలవాటైపోయాం క్యాలెండరనే ఆధునిక పంచాంగానికి. ఇంకా నాలుగురోజులు టైముందంటున్నా వినకుండా పిల్లలు పాత క్యాలెండర్‌ను మార్చేశారు. కొత్త క్యాలెండర్‌ను గోడకు తగిలించేసి మురిసిపోయారు. అదీ క్యాలెండరు మహిమ.



నవ్వుల్ - పువ్వుల్

రమ్ము.... రమ్ము!

ఒక పౌరాణిక గెటప్‌లో రాజబాబువంటి హాస్యనటుడు మేకప్ రూమ్‌లో కూర్చున్నాడు. తలుపు తట్టాడు ప్రొడక్షన్ మనిషి.

గెటప్ చూసుకుంటున్న నటుడు చప్పుడు విని 'రమ్ము సోదరా రమ్ము' అన్నాడు పౌరాణిక ఫక్కీలో.

లోపలికి రాబోతున్న ప్రొడక్షన్ మనిషి వెనక్కి వెళ్లిపోయాడు.

సెట్‌లో షూటింగ్ సమయంలో తిరిగి హాజరైన ప్రొడక్షన్ మనిషి 'ఇదిగో సార్ రమ్ము' అంటూ ట్రిపుల్‌ఎక్స్ రమ్ బాటిల్ తీసి ఇచ్చాడు అతనికి

అర్థం కాక ఆ నటుడు అయోమయంగా చూస్తుంటే ఈ ప్రొడక్షన్ మనిషి 'మీరే కద సార్ రమ్ము తీసుకురమ్మన్నారు' అంటూ అనే సరికి అక్కడున్న వారంతా నవ్వేశారు.

అప్పుడు కుమారే!

జడ్జి : ఇదేమిటండీ! కుమారి పంకజం అనిపిలిస్తే బోనులోకి ముసలమ్మ వచ్చి నిలబడిందేమిటి?

ప్లీడర్ : ముప్పై సంవత్సరాల క్రితం ఈ కేసు మొదలైనప్పుడు ఆమె కుమారి పంకజమే సార్!

పిసినిగొట్టు

ఒక పిసినిగొట్టు కుటుంబ సభ్యుల్ని ఒక చోట సమావేశ పరిచి 'రాత్రి భోజనం అవసరంలేదన్న వారికి పదేసి రూపాయలు ఇస్తాను' అన్నాడు.



ఇంట్లో వాళ్లంతా పదేసి రూపాయలు తీసుకుని రాత్రంతా పస్తు పడుకున్నారు. మర్నాడు ఉదయం టిఫిన్ వేళకి 'పదేసి రూపాయలు ఇచ్చిన వారికే ఈ పూట టిఫిన్' అన్నాడు.

చాలా స్ట్రిక్టు

'కొత్తగా వచ్చిన ఆఫీసర్... చాలా కరెక్టయిన మనిషి. ఎవరి దగ్గరయినా లంచం తీసుకున్నట్టు తెలిసిందంటే...'

'ఏం? సస్పెండ్ చేస్తాడా...?'

'చేయడు... సగం వాటా ఇమ్మంటాడు!'

మీరు కూడా...?

'ఏమిటి కాంతయ్యా... నువ్వు సినిమాకు వెళ్లొచ్చినప్పుడల్లా మీఆవిడ అలా కేకలేస్తుంది. ఏమంటుందేమిటి?'

'నేను సినిమాకి వెళ్తున్నది చాలదా? మీరు కూడా వెళ్లి ఎందుకలా డబ్బు తగలేస్తారు' అని కేకలేస్తుంది.

కోతలు

ఆఫ్రికాలో ఎక్కడో కొంతకాలం వుండి వచ్చిన ఒకాయన అక్కడి శిక్షాస్మృతిని గురించి చెప్తూ 'అక్కడ కోళ్ల దొంగతనాలు చేస్తే ఇంక అంతే. మొదటిసారి దొంగతనం చేస్తే ఒక చెయ్యి కొట్టేస్తారు. రెండోసారి అయితే రెండో చెయ్యి నరికేస్తారు. మూడోసారి అయితే తల నరికేస్తారు' అన్నాడు.

'ఆ! బడాయి! మూడోసారి చెయ్యగలిగేవాడెవడూ?' అని అడిగాడో శ్రోత.

అందుకేగా....!

'ఎస్సైగారూ... ఎస్సైగారూ పక్కవీధిలో ఎవడో ఫుల్లుగా తాగి కత్తి పట్టుకుని రోడ్‌మీద నానా అల్లరి చేస్తున్నాడండి'

'నాకు తెలుసులేవయ్యా! అందుకేగా ఈ రోడ్‌గుండా ఇంటికి వెళుతున్నాను.'

పాస్

'నా సబ్జెక్టులో వీళ్లందరిలో నువ్వొక్కడివే ఎలా పాసయ్యావురా?' ఆశ్చర్యంగా అడిగాడు మాస్టారు రాజేష్‌ని.

'మరి నేనొక్కడినే కదా, మీక్లాస్‌కు ఎప్పుడూ రానివాడిని...' చెప్పాడు రాజేష్.

అడవిలో మృగం

స్టెనో సుశీ ఆవేళ ఆలస్యంగా వచ్చింది ఆఫీసుకి. ఆఫీసర్ అహంభావరావు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు.

'మిస్ ఏమిటిది? ఎందుకింత ఆలస్యం అయింది. అడవి నుండి వచ్చిన మృగంలా...'

'లేదు బాస్... ఇప్పుడే అడవిలోకి ప్రవేశించాను' అంది సుశీ.

- డి. అరుణశ్రీ



ఐదు తేడాలు

హాయ్ నేస్తాలూ! పై బొమ్మలు చూశారుగా... రెండూ ఒకేలా వున్నా వీటిలో ఐదు తేడాలు వున్నాయి. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టేయండి.

చుక్కలు కలిపేద్దాం



ఎన్నున్నాయ్...

ఫ్రెండ్స్... కింద ఓ పెద్ద పిల్లి తల కనిపిస్తుందిగా. కానీ అందులోనే ఇంకా చాలా పిల్లులున్నాయి. అవి మొత్తం ఎన
లెక్కపెట్టి చెప్పండి.



సంతకం



ఏదో చెప్పగలరా?

హాయ్... పైన కుందేలు సైకిల్‌మీద భలేగా జంప్ చేస్తుంది కదూ. ఆ కుందేలు నీడ కిందున్న ఎనిమిది నీడల్లో వుంది. ఎనిమిది నీడలూ ఒకేలా వుండి తికమక పెడుతున్నాయి కదూ. మరి అసలు నీడ ఏదో కనిపెట్టండి.



కనిపించాయా?

నేస్తాలూ... కింద ఏసుక్రీస్తు కనిపిస్తున్నాడు కదూ. ఒక్క నిమిషం కాస్త పరిశీలించి చూడండి. మీకు అక్కడ ఇంకా కొన్ని ఆకారాలు కనిపిస్తున్నాయి కదా. అవేంటో చెప్పగలరా.



దారి చెప్దామా

ఎక్కడున్నాయో!

నేస్తాలూ...కిందున్న చక్కటి బొమ్మలో కొన్ని వస్తువులు వున్నాయి. అవేంటంటే.... దువ్వెన, పుస్తకం, పిల్లి, టీ కప్పు, క్యారెట్, చేప..... అవి ఎక్కడున్నాయో వెతికి కనిపెట్టేద్దామా. మీరు వీటిలో ఎన్ని కనిపెడితే అన్ని మార్కులు వచ్చినట్టు.



అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, అరటి తొక్క, హారతి పళ్లెం, తలుపు గొళ్లెం కాదేదీ కవితకనర్హం అని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో చెప్పారు కదా. అలాంటివి యుద్ధానికెందుకు అనర్హం అవుతాయి. అరటి పళ్లు అమ్ముకొనే వాళ్లంటే సామాన్యులు కాదండోయ్, లాటిన్ అమెరికా దేశాల్లో ప్రభుత్వాల తలరాతలనే మార్చిన ఘనులు. వారి లాభాలకు వచ్చిన ముప్పు అరటి పళ్ల యుద్ధానికి దారితీసింది. లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చే పండ్లపై ఐరోపా దేశాలు ఆంక్షలు విధించటం అక్రమం అని అమెరికా కంపెనీలు వివాదపడుతున్నాయి. అది చివరకు రెండు దశాబ్దాల క్రితం ముదిరింది. అరటి పళ్ల కంపెనీల తరఫున ముందుకు వచ్చిన అమెరికా సర్కార్ ఐరోపా దిగుమతులపై పన్ను విధించింది. ఈ వివాదం చివరకు ప్రపంచ వాణిజ్య సంస్థకు చేరింది. అనేక సార్లు ఐరోపా యూనియన్ వైఖరి వాణిజ్య సూత్రాలకు విరుద్ధమని తీర్పులు చెప్పినా అమలు జరగలేదు.

అరటి పండు... ఏనుగు ఏం మాట్లాడుకున్నాయ్?

- సత్య

'అంగట్లో ఉంటాను, అంగీ విప్పుతాను,
ఎవరైనా పట్టుకొంటే నోట్లోకి దూకుతాను,
నేనెవరిని ?'

...ఇంకెవరు అరటి పండువు కదూ

అన్నట్లు మీకో జోక్ కూడా చెప్పాలి మరి. మా మరదలు నన్నెపుడూ ఆట పట్టిస్తుంది. అదేమిటంటే 'మా బావగారికి ప్లేట్‌లో అరటి పండ్లు పెడితే పండు పడేసి తొక్క తిన్నారు' అని. దానికి మీ అక్క మాత్రం తక్కువేంటి అరటి కూర వండమంటే పండు అరటి తెచ్చి వేపుడు చేసేందుకు నానా తిప్పలు పడటం నాకు తెలియదా అని నేనూ ఎదురుదాడి చేస్తాననుకోండి.

ఇవన్నీ మేం చెప్పుకున్నపుడు ఒకరోజు మా సిసింద్రీ నాన్నా ఏనుగు- అరటి పండు ఒక ద్గగ్గరకు చేరాయనుకోండి. ఏం మాట్లాడుకుంటాయో చెప్పండి అని అడిగాడు. మీరు కూడా ఆలోచించండి మరి.

ఇప్పుడు ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని అరటి పండ్లు నిరోధిస్తాయని ఒక విశ్లేషణ. అంటే ఉద్దీపనల పేరుతో వేలకోట్ల రూపాయలను దోచుకుపోతున్న పెద్దమనుషుల కాళ్లకింద అరటితొక్కలు వేసి అడ్డుకోవటమా అని మా బావమరిదికి అనుమానం వచ్చింది. అమాయకుడు గాకపోతే అలాంటి పెద్దలు రోడ్లమీద నడుస్తారటండీ !!

దాని గురించి చెప్పుకోబోయే ముందు అరవై ఏళ్ల అరటి పండ్ల యుద్ధంలో శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలుసుకోవాలి మరి. అదేమిటి అరటి పళ్లు యుద్ధం ఎలా చేస్తాయనుకుంటున్నారా? అరటి పండు వలిచి నోట్లో పెట్టినట్లు వివరంగా చెప్పాలంటే ఇక్కడ కుదరదుగాని క్లుప్తంగా చెప్పుకుందాం.

అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, అరటి తొక్క, హారతి పళ్లెం, తలుపు గొళ్లెం కాదేదీ కవితకనర్హం అని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో చెప్పారు కదా. అలాంటివి యుద్ధానికెందుకు అనర్హం అవుతాయి. అరటి పళ్లు అమ్ముకొనే వాళ్లంటే సామాన్యులు కాదండోయ్, లాటిన్ అమెరికా దేశాల్లో ప్రభుత్వాల తలరాతలనే మార్చిన ఘనులు. వారి లాభాలకు వచ్చిన ముప్పు అరటి పళ్ల యుద్ధానికి దారితీసింది. లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చే పండ్లపై ఐరోపా దేశాలు ఆంక్షలు విధించటం అక్రమం అని అమెరికా కంపెనీలు వివాదపడుతున్నాయి. అది చివరకు రెండు దశాబ్దాల క్రితం ముదిరింది. అరటి పళ్ల కంపెనీల తరఫున ముందుకు వచ్చిన అమెరికా సర్కార్ ఐరోపా దిగుమతులపై పన్ను విధించింది. ఈ వివాదం చివరకు ప్రపంచ వాణిజ్య సంస్థకు చేరింది. అనేక సార్లు ఐరోపా యూనియన్ వైఖరి వాణిజ్య సూత్రాలకు విరుద్ధమని తీర్పులు చెప్పినా అమలు జరగలేదు.

చివరకు ఈనెల రెండవ వారంలో ఒక ఒప్పందం కుదిరింది. దానిమేరకు 2016 నాటికి టన్ను లాటిన్ అమెరికా అరటి పళ్లపై ఇప్పుడున్న 176 డాలర్ల నుంచి ముందు 148కి, చివరికి 114 డాలర్లకు ఐరోపా యూనియన్ తగ్గిస్తుంది. చిదంబరం ప్రకటన చేయగానే తెలంగాణా ఇచ్చినందుకు టిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటీబడి హర్షం వెలిబుచ్చగా మరోచోట ఆందోళన చెలరేగినట్లుగానే పన్నులు తగ్గిస్తే తమకు గిట్టుబాటు కాదని ఐరోపా పూర్వపు వలసదేశాల వారు గుర్రుగా చూస్తున్నారు. అందువలన శాంతి ఒప్పందం మరో అశాంతికి దారితీస్తుందా అన్నది ప్రశ్న. ప్రపంచంలో గోధుమ, బియ్యం, మొక్కజొన్నల తరువాత ఎక్కువగా తినేది పండ్లనే. ఈ వివాదం ఇంతకాలం కొనసాగటానికి కారకురాలు అమెరికాయే అని ఐరోపా యూనియన్ భావిస్తున్నది. ఎందుకంటే అరటిపళ్ల వివాదం పరిష్కారమైతే పత్తి వివాదాన్ని అమెరికా పరిష్కరించాల్సి ఉంటుంది. తమ సబ్సిడీలను తగ్గించరాదని అక్కడి పత్తి లాబీ వత్తిడి తెస్తున్నది.

ఇంతకూ అరటి పండ్లు ఆర్థిక సంక్షోభాన్ని ఎలా నిరోధిస్తాయంటే పండ్ల రేటు, ఖర్చుకూడా తక్కువే అని చెబుతున్నారు. ఏడ్చినట్లే ఉంది. అసలు తిండి తినకుండా, బట్టలు వేసుకోకుండా, ఇతర అవసరాలకోసం పాకులాడకపోతే అసలు సంక్షోభమే రాదు కదా? ఎంత చెట్టుకు అంతగాలి. బరువు ఎక్కువై గడ్డిపోచ అదనమైనా పడవ మునుగుతుంది. ఇంతకూ మావాడు అడిగిన ప్రశ్నకు 'తెలంగాణాపై తీర్మానం పెడితే మద్దతు ఇస్తామని ఎందుకు వాగ్దానం చేశారు, తరువాత ఎందుకు వెనక్కు తగ్గారన్న ప్రశ్నకు ఆ నిర్ణయాన్ని అర్ధరాత్రి ప్రకటించారు గనుక' అని చెప్పినట్లుగా సమాధానం నాకైతే తట్ట లేదు. రాష్ట్రంలో రగిల్చిన వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారో చెప్పండయ్యా బాబూ అని కాంగ్రెస్ వారిని అడిగినట్లుగా 'ఏనుగు-అరటి పండు ఏం మాట్లాడుకున్నాయో చెప్పరా బాబూ' అని అడిగాను. 'ఏం మాట్లాడుకోలేదు నాన్నా ఎందుకంటే వాటికి మాటలు రావుగా' అన్నాడు !!

★

కొత్త పుస్తకాలు

మనిషిగా ప్రవహించాలని
(కవితా సంపుటి)
కవి : డా॥ సి.నారాయణరెడ్డి
పేజీలు : 113, వెల : 100/-,
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
నవోదయ బుక్‌హౌస్



మనిషి చుట్టూ పెనవేసుకున్న కవితలు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి తన 79వ జన్మదినోత్సవ కానుకగా తెలుగు సాహితీప్రియులకు అందించిన కవితా సంపుటి ఇది. జులై 2008 నుండి జూన్ 2009 దాకా రాసిన దాదాపు 55 కవితలతో ప్రచురించిన కవితా సంపుటీకరణ ఇది. సామాన్య మానవుని వర్తమాన జీవన వ్యాఖ్యానాన్ని ఎంతో ఆర్ద్రతతో మానవీయ కోణాన్ని డా॥సినారె ప్రతి కవితలో ఆవిష్కరించిన తీరు బహు ప్రశంసనీయం. మానవీయ సంవేదన వల్ల ఆరంభ కవిత నుండి ఆఖరి కవిత దాకా ఆలోచింపచేస్తాయి. దాదాపు ఒక వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర గల తెలుగు కవిత్వంలో ఎన్నో మార్పులు, నూతన ఆవిష్కరణలు వచ్చాయి. మానవతావిలువల్ని నొక్కి చెప్పిన సినారె కవితల్లోని కొన్నింటిని చూద్దాం.

"పరిష్కారం" (పేజీ9) కవితలో ఇలా అంటారు. అభిప్రాయ భేదాలకు అసలైన పరిష్కారం/ అరాచకం కాదు/పరస్పర భిన్న ప్రవృత్తుల/ చర్చల్లో రేకులు విప్పే/ సమన్వయ తత్వం. ఈ కవితా సంపుటికి టైటిల్‌గా పెట్టిన "మనిషిగా ప్రవహించాలని" అనే కవితలో (పేజీ21) కవి ఇలా అన్నారు... శ్వాస తనలో ప్రవహించినప్పుడే/వేణువు నాదస్వరూపిణిగా జీవిస్తుంది. అది ఆగితే దానికి అస్తిత్వమే లేదు/తొలి పొద్దులో తూర్పు దిక్కున ఉదయించే సూర్యకిరణాలు తాము పుట్టిన చోటునే ఉండాలనుకోవు/ విశ్వమంతటా ప్రవహించనిదే అవి ఊరుకోవు. సమస్యలున్నప్పుడు అనే కవితలో (పేజీ45) కవి చివరలోఇలా అంటారు: నిజానికి ఏ మనిషైనా ఆవిర్భవించింది సన్యసించడానికి కాదు, ముసురుకొచ్చే సమస్యల ఇసుక తుఫానులను పదును చూపులతో ఊదేసుకుంటూ లక్ష్యశిఖరాన్ని అందుకోవడానికి. "మౌనాయుధం" కవితలో (పేజీ86) చక్కటి భావాన్ని కవి ఆలోచనాత్మకంగా విశ్లేషించారు. అరుపులతో అట్టహాసాలతో అందుకోలేని చరమ గమ్యాన్ని, సుదీర్ఘ మౌనముద్ర వశీకరించుకుంటుంది. నిరంతర చర్చలతో అంతు తేలని సమస్యల ముళ్లని ఒక్క పూట వహించే మౌనం అట్టే విప్పేయగలుగుతుంది. ఆ మౌనమే అభ్యుదయ శక్తులకు మాధ్యమం. అదే ఉన్నత లక్ష్య సాధనకు ఆయుధం అంటారు. "పరిశీలించి చూస్తే" అనే కవితలో (పేజీ106) కవి భావాలు ఆలోచింపజేయుటే కాక అలజడి చేస్తాయి మదిలో. "పిడికెడు ఆకాశాన్ని తీసుకొచ్చి పెరట్లో నాటి చూడు, చీకటి పడే సరికి గంపెడు నక్షత్రాలు మొలుచుకొస్తాయి. కాలం చెప్పిన తీర్పు సార్థకమనిపించుకుంటుంది (పేజీ109). ఇలా అన్నీ కవితలు... మానవుని చుట్టూ పెనవేసుకుని మనిషి మానవతా వాదాన్ని చక్కటి కవిత్వంతో అక్షరీకరించారు డా॥సినారె.

- తంగిరాల చక్రవర్తి

బోయీల బతుకు చిత్రం

అసంఘటిత కార్మికులు
గుడిపూడి విజయరావు
పేజీలు : 202, వెల : 60/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్,
1-1-187/1/2. చిక్కడపల్లి,
హైదరాబాద్.



షాజహాన్ తాజ్‌మహల్ కట్టించాడు సరే, దాని నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీల గురించి,

ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీల గురించి మహాకవి అడిగాడు. ఇదుగో వీరే ఆ కూలీలు, బోయీలు. కూలీల గురించి, బోయీల గురించిన పుస్తకమే సిఐటియు ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ప్రచురించిన 'బ్రతుకు భారంగా ... భద్రతకు దూరంగా ... అసంఘటిత కార్మికులు'.

కొందరికి జీవితం వడ్డించిన విస్తరి కావచ్చు. ఎందరికో జీవితం నిత్యసమరం. సమరంలో సమిధలవుతూ బతుకు భారంగా భద్రతకు దూరంగా కోట్ల మంది అసంఘటిత కార్మికులు మన సమాజంలో వున్నారు. మనరాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్న ఆ కార్మికుల పరిస్థితికి సంబంధించిన విలువైన సమాచారాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల నుండి ఈ పుస్తకం అందిస్తుంది.

200 పేజీల ఈ పుస్తకంలో 30 విలువైన పరిశోధనా పత్రాలున్నాయి. అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై నిత్యం ఉద్యమాలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు పరిశోధకులుగా మారి ఈ పత్రాలను రూపొందించడం విశేషం. ఎంతో విలువైన, అరుదైన సమాచారం ఇక్కడ మనకు దొరుకుతుంది. తెలుగు నేల నాలుగు చెరగులా ఉన్న విభిన్న వృత్తుల కార్మికుల జీవన గాథలు మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

శ్రీకాకుళం జీడిపప్పు, విజయనగరం జూట్, విశాఖ కాఫీ, గోదావరి కోనసీమ కొబ్బరి, గుంటూరు దుగ్గిరాల పసుపు, ప్రకాశం ఉప్పు, గెలాక్సీ గ్రానైట్, కర్నూలు బేతంచర్ల పాలిష్ రాయి, హైదరాబాద్ ప్రయివేటు పరిశ్రమలు, కరీంనగర్ సిరిసిల్ల చేనేత, నిజామాబాద్ బీడీ దేనికదే ప్రత్యేకత కలిగిన రంగాల కార్మికుల జీవన చిత్రాలు మన కళ్ళు తెరిపిస్తాయి.

గ్రామసేవకులు, ఆశ వర్కర్లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, త్రిపులైటి కాంట్రాక్ట్ ఉద్యోగులు, లారీ కార్మికులు, ప్రయివేటు కారు డ్రైవర్లు, క్వారీ కంకర కార్మికులు, ముఠా కార్మికులు, తోపుడు బళ్ళ కార్మికులు, రైస్ మిల్లు కార్మికుల వాస్తవ బతుకు పోరాటాన్ని మనకు తెలియజేస్తుంది.

అసంఘటిత కార్మికుల రెండం సర్వే, వలస కార్మికుల పరిస్థితి, ఒక గ్రామంలో అసంఘటిత కార్మికులు, పట్టణ ప్రాంతంలో అసంఘటిత కార్మికుల పరిస్థితుల పత్యేక పరిశోధనలు ఇందులో ఉన్నాయి.

నిజం నిష్టూరంగానే ఉంటుంది. ఒక్కోసారి నిజం కష్టంగానూ వుంటుంది. జీవితంలోని కష్టాలు కన్నీళ్ళు ఆశనిరాశలు అన్నీ ఇందులో ఉన్నాయి. కార్మికులను ఐక్యం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. ముందుండి నడపాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది. అసంఘటిత కార్మికుల జీతాల లాగే పుస్తకం ధర కూడా తక్కువే.

కారుసాల శ్రీనివాసరావు



ఈజిప్టు చుట్టేద్దాం

ఈజిప్టు అనగానే ఆకాశాన్ని ముద్దాడే త్రిభుజాకారపు పిరమిడ్లు, పెట్టెల్లో భద్రపరిచిన మమ్మీలు మన మదిలో మెదులుతాయి. నైలు నదీ ప్రవాహ శబ్దాలు లయబద్ధంగా వినిపిస్తాయి. మరి అక్కడి విశేషాలేంటో ఈవారం తెల్సుకుందామా!

నైలునది ఈజిప్టుకు జీవనరేఖ వంటిది. సారవంతమైన నైలులోయ దానికి ఆయువుపట్టు. ప్రపంచంలోకెల్లా అతి పొడవైన నది నైలునది. తెలుపు నైలునది ఉగాండాలో, నీలి నైలునది ఇథియోపియాలో పుట్టాయి. ఈ రెండూ సూడాన్‌లోని కార్టోయంలో కలుస్తాయి.

అక్కడి నుంచి మధ్యదరా సముద్రంలోకి ప్రవహిస్తాయి.

నైలునది పది దేశాలలో ప్రవహిస్తున్నప్పటికీ అన్నిటిలోకి ఎక్కువగా లాభం పొందుతోంది ఈజిప్టు మాత్రమే. దాని తర్వాతి స్థానం సూడాన్‌ది.

నైలు లోయలో వర్షం తక్కువే. కానీ 1922లో బ్రిటీషు వాళ్లు, 1971లో ఈజిప్టియన్లు నైలునది మీద ప్రాజెక్టు కట్టిన దగ్గరి నుండి ఈ నది చుట్టుపక్కల ప్రాంతాలు ప్రతి వర్షాకాలంలోనూ ముంపుకు గురవసాగాయి. ఆ ప్రవాహం తగ్గగానే ఆ ప్రాంతాలలో అంతా ఒండ్రు పేరుకుపోయి ఉంటుంది. అక్కడ ఈజిప్టు రైతులు పంటలను పండించుకుంటారు.

పిరమిడ్లను నిర్మించిన 1000 సంవత్సరాల తర్వాత పడవ చక్రాలను కనుగొన్నారు. ఆ తర్వాతే పడవ ప్రయాణం తేలికగా ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈజిప్టియన్లలో ఎక్కువ మంది నైలు నదీ తీరప్రాంతాలలోనే ఉంటున్నారు.

ఈజిప్టు ప్రాచీన సంస్కృతి

ఈజిప్టు రాజధానియైన కైరో నుండి అశ్వన్‌కు ప్రయాణం చేసేప్పుడు ఎన్నో ముఖ్యమైన ప్రాచీన ఈజిప్టు ప్రదేశాలను మనం చూడొచ్చు. కానీ 1997లో టెర్రరిస్టులు పర్యాటకులను నరమేధం చేసినప్పటినుంచి అధికారులు భయపడుతున్నారు. లక్సర్ నుంచి అశ్వన్ వరకూ నైలునది మీద ఎక్కువ దూరం ప్రయాణం చేయడనివ్వడం లేదు. లక్సర్‌కు ఉత్తరాన 62 కిలోమీటర్ల దూరంలోనున్న కీనాకు అప్పుడప్పుడూ బోటు షికారు ఉంటుంది. ఆ సమయంలో డెండరా, అబిడోసుల రెండు పెద్దపెద్ద ఆలయాలను సందర్శించొచ్చు. కానీ కీనాకు వెళ్లడానికి అనుమతి అరుదుగా దొరుకుతుంది.

కీనాను సందర్శించకపోయినా లక్సర్ నుంచి అశ్వన్‌కు బోటు షికారు ప్రయాణం చేయడమే ఒక అద్భుతమైన అనుభవం. నైలు నది గుండా ప్రయాణించడమే కాదు. ప్రాచీన గ్రీసు- రోమన్ల స్మారకచిహ్నాలు, గొప్ప గొప్ప ఆలయాలు ఉన్నచోటల్లా ఆగి చూడొచ్చు. వీటిలో అధికశాతం టాలమీస్ అనే గ్రీకులు నిర్మించారు. టాలమీస్ ఈజిప్టును 300 సంవత్సరాలు పాలించారు. తరువాత ఆ దేశాన్ని రోమన్లు పాలించారు. గ్రీకులు, రోమన్లు కూడా ఈజిప్టియన్ల పద్ధతులను అణిచివేయడం కంటే వాటిని పాటించడమే మేలని అనుకున్నారు. అందుకే అక్కడ వారు గొప్ప చక్రవర్తులుగా పేరు పొందారు. వారు ఈజిప్టియన్ల సాంప్రదాయాలను, మతాచారాలను పాటించి ఈజిప్టు దేవతలకు, దేవుళ్లకు ఆలయాలను నిర్మించారు. ఈ కట్టడాలన్నిటినీ లక్సర్, అశ్వన్ మధ్యలో చూడొచ్చు. లక్సర్‌లో దిగగానే అక్కడి నుంచి గైడ్లు అన్నీ చూపిస్తారు.

షికారు బోట్లు, దహబియాస్ అనే పెద్ద బోట్లు, ఫెలుక్కాస్ అనే వెడల్పాటి బోట్లు, ఇంకా మోటార్ బోట్లు నైలునదిలో కనిపిస్తుంటాయి. అక్కడక్కడి ప్రదేశాలను చూడడానికి పర్యాటకులు ఫెలుక్కాస్, మోటారు బోట్లలో వెళ్తారు. 320కి పైగా షికారు బోట్లు నైలునది పొడవునా కనిపిస్తాయి. దాదాపు అన్నీ ఒకే సైజులో ఉంటాయి. ఈ బోట్లన్నీ లక్సర్ రేవుదగ్గర పర్యాటకుల కోసం వేచి ఉంటాయి. సూర్యుడు ప్రకాశించడం జీవనానికి గుర్తుగా ఈజిప్టియన్లు ఎక్కువగా నైలునదికి తూర్పుదిక్కున ఉండేవారు. అందుకే తూర్పుకే ఎక్కువగా ఆలయాలు, వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. చచ్చిపోయిన వాళ్లను పడమరదిక్కున కాల్చేవారు. అందుకే అటువైపు సమాధులు, శ్మశానం, మార్చురీలు ఉంటాయి.

మమ్మీల సంప్రదాయం

ఈజిప్టియన్లు ప్రతి కట్టడాన్ని పెద్దపెద్ద వైశాల్యంలో కట్టేవారు. అనుమ్ ఆలయం దాదాపు 2,60,000 చదరపు మీటర్ల వెడల్పులో ఉంది. ఈ కట్టడం నిర్మాణంలో 3,80,000 మంది శ్రమించారు. తేబాన్ చక్రవర్తుల కాలంలో ఈ ఆలయనిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 1565 బిసిల కాలం నాటికి ఇవి ప్రాచుర్యం పొందాయి.

మరణించిన తరువాత కూడా జీవితం ఉందని ఈజిప్టియన్లు నమ్మేవారు. అయితే మనిషి ఆత్మకు తన శరీరం ఎక్కడుందో తెలిసినప్పుడే మరణం తరువాత జీవితాన్ని ఎంజాయ్ చేయగలరట. సమాధిమీద చెక్కి ఉన్న పేరును బట్టి గానీ, విగ్రహాన్ని బట్టి గానీ ఆత్మ తన శరీరాన్ని గుర్తు పడుతుందని వారి నమ్మకం. అందుకే ఈజిప్టియన్లు తమకు ఇష్టమైన వారు చనిపోతే మమ్మీలను చేసి పాతిపెట్టి వాటి మీద పెద్ద సమాధులను కట్టుదిట్టంగా (క్రూర జంతువుల, దొంగల నుంచి రక్షణగా) నిర్మించేవారు. ట్రావెల్ ఏజెన్సీ వాళ్లు అయితే ప్రతి

ప్రదేశాన్ని నెమ్మదిగా చూపిస్తారు. కానీ లోకల్ ఏజెన్సీ వాళ్లు తమ సౌలభ్యాన్ని బట్టి త్వరత్వరగా ముగించేస్తారు.

రాజుల లోయ-రాణుల లోయ

పిరమిడ్లు నిర్మించడం ఖరీదైనదని గ్రహించిన దగ్గరి నుంచి చక్రవర్తులను కైరోకు దూరంగా రహస్య ప్రదేశాలలో కాల్చేవారు. వీటిని రాజుల లోయలు, రాణుల లోయలు అనేవారు. రాణుల లోయ అంతగా బాగుండదు. అంతా రాళ్లతో నిండి ఉంటుంది. సమాధులు కూడా ఎక్కువగా రంధ్రాలలాగా ఉంటాయి. అక్కడ దాదాపు 75 సమాధులు ఉన్నాయి. మూడు సమాధులు మాత్రం తెరిచి ఉంటాయి. అందులో ఒకటి మూడవ రామసెస్ కుమారుడు అమున్‌హరఖెఫ్‌సెది. ఆయన 10 సంవత్సరాల వయసులోనే మరణించాడు. ఆ సమాధి లోపలి గోడలు అలంకరించి ఉంటాయి. ఇది కొన్ని వేల సంవత్సరాల నాటిదని ఆ సమాధిని చూస్తుంటే తెలుస్తుంది. రాణులలోయ నుండే రాజులలోయకు వెళ్లాలి. పిరమిడ్ ఆకారంలో ఉన్న ఆల్‌కుర్న్ అనే పర్వతశిఖరం అందం లోయను మించి ఉంటుంది. ఇక్కడ రెండు లోయలుంటాయి. ఒకటి తూర్పున, రెండోది పశ్చిమాన ఉంటాయి. తూర్పు లోయలో ఉన్న 62 సమాధులలో ఎక్కువ శాతం తొవ్వి ఉన్నాయి. ఇవి రాణుల సమాధుల కంటే చాలా పెద్దగా, అకట్టకునే విధంగా ఉన్నాయి. అక్కడ కొన్నిటి ద్వారం దగ్గరికెళ్లాలంటే కొండలమీద పైకి కిందకు నడవాల్సి ఉంటుంది. వాటిల్లో రాజులను కాల్చిన గదే కాకుండా ఇంకా అనేక పెద్దపెద్ద గదులున్నాయి.

లక్సర్ ఆలయం కార్నాక్ ఆలయం కట్టిన స్థలం కంటే చిన్న స్థలంలో కట్టారు. కానీ అది ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. కార్నాక్ ఆలయం లాగే లక్సర్ ఆలయాన్ని కూడా తేబియన్ ఆరాధ్యులైన అమున్-రె, ముట్, ఖోన్సులకు అంకితం చేశారు.

ఎస్నా

లక్సర్ నుంచి షికారు బోట్లో ఎస్నాకు వెళ్లాలి. ఇది నైలునదికి పశ్చిమాన ఉంటుంది. బోట్లో వెళ్తున్నప్పుడు ముస్లిములు బెల్లీ డ్యాన్స్ వేస్తారు. ఇక్కడ ఉన్న గ్రీసు- రోమన్ల ఆలయం ఖోనుమ్ చూడడానికి వెళ్తారు సందర్శకులు. తరువాత ఎడ్ఫు పట్టణం చూడదగినది. ఇక్కడ హోరస్ ఆలయం ఉంది. ఇది 3000 బిసి కాలం నాటిది. ఈజిప్షుల భారీ నిర్మాణాలలో ఇది చివరి కట్టడం. దీని నిర్మాణం 237 బిసి కాలంలో మొదలైంది. దీన్ని పూర్తి చేయడానికి 200 సంవత్సరాలు పట్టింది.

మొసలి దేవత

హోరస్ విజయానికి గుర్తుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో అందరు దేవుళ్లూ ఉంటారు. అక్కడి లైబ్రరీలో ఆలయాల గురించి వివరాలు, ప్రార్థనలు, ప్రణాళికలు అన్నీ నీటిమొక్కలతో చేసిన కాగితాల మీద ఉంటాయి. ఇది ప్రపంచంలోనే తొలి లైబ్రరీ పట్టికలో ఉంది.

వరదలు వచ్చినప్పుడు నైలునది ఎంతదూరం వరకు పొంగుతుందో తెలుసుకోవడం కోసం ప్రాచీన కాలంవారు నైలోమీటర్‌ను తయారుచేశారు. దీనివల్ల అధికారులకు తర్వాత పరిస్థితిని అంచనా వేయడమే కాకుండా, పన్నులు వేయడానికి ఉపయోగపడేది. వరద ఉధృతిని బట్టి, నైలునది నుంచి తమ పొలాలకు ఉన్న దూరాన్ని బట్టి రైతులు పన్నులు కట్టాల్సివచ్చేది. మొసలి దేవతగా పిలిచే సోబెక్‌కు అంకితం చేసిన ఆలయం కొమ్ ఓమ్‌బొలో ఉంది. అక్కడ మొసలులన్నీ శుభసూచకాలుగా భావించి ఆరాధిస్తారు. ఎందుకంటే వరదలు వచ్చినప్పుడు అవి వచ్చి ఆ ప్రదేశాన్ని సుసంపన్నం చేస్తాయని వారి నమ్మకం. ఇక్కడ ఆలయాల గోడలు అందమైన శిల్పాలతో అలంకరించి ఉంటాయి. ఈ శిల్పాల రూపురేఖలు గ్రీకులను పోలి, ఈజిప్షు దుస్తులలో ఉంటాయి.



అశ్వన్ డ్యామ్

నబియా దేశం అశ్వన్‌కి, సుడాన్‌కి మధ్యంలో ఉంటుంది. నైలు నది మీద 1902లో పాత ప్రాజెక్టు కట్టి, దాని ఎత్తును 1912, 1934లలో పెంచిన దగ్గరినుంచి నబియా గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. దీంతో వారు కొండలపై కొత్త ఇళ్లు కట్టుకునేవారు. కొందరు ఈజిప్షు ప్రాంతాలకు వెళ్లేవారు. కొన్ని శతాబ్దాల అనంతరం నాజర్ కొత్త డ్యామును కట్టించిన తరువాత కొండలమీద ఇళ్లు కట్టుకున్నవారు కూడా ఈజిప్షుకు వెళ్లాల్సివచ్చింది. అలా వచ్చినవారు నబియాలో తమ ఇళ్లస్థలాలను కోల్పోవడంతో వారి తరువాత తరాలవారు ఈజిప్షియన్లుగా పెరిగారు.

అశ్వన్ డ్యామ్

అశ్వన్ అనే ప్రాంతంలోనే పాత డ్యాం, కొత్త డ్యాం ఉన్నాయి. ఈ రెండు డ్యాములు కూడా సంవత్సరాల తరబడి ఈజిప్షును వరదల నుంచి కాపాడుతోంది. 30 శాతం భూమిలో సేద్యం చేస్తున్నారు. అంతేకాదు సారవంతమైన నేలను వరదల నుంచి రక్షించుకోగలుగుతున్నారు. అందువల్లే ఇప్పటికీ ఈజిప్షియన్ రైతులు తక్కువ క్రిమిసంహారక మందులను వాడతున్నారు. కొత్త డ్యామ్ చాలా పెద్దగా ఉంటుంది. ఈ డ్యామ్ రిజర్వాయరైన నాజర్ సరస్సు చాలా అందమైన ప్రదేశం. నైలునదిలోని నీరు మట్టిమట్టిగా ఎర్రగా ఉంటాయి. కానీ ఈ సరస్సులోని నీరు ఆకుపచ్చ, నీలి రంగులలో చూడ్డానికి భలేగా ఉంటాయి. ఇది ప్రపంచంలోకెల్లా అతి పెద్ద కృత్రిమ సరస్సు. దీని పొడవు 510 కిలోమీటర్లు, వెడల్పు 5-35 కిలోమీటర్లు ఉంటుంది. సమయం ఉండి కొన్ని రోజులు ఆ సరస్సులో బోటుషికారు చేయాలి గానీ అది జీవితంలో ఒక మధురానుభూతిగా మిగిలిపోతుంది. అశ్వన్‌లో అందమైన కాప్టిక్ చర్చి, ఇస్లామికుల సమాధులు ఉన్నాయి. అక్కడ చూడాల్సిన మరో ప్రదేశం ఇసిస్ ఆలయం, దాని ప్రాంగణం. ఈ ఆలయాన్ని పిలాయి ద్వీపంలో కట్టారు. వేల సంవత్సరాల నుంచి ఈ ఆలయానికి యాత్రికులు వస్తున్నారు. 19వ శతాబ్దం నుంచి ఈజిప్షులో అత్యంత పురాతనమైన పర్యాటకుల ప్రదేశంగా ఉంటోంది. కానీ పాత ప్రాజెక్టు కట్టిన దగ్గరి నుంచి రిజర్వాయర్ నీటి వల్ల సంవత్సరానికి ఆరు నెలలు ఈ ఆలయం నీటిలోనే ఉంటుంది. ఆ సమయంలో ఈ ఆలయానికి పడవలోనే వెళ్లాలి. ఇక్కడ ఇంకో కొత్త ప్రాజెక్టు కడితే ఈ ఆలయం పూర్తిగా మునిగిపోయి, ప్రపంచం ఒక గొప్ప పురాతన నిధిని కోల్పోతుందని తెలుసు. ఒక్క పిలాయిలోనే కాదు నబియాలోని తిరిగికట్టలేని అనేక పురాతన కట్టడాలు కనుమరుగవుతాయి. ఇది తెలుసుకున్న తరువాత యునెస్కో నబియాను రక్షించే చర్యలు తీసుకుంది. దీనికోసం 55 దేశాల నుంచి విరాళాలను సేకరించి ఈజిప్షు, ఇటలీ, స్వీడన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల పురావస్తుశాఖా బృందాలు ప్రణాళికలు తయారుచేశాయి. మొత్తం స్మారక చిహ్నాలను తరలించి కొత్త కట్టడాలను నిర్మించడం ఈ ప్రణాళికల్లో భాగం. అలా నీటిలో మునిగిన 14 అతిముఖ్యమైన చిహ్నాలను కాపాడగలిగారు. అందులో పదింటిని వివిధ భాగాలుగా విడదీసి ఒక్కొక్క భాగాన్ని ఈజిప్షులోనే సురక్షితమైన ఎత్తైన ప్రదేశాలకు తీసుకువచ్చి పునర్నించారు. నాలుగింటిని మాత్రం ఈ రక్షణ చర్యల్లో పాల్గొన్న దేశాలకు బహుమతిగా ఇచ్చారు. మిగిలిన పదింటిలో ఇసిస్ దేవాలయం ఒకటి. దీన్ని పిలాయి ద్వీపం నుండి తీసుకువచ్చి అశ్వన్ దగ్గరలోని అగికియా ద్వీపంలో నిర్మించారు. దీనిని దాదాపు 200 మీటర్ల దూరం, 30 మీటర్ల ఎత్తుకు మార్చారు. అశ్వన్‌కు 200 కిలోమీటర్ల దూరంలో అబు సింబెల్‌లో ఉన్న ఆలయాన్ని 210 మీటర్ల దూరం, 65 మీటర్ల ఎత్తుకు మార్చారు. ★

వికాసం

మంచి పెంపకమంటే?



డా॥ డి.ఆర్.కె ప్రసాద్

ఈరోజు వుదయం నడకకు కోటేశ్వరరావు మాస్టారు ఆలస్యంగా వచ్చారు. "ఏం గురువుగారూ! ఉదయం నిద్ర లేవడం కష్టమైపోతోందా?" అని అడిగాను.

'రాత్రి మా మనవడి స్కూల్ వార్షికోత్సవానికి వెళ్లాం. ప్రధాన వక్త ఉపన్యాసం విన్న నాకు రాత్రి నిద్రే పట్టలేదు. అందుకే ఈ ఆలస్యం" అన్నారు ఆవులిస్తూ.

"అంత గొప్ప ఉపన్యాసమా? ఇంతకీ ఏం చెప్పారు?"

"తన పిల్లల్ని ఎలా క్రమశిక్షణతో చదివించాడో, అదుపు ఆజ్ఞల్లో ఎలా ఉంచాడో, వారి నుండి ఉత్తమ ఫలితాలెలా రాబట్టాడో వివరించి, మంచి పెంపకమంటే ఏమిటో చెప్పాడు"

"ఇంతకూ ఎలా పెంచాడో తన పిల్లల్ని?"

"ఇప్పుడున్నదంతా కాంపిటీటివ్ ఫీల్డు. మన తరంలాగా చదివితే ఈ పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గుకురాలేరు" అని ఆలోచించి, ఫీజుల ఖర్చులు బాగా ఎక్కువైనా వెనుకాడక, మంచి ఇంగ్లీషు మీడియం స్కూల్లోనే చేర్చాడట. తెల్లవారు ఝామున 4.30 నిముషాలకే నిద్ర లేపి, ట్యూషన్‌కు పంపి, అక్కడి నుండి తిరిగి రాగానే ఒక్క అరగంటలోపే వాళ్లకి స్నానంచేయించి, బట్టలు తొడిగి, పుస్తకాలు సర్ది, బూట్లు తొడిగి, టిఫిన్ కూడా తనే తినిపించి, హడావిడిగా స్కూల్‌కి పంపించేవాడట.

"ఎందుకు? తమ ఈ చిన్న పనుల్ని ఆ పిల్లలే చూసుకోవచ్చు గదా?"

పిల్లలు కాబట్టి, వాళ్లకేమీ తెలియదనీ, చెడగొడతారేమోననీ, టైం వేస్టనీ, తనే వాళ్లకా పనులు చేసేవాడట.

ఇక సాయంత్రం స్కూల్ నుండి రాగానే ఆయన భార్య హడావిడిగా వాళ్ల నోట్లో టిఫిన్ కుక్కుతూ ఉంటే, ఈయన వాళ్ల చేత హోంవర్కులు చేయించేవాడట. ఆ వెంటనే సాయంత్రం ట్యూషన్‌కు పంపేవాడట. రాత్రి 9 గంటల ప్రాంతంలో ట్యూషన్ నుండి వస్తూనే వాళ్లు అలసి నిద్రకు జోగుతూ ఉంటే, ఏదోలాగ అన్నం తినిపించి, నిద్ర పుచ్చేవాడట.

"మరి ఆ పిల్లలు ఆడుకోరా?"

మొదట్లో ఎప్పుడైనా పిల్లలడిగేవారట కాసేపు ఆడుకుంటామని. ఈయన ససేమిరా అనేసరికి వాళ్లూ క్రమంగా మానేశారట. 'ఆటపాటల్తో మీరు టైం వేస్ట్ చేస్తే రేపు అతి ముఖ్యమైన పదోతరగతిలో 540 మార్కులు తెచ్చుకోకుంటే మీ భవిష్యత్తేం కావాలి?' అని గదమాయించాడట. వాళ్ల అబ్బాయికి డాక్టర్ కావాలనే బలమైన కోరిక. ఇంటర్‌లో బై.పి.సిలో చేరతానంటే 'నువ్వు మెడిసిన్ చదివి జీవితంలో స్థిరపడాలంటే కనీసం ఇక్కడి నుండి 15 ఏళ్లు పడుతుంది. అదే ఇంజనీరింగ్ అయితే ఆరేళ్లలో ఉద్యోగంలో చేరి స్థిరపడొచ్చు' అని అతి ఖరీదైన కార్పొరేట్ కాలేజీలో చేర్పించాడట.

"మరి ఆ పిల్లవాడికేది ఇష్టమో చర్చించకుండానే..."

ఆయన స్టేజి దిగగానే అదే అడిగాను. "ఆ! పిల్లలకేం తెలుసండీ? మనం పెద్దవాళ్లమే సరైన డైరెక్షన్ ఇవ్వాలి గానీ..." అన్నాడు. తన పిల్లలకిప్పటికీ తినే తిండీ, తాగే నీళ్లూ, వేసుకునే బట్టలూ తనే ఎంపిక చేస్తానని సగర్వంగా చెప్పాడు.

ఇంతకీ ఆ తర్వాత ఆయన కొడుకేం చేశాడు.

అతను ఇంజనీరింగ్ చేస్తుండగానే క్యాంపస్ సెలక్షన్‌లో ఏదో బహుళజాతి కంపెనీలో ఉద్యోగం వచ్చిందట. కుర్రవాడికి మాత్రం గవర్నమెంటు ఉద్యోగం చేయాలని వున్నా, ఈయన ససేమిరా ఒప్పుకోక కంపెనీ ఉద్యోగంలోనే చేర్చి, ఆ తర్వాత అమెరికా పంపేశాడట. మరో రెండేళ్లు తిరగకుండా ఇక్కడి ఒక మంచి కుటుంబానికి చెందిన అమ్మాయిని చూసి పెళ్లి చేశాడట. వాళ్లు ఏ పిల్లల్ని ఎప్పుడు కనాలో కూడా ఈయనే నిర్ణయించేశాడట. ఇదంతా చెప్పి మొత్తమ్మీద తన బిడ్డ జీవితాన్ని తానెంతగా ప్లాన్ చేసి చక్కని పద్ధతిలో ఎలా తీర్చిదిద్దాడో వివరించి, మంచి పెంపకం అంటే అదేనని తన ఉపన్యాసాన్ని ముగించాడు.

ఇక్కడ గమ్మత్తేమిటంటే ఆ ముఖ్య అతిథి కుమారుడు కూడా ఆ సభలో ఉన్నాడు. అది తెలిసి, అతణ్ణి అభినందించాలని వెళ్లి, పరిచయం చేసుకున్నాను. "అంత మంచి పెంపకంలో పెరిగినందుకు ఎలా ఫీలవుతున్నావు?" అని అచ్చంగా న్యూస్ ఛానెల్ రిపోర్టర్ లెవెల్లో అడిగాను.

"ఇప్పటిదాకా మా నాన్న కోసమే బతికాను. నా ఇష్టాయిష్టాలు చంపుకొని ఇంకా ఎన్నాళ్లిలా బతకాలో తెలియడం లేదు...." అని విషాద వదనంతో వాపోయాడు. సరిగ్గా ఇలాంటి కథే ఏదో సినిమాలో చూశాను."

"ఇదంతా వింటుంటే ఇంకేమైనా గుర్తుకు రావడంలేదా మాస్టారూ?"

"ఎందుకు గుర్తుకురావు!"

"తన బుల్లి జేబు రుమాలుని బాబునే ఉతుక్కోనివ్వండి. చిన్న గ్లాసులో నీళ్లను పాపనే పోసుకుని తాగనివ్వండి. పళ్లెం కడగనివ్వండి. పువ్వులు సర్దనివ్వండి – అన్నం వడ్డించనివ్వండి. ఇవన్నీ మీ చిన్నారినే చెయ్యనివ్వండి. తాను కోరుకొన్న విధంగా ప్రతి పనీ చెయ్యనివ్వండి" అన్న 'గిజూబాయి' మాస్టారి మాటలు, ఇంకా ఖలీల్ జిబ్రాన్ మాటలు కూడా గుర్తుకొస్తున్నాయి.

"మీ పిల్లలు మీ పిల్లలు కారు/ తన కోసమై తాను తపించే జీవశక్తి తహతహకు/ కుమారులు, కుమార్తెలే ఈ పిల్లలు/ మీ ద్వారా వాళ్లు ఈ లోకంలోకి వస్తారు/ కానీ, మీ భావాలకు వారసులు కానేకారు/ మీరు వాళ్లకి ప్రేమనివ్వండి, మీ ఆలోచనల్ని కాదు/ ఎందుకంటే వాళ్లకి వాళ్ల సొంత ఆలోచనలుంటాయి/ మీరు వాళ్ల తనవులకు ఆవాసాన్ని కల్పించండి, కానీ వాళ్ల ఆత్మలకు కాదు/ ఎందుకంటే వాళ్ల ఆత్మలు రేపటి గృహంలో నివసిస్తాయి/ మీరు మీ కలలోనైనా ఆ ఇంటిని సందర్శించలేరు/ మీరు వాళ్లకు మల్లే ఉండటానికి ప్రయత్నించవచ్చు/ కానీ, మీవలే వాళ్లను తయారు చేయాలని ప్రయత్నించవద్దు/ ఎందుకంటే జీవితం వెనక్కి మళ్ళదు/ నిన్న దగ్గరే కూర్చుని వుండిపోదు/ చిన్నారులంటే/ తల్లిదండ్రులనే వింటి నుండి / ఉజ్వల భవిష్యత్తులోనికి / దూసుకుపోయి, అద్భుతాలు సృష్టించే/ సజీవ బాణాలని మరువకండి".

కాలం వక్రోక్తిని గమనించండి. ఆ తండ్రేమో తన పిల్లవాడిని ఏలోటూ లేకుండా పెంచాననీ, అన్నీ అమర్చాననీ నిండు సంతోషంతో వున్నాడు. కానీ, అదే సమయంలో పిల్లవాడు మాత్రం ఆత్మను కోల్పోయి, కళావిహీనంగా, వెలితిగా, దిగులుగా వున్నాడు.

జీవపరిణామమంతటికీ తలమానికమైన, చిట్టచివరి అద్భుతంగా పేర్కొనబడుతున్న మానవ శిశువుల "మంచి పెంపకం" అంటే తగినంత "స్వేచ్ఛ"గా పెంచడమనీ, వాళ్ల "సృజనశీలతను కాపాడడమే"ననీ ఈ పెద్దవాళ్లకు ఇంకా ఎప్పటికి తెలుస్తుందో! తూర్పునుండి సూర్య కిరణాలు ఒంటిపైన తగిలి, చురుక్కుమంది. ఇక ఈరోజు నడకకు స్వస్తి.

★

ప్రమాదంలో ఆ పది

వాతావరణ కాలుష్యం మూలంగా పది ప్రధాన జీవ జాతులకు ముప్పు వాటిల్లబోతోందని కోపెన్‌హాగెన్‌లో ప్రకృతి ప్రేమికులు వాపోయారు. ఆవాసాలు నాశనమవడం వల్ల, అడవులను నరకడం వల్ల వాటికీ దుస్థితి కలిగింది.




వాతావరణం వేడెక్కడంతో ప్రమాదంలో పడిన జీవులలో పోలిప్స్ (ఒకరకమైన నాచు) అనే జాతి ఒకటి. ఇవి సముద్రంలో నివసిస్తాయి. బ్లీచింగు మూలంగా ఈ జాతి బలహీనపడి నెమ్మదిగా నశించిపోనుంది. వీటితోపాటు క్లోన్ చేపల మనుగడా ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే ఇవి నివసించేది పోలిప్స్‌లోనే. అందుకే గ్లోబల్ వార్మింగు వల్ల నశించే జీవుల జాబితాలో వీటినీ చేర్చారు. వాతావరణ కాలుష్యం పెరగడంవల్ల ఆస్ట్రేలియాలోని యూకలిప్టస్ మొక్కలు హానికర ఆమ్లాలను విడుదల చేస్తున్నాయి. దాంతో ఆ మొక్కల్నే ఆహారంగా తీసుకొనే కోలా ఎలుగుబంట్లు పస్తులుండాల్సివస్తోంది. ధ్రువప్రాంతాలలో మంచు కరిగిపోవడం వల్ల ఆర్కిటిక్ నక్కలు, తిమింగలాలు, సీల్, సాల్‌మోన్ చేపల ఉనికి కనుమరుగైపోనుంది. 'హ్యాపీ ఫీట్' సినిమాలో ముద్దుముద్దుగా అడుగులేసిన పెంగ్విన్ పక్షులు కూడా ఈ జాబితాలో ఉండడం దురదృష్టకరం. కరువు కారణంగా ఆఫ్రికాలోని క్వైవర్ జాతి చెట్లూ గ్లోబల్‌వార్మింగుకు గురికాకతప్పడం లేదు.

ఇన్ని మూగజీవాల ఉసురు పోసుకుంటున్న ధనిక దేశాలకు మాత్రం కాలుష్యాన్ని తగ్గించాలన్న ధ్యాసే లేదు. ఏం చేస్తాం!

చేపల వేట

-సాహిల్.కె



అనగనగా ఓ పిల్లి. అది మహా ముదురు. దానికెన్ని తెలివితేటలో! అసలు ఆ చిట్టి బుర్రలో అంత తెలివి ఎలా దాక్కుంది? అని తోటి పిల్లులకు బోలెడంత అసూయ. పైగా మాటల పుట్ట. ఎన్ని కబుర్లు చెప్తుందో! ఏవిషయం మీదైనా సరే! ఆపకుండా అనర్గళంగా మాట్లాడగలదు. అలాగని చెత్త వాగుడు కాదు. తను చదివింది... విన్నది... కన్నది...అలా చెప్పేస్తుంది. ఎంత కష్టమైన పనైనా సరే చిటికెలో పూర్తిచేస్తుంది. ఎంత పెద్ద చిక్కుముడినైనా ఇట్టే విప్పేస్తుంది. అలాంటి ఆ పిల్లి... ఓసారి చేపల వేటకెళ్లింది.

గేలం, ఎర్రలు, బకెట్ వెంట తీసుకెళ్లింది. పాటలు పాడుకుంటూ సముద్రం ఒడ్డున కూర్చుంది. సమయం అలా గడిచిపోతోందికానీ ఒక్క చిన్న చేప కూడా పడడంలేదు. పిల్లికి ఆశ్చర్యమేసింది.

"ఏంటబ్బా...ఎప్పుడూ లేనిది! ఇవాళ విడ్డూరంగా వుంది? ఎప్పుడూ నేను ఇలా గేలం వేయగానే అలా చేపలు పడతాయి. అలాంటిది ఇవాళ ఇంతసేపు ఎదురుచూడాల్సి వచ్చింది? కొంపదీసి సముద్రంలోని చేపలన్నీ నన్ను చూసి పారిపోయాయా ఏంటి?" అనుకుంది మనసులో.

అంతలోనే 'ఆ... నేను పిల్లిలాగా మెల్లగా నడుచుకుంటూ వచ్చాను. నేనొచ్చిన సంగతి వాటికి తెలిసే చాన్సేలేదు" అని తనకు తాను సర్దిచెప్పకుంది.

అంతేనా! ఏదైనా సాధించాలంటే ఓర్పు ముఖ్యమని కూడా అనుకుంది.

అలా కూర్చుని చూస్తూ వుంది. సమయం గడిచిపోతోంది. ఆకలి వేస్తోంది. కానీ... ఒక్క చేప కాదు కదా! చేప పిల్ల కూడా పడడం లేదు. అయినా పట్టు వీడకుండా అలా కూర్చుండిపోయింది పిల్లి.

చాలాసేపటి తర్వాత...గేలానికి ఏదో తగిలినట్టనిపించింది. గేలం పట్టుకున్న పిల్లి చెయ్యి గుంజుకుపోతోంది. అంతే...సంతోషంగా పెద్దగా ఈల వేసి...

"య్యాహూ... నా గేలానికి ఏదో పెద్ద చేపే తగిలినట్టుంది. దీని వాలకం చూస్తోంటే ఒక నెల రోజుల దాకా వేటకెళ్లే పని వుండదనిపిస్తోందే" అనుకుంది.

కష్టపడి బలమంతా ఉపయోగించి ఏమాత్రం పట్టు వదలకుండా గేలాన్ని బయటకు లాగసాగింది. వెనక్కి వెళ్తూ లాగుతూ వుంటే వస్తూ వుందికానీ బయటికేమీ కనిపించట్లా. దాంతో పిల్లి మరింత సంతోషపడిపోయింది. చాలా పెద్ద చేపే పడిందనుకుంది. అలా అలా లాగీ లాగీ లాగీ అలసిపోయింది. ఎట్టకేలకు తన గేలాన్ని, దానికి పట్టుకున్నదాన్ని బయటికి లాగింది. అయితే దాన్ని చూశాక మాత్రం నీరసపడిపోయింది.

మరి! గేలానికి పడింది చేప కాదు. పెద్ద దుంగ.

దాన్ని చూచి మొదట నీరసపడిపోయింది పిల్లి. అంత సమయం వృథా అయినందుకు! తినడానికి ఏమీ దొరకనందుకు!! చాలా బాధపడింది. అలా అని నిరుత్సాహపడలేదు. విచారపడలేదు. ఓడిపోయానని ఏడవలేదు. ఆ ఓటమి నుంచే ఓ ఉపాయం ఆలోచించింది.

దుంగను పూర్తిగా పరిశీలించింది. దాని చిట్టి బుర్రలో ఒక ఉపాయం తళుక్కున మెరిసింది. వెంటనే ఇంటికెళ్లి తనకు కావాల్సిన వస్తువులన్నీ తీసుకొచ్చింది. రంపంతో పరపరా దుంగను ముక్కలు చేసింది. చకచకా పడవ తయారీ మొదలెట్టింది. రెండు మూడు గంటల పాటు కష్టపడి చక్కటి పడవను తయారుచేసింది.

సంతోషంగా పడవతో సహా సముద్రంలోకి దిగింది. చేపలు పట్టింది. కూసినీ కాసినీ కాదు. బోలెడన్ని చేపలు పట్టింది. పైగా తనకు చేపలు కావాల్సినప్పడల్లా ఆ పడవ మీదే వేటకెళ్లడం మొదలెట్టింది.

యధా ప్రకారం దాని తెలివితేటలు చూసి మిగిలిన పిల్లులు అసూయపడ్డాయి. పెద్ద పిల్లులైతే తమ పిల్లలకు మరీ మరీ చెప్పాయి 'ఓటమి ఎదురైనప్పుడు డీలా పడిపోకుండా...అలా బుద్ధిని ఉపయోగించడం నేర్చుకోవాలి' అని.

మీరేమంటారు నేస్తాలూ!